# పత్రీజీ జ్ఞాన సందేశాలు-3

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# పత్రీజీ జ్ఞాన సందేశాలు-3



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : అక్టోబరు, 2026
ప్రతులు : 1,000

**వెల : రూ.90/-**

**పుస్తకముల కొరకు :-**

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.70/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) "అహం దేహోస్మి" నుంచి "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి ఎదగాలి | - | రూ.70/- |
| 12) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 13) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 14) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 15) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 16) పంచకోశాలు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మాయకు వశమైనవాడి లక్షణాలు | - | రూ.60/- |
| 22) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? | - | రూ.60/- |
| 23) దుఃఖానికి కారణం | - | రూ.60/- |
| 24) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 26) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 28) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 29) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 30) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 31) ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం | - | రూ.50/- |
| 32) భగవంతుని కృప | - | రూ.50/- |
| 33) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 34) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |
| 35) మనస్సు యొక్క స్థితులు | - | రూ.40/- |

# జన్మ దేనికి తీసుకున్నారో అది చేసి తీరాలి

జన్మ దేనికి తీసుకున్నారో అది చేసి తీరాలి అంటే ఏ ప్రణాళికతో భూమ్మీదకు వచ్చారో ఆ ప్రణాళిక ప్రకారం జీవించి, దాన్ని పూర్తి చేసి తీరాలి. అందుచేత మీరు మీ ప్రణాళిక ప్రకారం జీవిస్తేనే నిజంగా జీవించినట్టవుతుంది, అలా జీవించకపోతే మీ జీవితం వృథా అయినట్టే. ఇక్కడ మీరు ఒక విషయం తప్పకుండా గ్రహించాలి ప్రతి ఒక్కరూ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతోనే జన్మ తీసుకుంటారు. ఏ ప్రణాళిక లేకుండా, కాకతాళీయంగా ఎవరూ భూమ్మీదకు రాలేదు. ప్రస్తుతం మీరు ఈ భూమ్మీద ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు, గత జన్మల్లో మీరు నేర్చుకున్న విషయాలను కూడా ఇప్పుడు గుర్తు చేసుకుంటూ, మరింతగా అర్థం చేసుకుంటున్నారు.

ఈ మార్గంలోకి వచ్చే దాకా మీరు కూడా అందరి లాగే సాధారణ జీవితాన్నే గడిపారు. ఏదో ఒక విధంగా డబ్బు సంపాదించడం, సంపాదించిన డబ్బుతో వీలైనంత సుఖంగా జీవించడానికి ప్రయత్నించడం, మీ కుటుంబమే మీ ప్రపంచం అన్నట్టుగా జీవించడం ఇదే మీ జీవితం అనుకున్నారు. కానీ ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత మీరు ఒక్కసారి మిమ్మల్ని మీరు గమనించుకుంటే, మీ జీవితం పూర్తిగా భిన్నంగా మారిపోతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. మీ ఆలోచనా విధానం మారుతుంది, మీ లక్ష్యాలు మారతాయి, జీవితం పట్ల మీ అవగాహన మారుతుంది. చివరకు మీరు ఎందుకు జన్మ తీసుకున్నారో, ఏ ప్రణాళికతో భూమ్మీదకు వచ్చారో తెలుసుకుని, ఆ ప్రణాళిక ప్రకారం జీవించాలనే స్పష్టత మీలో కలుగుతుంది.

ఇంతకు ముందు మీరు జీవించిన విధానం ఒక రకంగా ఉండేది, ఇప్పుడు మీరు జీవిస్తున్న విధానం పూర్తిగా మరో రకంగా ఉంటుంది.

ఇంతకుముందు "దేహమే నేను" అన్న భావంతో జీవించారు, ఇప్పుడు "ఆత్మనే నేను" అన్న అవగాహనతో జీవిస్తున్నారు. అంతకుముందు మీ ప్రణాళికలు ఒక విధంగా ఉండేవి, ఇప్పుడు మీ ఆలోచనలు, లక్ష్యాలు, ప్రణాళికలు పూర్తిగా మారిపోయాయి. కావాలంటే మీరు ఒక్కసారి మిమ్మల్ని మీరు అబ్జర్వ్ చేసుకోండి. మీ ఆలోచనా విధానం ఎలా మారిందో, మీ పనులు ఎలా మారాయో, మీ మాటలు, అలవాట్లు, అభిరుచులు ఎలా మారాయో మీకే స్పష్టంగా తెలుస్తుంది.

ఇప్పుడు మీకు మీరే "ఇంకేం చేయాలి? ఇంకా ఏం సాధించాలి? ఆత్మ పరంగా ఎదగాలంటే ఇంకా ఏం చేయాలి?" అని ఆలోచించు కుంటున్నారు. ఈ ఆలోచన రావడమే మీలో వచ్చిన మార్పుకు నిదర్శనం. అలాగే, మీరు భూమ్మీదకు రావడానికి ముందు, ఆ పై లోకాల్లో ఉన్నప్పుడు, మీకంటే గొప్ప అనుభవం కలిగిన మాస్టర్స్, తపోలోక మాస్టర్స్, సత్యలోక మాస్టర్స్, పూర్ణజ్ఞానం పొందిన వారు, మీలాంటి ఎదుగుతున్న ఆత్మలకు కౌన్సెలింగ్ చేస్తారు. "ఇంతవరకు ఏం చేశారు? అసలు ఇంకా ఏం చేయాలి? మీరు ఎవరు? ఏ ఉద్దేశంతో భూమ్మీదకు వస్తున్నారు? మీ లక్ష్యం ఏమిటి?" వంటి ఎన్నో విషయాలను మీతో చర్చించి, మీకు సరైన గైడెన్స్ ఇస్తారు.

వారి సమక్షంలో మీరు మీకు సంబంధించిన ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. "ఇంతకుముందు ధ్యానం చేయలేదు, ఇప్పుడు ఈ జన్మలో అయినా ధ్యానం చేయాలి, ఇంతకుముందు జ్ఞానం సంపాదించుకోలేదు, ఇప్పుడు జ్ఞానం సంపాదించుకోవాలి" అని నిర్ణయించుకుంటారు. ఇది పూర్తిగా ఎదిగిన ఆత్మలకే పరిమితం కాదు, ఎదుగుతున్న ఆత్మలకు కూడా ఇలాంటి ఆలోచనలు, చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. "ఇదివరకు మాంసాహారం తీసుకున్నాను, ఇకపై తీసుకోకూడదు. ఇంతకుముందు ఎలాంటి సాంగత్యంలో

ఉన్నాను? ఇకపై జ్ఞాన వంతుల సాంగత్యం చేయాలి. ఇది వరకు ఎంతో సమయాన్ని వృథా చేశాను, ఆత్మకు లాభం కలిగించే పని ఒక్కటి కూడా చేయలేదు. ఇకపై నా సమయాన్ని వృథా చేయకూడదు, ఆత్మకు లాభం కలిగించే పనులు చేయాలి" అని నిర్ణయించుకుంటారు. అలాగే, "ఇది వరకు సంసారం కోసమే నా జీవితమంతా గడిచిపోయింది, ఇకపై సంసారంతో పాటు ఆత్మకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. నా జీవితంలో ఆధ్యాత్మిక ఎదుగుదలకు కూడా స్థానం కల్పించాలి" అని నిర్ణయించుకుంటారు. ఇలా గతంలో మీరు ఏం చేశారో, ఇకపై ఏం చేయాలో అర్థం చేసుకుని, మీ ఆత్మ ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు.

ఇలా మీరు ఇంతకు ముందు ఏం చేశారో, ఇప్పుడు ఏం చేయాలో అర్థం చేసుకుని, మీ ఆత్మ ఎదుగుదలకు అవసరమైన విధంగా ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. అక్కడే ఏమేమి చేయాలి, ఎలా ప్రవర్తించాలి, ఎలా జీవించాలి అనే విషయాలను నిర్ణయించుకుని, "ఇప్పుడు భూమ్మీదకు వెళ్తాను" అని అనుకుంటారు. కానీ విచిత్రం ఏమిటంటే? భూమ్మీదకు వచ్చిన తర్వాత ఆ ప్రణాళిక అంతా మర్చిపోతారు. ఈ మరుపు ఉండడం వల్లే మీరు మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకుంటున్నారు. ఈ మరుపు లేకపోతే ఇన్ని జన్మలు ఎందుకు పడతాయి? నేను మొదట్లో చాలా సార్లు అనుకునేవాడిని "పత్రి గారు 400, 500 జన్మలు అంటున్నారు అసలు అన్ని జన్మలు ఎందుకు? మోక్షం పొందాలంటే ఈ ఒక్క జన్మలోనే సాధించలేమా?" అని. కానీ తర్వాత నాకు అర్థమైంది 400 జన్మల్లో కనుక ఆత్మ పరంగా ఎదిగి, మోక్షాన్ని సాధించినట్లయితే, అది కూడా చాలా గొప్ప ప్రయత్నమే అనిపించింది. ఎందుకంటే భూమ్మీదకు వచ్చిన తర్వాత ఎన్ని ప్రలోభాలు ఉంటాయి, ఎన్ని మమకారాలు ఉంటాయి, ఎన్ని ఆకర్షణలు ఉంటాయి, ఎన్ని కోరికలు

ఉంటాయి! వీటన్నింటినీ అధిగమించి, వచ్చిన ప్రణాళిక ప్రకారం జీవించడం అంత సులభమైన విషయం కాదు. పరిసరాల ప్రభావం, కుటుంబ ప్రభావం, కుటుంబ సభ్యుల ప్రభావం, సమాజ ప్రభావం ఇలా ఎన్నో ప్రభావాలు మిమ్మల్ని మీ అసలు లక్ష్యం నుంచి ప్రక్కదారి పట్టిస్తాయి.

కొంతమంది పిల్లల గురించి, కొంతమంది భర్త గురించి, కొంత మంది భార్య గురించి, కొంతమంది సంపాదన గురించి, మరి కొంతమంది సంపాదించినదాన్ని కాపాడుకోవడం గురించి ఆలోచిస్తూ జీవితమంతా గడిపేస్తారు. ఏదో ఒక విషయంలో ఇరుక్కుపోయి, "నా జీవితం ఇదే" అని భావిస్తారు. అందుకే పత్రీ గారు చెప్పారు "జన్మ దేనికి తీసుకున్నారో అది చేసి తీరాలి. ఏ ప్రణాళికతో భూమ్మీదకు వచ్చారో! ఆ ప్రణాళిక ప్రకారం జీవించి తీరాలి" అని.

అంతేకాదు, ''అలా జీవిస్తే జీవించినట్టు, జీవించకపోతే మరణించినట్టు" అని ఎంతో తీవ్రంగా చెప్పారు. మీరు వేసుకున్న ప్రణాళికకు భిన్నంగా జీవిస్తూ ఉంటే, అది నిజమైన జీవితం కాదు, జీవించి ఉన్నప్పటికీ మరణించినట్టే. ఎందుకంటే జన్మ తీసుకుని ఒక యాభై సంవత్సరాలు బ్రతకడం మాత్రమే జీవితం కాదు. ఆ జీవితం వల్ల మీ ఆత్మకు ఏం ఉపయోగం కలిగింది అనేదే అసలు ప్రశ్న. అందుకే ఒక గొప్ప యోగి, ఆత్మ ఎదుగుదలకు ఉపయోగపడని విధంగా జీవించే వారిని "ఆత్మ హంతకులు" అన్నారు. జీవించి ఉండగానే ఆత్మ పరంగా మరణించడం, ఆత్మ హంతకులుగా జీవించడం రెండూ ఒకటే.

మీరు ఒక ప్రణాళికతో భూమ్మీదకు వస్తారు. కానీ ఇక్కడి పరిసరాల ప్రభావం, కుటుంబ ప్రభావం, సమాజ ప్రభావం వల్ల అసలు మీరు ఎవరో కూడా మర్చిపోతారు. మీరు స్త్రీ అనుకుంటారు, కానీ మీరు స్త్రీ కాదు, పురుషుడు

అనుకుంటారు, కానీ మీరు పురుషుడు కాదు, మీరు ఒక కులానికి చెందినవారనుకుంటారు, కానీ మీరు ఆ కులం కాదు, ఒక మతానికి చెందినవారనుకుంటారు, కానీ మీరు ఆ మతం కాదు. “నా భార్య” అంటారు, “నా భర్త” అంటారు, “నా పిల్లలు” అంటారు. కానీ అసలు మీరు ఎవరు? ఈ సంబంధాలన్నీ ఈ జన్మకు సంబంధించినవే. మీరు పైకి వెళ్ళిన తర్వాత ఈ విషయాలన్నీ స్పష్టంగా అర్థమవుతాయి. ఇవేవీ మీ అసలు స్వరూపానికి శాశ్వతమైన సంబంధాలు కావు. అయితే మీరు జీవించి ఉండగానే ఈ సత్యాన్ని తెలుసుకోగలిగితే మీరు చాలా అదృష్టవంతులు. “వీటితో నాకు అవసరమైనంత వరకే సంబంధం ఉంది. నా అసలు ప్రణాళిక వేరు” అనే అవగాహన మీకు కలిగినప్పుడు, మీరు అవసరాలకే పరిమితం అవుతారు. దాని అర్థం కుటుంబాన్ని వదిలేయడం కాదు, సంబంధాల నుంచి దూరమవడం కాదు. వాళ్ళతో ఉండవచ్చు, వాళ్ళను ప్రేమించవచ్చు, మీ బాధ్యతలను నిర్వర్తించవచ్చు.

కానీ అవసరం లేని విషయాలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా, మమకారాన్ని తగ్గించుకుని జీవించడం నేర్చుకుంటారు. అప్పుడు మీ సమయాన్ని వృథా చేయరు, మీ జీవితాన్ని వృథా చేసుకోరు, చేయవలసిన పనిని, మీ ఆత్మ ఎదుగుదలకు ఉపయోగపడే పనిని మాత్రమే చేయడానికి ప్రయత్నిస్తారు. అందుకే మీరు గుర్తుపెట్టుకోవాలి జన్మ దేనికి తీసుకున్నారో అది చేసి తీరాలి, ఏ ప్రణాళికతో మీరు భూమ్మీదకు వచ్చారో, ఆ ప్రణాళికను పూర్తి చేసి తీరాలి. పైలోకాల్లో మీరు వేసుకున్న ఆ ప్రణాళిక కూడా మీ స్థాయికి, మీ ఆత్మ ఎదుగుదలకు తగినదే. మీరు చేయగలిగినదానినే నిర్ణయించుకుంటారు, కాబట్టి మీకు వచ్చిన ఈ జన్మను, ఈ అవకాశాన్ని తక్కువగా అంచనా వేయకండి.

మీరంతా కూడా ఆ పూర్ణాత్మ నుంచి వచ్చిన వారే, పూర్ణాత్మ యొక్క అంశలే. పూర్ణాత్మ ఎవరో, మీరు కూడా అదే స్వరూపం, మీరు ఆయనలోని

ఒక భాగం మాత్రమే. అందుచేత మీరు వేరేమీ కాదు, మీ అసలు స్వరూపాన్ని గుర్తించి, మీరు వచ్చిన ప్రణాళికను తెలుసుకుని, ఆ ప్రణాళిక ప్రకారం జీవించడమే మీ జీవితానికి అసలైన అర్థం.

పూర్ణాత్మ మిమ్మల్ని ఎప్పటికీ విస్మరించదు. మీ బాగోగులను చూసుకుంటూనే ఉంటుంది, మిమ్మల్ని ఎప్పటికప్పుడు అబ్జర్వ్ చేస్తూనే ఉంటుంది. ఎన్నో సందర్భాల్లో మీకు సహకరించి, మిమ్మల్ని ముందుకు నడిపించడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. మీ అంతరంలో నుంచి మీకు స్ఫురించే సందేశాల ద్వారా, మీ ఆత్మ ఎదుగుదలకు ఏం చేయాలో సూచిస్తూ, ఆ దిశగా మిమ్మల్ని నడిపిస్తూ ఉంటుంది.

కానీ మనసు ప్రభావం వల్ల మీరు ఆ అంతర సందేశాలను పట్టించుకోరు, నిర్లక్ష్యం చేస్తారు, ప్రక్కన పెట్టేస్తారు. ఎందుకంటే మీ మనసంతా మీ చుట్టూ ఉన్న ప్రాపంచిక ప్రభావాలపైనే ఉంటుంది. సంసారం కావాలి, సంపాదన కావాలి, ఈ ప్రపంచంలో ఉన్న సుఖాలన్నీ కావాలి, భర్త కావాలి, భార్య కావాలి, పిల్లలు కావాలి. “సంసారం వదిలేస్తే ఏమైపోతుంది?” అని అనుకుంటారు. కానీ వదలక ఏం చేస్తారు? కొంతకాలం తర్వాత ఎవరైనా, ఏదైనా వదలాల్సిందే. ఈ భూమ్మీద శాశ్వతంగా ఎవరూ ఉండరు.

అందుచేత సంసారాన్ని వదిలేయడం కాదు, దానిపై ఉన్న మమకారాన్ని తగ్గించుకోవడం నేర్చుకోవాలి. మమకారం తగ్గించుకోవడం అంటే వాళ్ళతోనే ఉండవచ్చు, వాళ్ళను ప్రేమించవచ్చు, మీ బాధ్యతలను నిర్వర్తించవచ్చు. కానీ “వాళ్ళ కోసమే నా జీవితం, వాళ్ళు లేకపోతే నాకు జీవితం లేదు” అనుకోవడమే మమకారం.

కొంతమంది భర్త చనిపోతే భార్య ఆత్మహత్య చేసుకుంటుంది, కొంతమంది పిల్లలు పరీక్షలో ఫెయిల్ అయితే ఆత్మహత్య చేసుకుంటారు,

మరికొంతమంది వ్యాపారంలో నష్టం వస్తే ఆత్మహత్య చేసుకోవాలని భావిస్తారు. అంటే ఎవరో ఒకరి కోసం, ఏదో ఒక విషయాన్ని సాధించడం కోసం, డబ్బు సంపాదించడం కోసం మాత్రమే భూమ్మీదకు వచ్చినట్టుగా భావిస్తున్నారు. కానీ మీరు భూమ్మీదకు వచ్చిన అసలు ఉద్దేశం డబ్బు సంపాదించడం కాదు, మీరు సంపాదించుకోవలసిన అసలైన సంపద జ్ఞానం.

ఈ విషయాలన్నీ ఒక సద్గురువును ఆశ్రయించినప్పుడు, ఆయన బోధల ద్వారా మీకు క్రమంగా స్పష్టంగా అర్థమవుతాయి. పత్రి గారు అందుకే **"నువ్వు ప్రణాళిక ప్రకారం జీవిస్తే జీవించినట్టు, జీవించకపోతే మరణించినట్టు"** అని చెప్పారు. దానికి ఉదాహరణగా రాముడిని, అర్జునుడిని చెప్పారు. రావణ సంహారం కోసం రాముడు పుట్టాడు, రావణ సంహారమే ఆయన ప్రణాళిక. యుద్ధం చేయడం కోసం అర్జునుడు పుట్టాడు, యుద్ధం చేయడమే ఆయన ప్రణాళిక. తన ప్రణాళిక ప్రకారం జీవించడంలో రాముడు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. అడవికి వెళ్ళమంటే "వెళ్ళను" అనలేదు, "వాయిదా వేయండి" అనలేదు, "ఆలోచిస్తాను" అనలేదు, వెంటనే వెళ్ళి, చివరకు తన ప్రణాళికను పూర్తి చేశాడు, అదే ప్రణాళిక ప్రకారం జీవించడం అంటే. అర్జునుడు కూడా యుద్ధం ప్రారంభంలో భయపడ్డాడు. "ఇంతమంది బంధువులను చంపి నేను ఏం సాధించాలి?" అని ఆలోచించాడు.

అప్పుడు శ్రీకృష్ణుల వారు అతనికి ఆత్మజ్ఞానాన్ని బోధించి, "ఇక్కడ పుట్టేవాడు లేడు, చచ్చేవాడు లేడు, చంపేవాడు లేడు అందరూ ఆత్మలే" అనే సత్యాన్ని అర్థమయ్యేలా చెప్పారు. మీరు ఈ జ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకుంటే, ప్రపంచంలో జరిగే ఎన్నో విషయాలను చూస్తే మీ దృష్టి కూడా మారిపోతుంది. ఈ ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి, గొడవలు జరిగాయి, ఆవేశాలు, కోపాలు, చంపుకోవడాలు జరిగాయి. కానీ ఇప్పుడు వాళ్ళలో ఎవరు ఉన్నారు?

ఈరోజు ఉన్న రాజకీయాలు, దేశాల మధ్య శత్రుత్వాలు కూడా అంతే. కొంతకాలం తర్వాత ఎవ్వరూ ఉండరు. ఇప్పుడు ఏదో జరుగుతుందని మీరు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జరిగేది జరుగుతుంది, దానిపై మీ దృష్టిని, మీ ఆసక్తిని ఎందుకు పెట్టాలి? మీరు ఆత్మలు, మీ ప్రణాళిక వేరు కాబట్టి మీ ప్రణాళిక ప్రకారం మీరు జీవించండి.

"నాకు నా ప్రణాళిక ఎలా తెలుస్తుంది?" అని మీరు అడగవచ్చు. మీరు ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు అబ్జర్వ్ చేసుకుంటూ ఉంటే, మీలో ఒక అంతర్గత ప్రేరణ కనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ ఆ ప్రేరణను గమనించగలిగే స్థాయికి ఎదగాలి. మీరు మీ అసలు ప్రణాళికకు విరుద్ధంగా జీవిస్తున్నప్పుడు మీ అంతరంలో క్షోభ, అసంతృప్తి కలుగుతుంది. ఇది మీకు మరింత స్పష్టంగా ఎప్పుడు అర్థమవుతుంది అంటే, మీరు సాధనను తీవ్రంగా చేసినప్పుడు. సాధన వల్ల మనసు శుద్ధి అవుతుంది, మనసు ఎంత శుద్ధి అవుతుందో అంతగా ఆత్మ యొక్క ప్రబోధం మీకు స్పష్టంగా అర్థమవుతుంది

పూర్ణాత్మలో భాగమైన ఆత్మ మిమ్మల్ని ఎప్పటికీ వదలదు, మీరు మళ్ళీ పూర్ణాత్మ స్థితిని చేరుకునే వరకు మిమ్మల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. కానీ మనసు ప్రభావంతో మీరు అంతరం నుంచి వచ్చే ఆత్మ సందేశాలను వినకుండా ప్రక్కన పెట్టేస్తారు. మీ మనసంతా చుట్టూ ఉన్న ప్రపంచం మీదే ఉంటుంది. సంసారం, సంపాదన, సుఖాలు, సంబంధాలు ఇవన్నీ కావాలని కోరుకుంటుంది. కానీ మీరు ఈ విషయాలన్నింటినీ అవసరాల వరకే పరిమితం చేసుకుని, మమకారాన్ని తగ్గించుకుని జీవించడం నేర్చుకోవాలి.

అప్పుడు మీ సమయాన్ని వృథా చేయరు, మీ జీవితాన్ని వృథా చేసుకోరు, చేయవలసిన పనిని, మీ ఆత్మ ఎదుగుదలకు ఉపయోగపడే పనిని మాత్రమే చేయడానికి ప్రయత్నిస్తారు. ఒక సద్గురువు మీ జీవితంలోకి

వచ్చినప్పుడు ఈ విషయాలన్నీ మరింత స్పష్టంగా అర్థమవుతాయి. రాముడు తన ప్రణాళిక ప్రకారం జీవించాడు, అర్జునుడు తన ప్రణాళిక ప్రకారం జీవించాడు, అలాగే మీ ప్రతి ఒక్కరికీ ఒక ప్రణాళిక ఉంది.

ఆ ప్రణాళిక ప్రకారం మీరు జీవించాలి. సకల భోగాలను అనుభవించగల స్థితిలో ఉన్నప్పటికీ, తన ప్రణాళిక కోసం రాజ సుఖాలను వదిలి అడవికి వెళ్ళి నేలమీద పడుకుంటూ, ఆకులు అలములు తింటూ జీవించిన రాముడు లాంటి వారి జీవితాలను మీరు గుర్తు చేసుకోవాలి. ఎందుకంటే వారికి భోగాల కంటే తమ ప్రణాళిక, తమ లక్ష్యం, తమ బాధ్యత ముఖ్యమని భావించారు. అదే నిజమైన జీవితం.

అందుకే **"జన్మ దేనికి తీసుకున్నారో అది చేసి తీరాలి, ఏ ప్రణాళికతో భూమ్మీదకు వచ్చారో, ఆ ప్రణాళిక ప్రకారం జీవించి తీరాలి"** అని చెప్పారు. మీరు ఆత్మలు, మీరు దేహం కాదు. ఈ మాయా ప్రపంచంలో మీరు ఎన్ని ప్రలోభాల మధ్య ఉన్నా, మీ అసలు స్వరూపాన్ని గుర్తించి, మీ ప్రణాళికను తెలుసుకుని, ఆ ప్రణాళిక ప్రకారం జీవించగలిగితే, మీకంటే గొప్పగా జీవించిన వారు ఎవరూ ఉండరు.

# ఆత్మ జ్ఞాని చావు గురించి తెలుసుకున్నవాడు, నిర్భయంగా ఉంటాడు

ఆత్మ జ్ఞాని చావు గురించి తెలుసుకున్నవాడు అంటే, ఈ లోకంలో చాలామంది చావు అంటే ఏమిటో తెలియకుండానే జీవిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు చనిపోతారని తెలుసు. కానీ అసలు చనిపోవడం అంటే ఏమిటి? చనిపోయిన తర్వాత ఏమవుతుంది? నిజంగా చనిపోయేది ఎవరు? ఈ విషయాల గురించి మాత్రం చాలామంది తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎంత సేపూ జీవితంలో ఏం చేయాలి, ఎలా సుఖంగా ఉండాలి, ఎలా ఎంజాయ్ చేయాలి, తాను బాగుండాలి, తన కుటుంబం బాగుండాలి, ఏ లోటూ లేకుండా సుఖంగా జీవించాలి అనే దాని మీదే దృష్టి పెడతారు. ఇవన్నీ అవసరమే, కానీ మీరు ఇంకా కొన్ని ముఖ్యమైన విషయాలను కూడా తెలుసుకోవాలి.

ముఖ్యంగా మీరు తప్పకుండా చావు గురించి తెలుసుకోవాలి. ఎందుకంటే చావు గురించి తెలుసుకోవడం అంటే జీవితానికి సంబంధించిన ఒక గొప్ప సత్యాన్ని తెలుసుకోవడం. ఆ సత్యాన్ని తెలుసుకున్న వాడినే ఆత్మ జ్ఞాని అంటారు. చావు గురించి తెలుసుకోవాలంటే, ముందుగా "నేను దేహం కాదు, నేను ఆత్మను" అనే సత్యం మీకు స్పష్టంగా అర్థం కావాలి. ఈ ఒక్క విషయం మీకు అర్థం కాకపోతే చావు గురించి కూడా మీకు సరైన అవగాహన కలగదు. ఎవరో చెప్పారని వినడం, పుస్తకంలో చదవడం లేదా అర్థమైందని అనుకోవడం మాత్రమే సరిపోదు. "నేను దేహం కాదు, నేను ఆత్మను" అనే విషయంపై మీరు స్వయంగా విచారణ చేసి, ఆలోచించి, నిర్ధారణకు రావాలి.

పత్రి గారు పరిచయం కాకముందు నాకు కూడా ఈ విషయం గురించి ఏమీ తెలియదు. కానీ ఆయన పరిచయం అయిన తర్వాత, "నువ్వు

దేహం కాదు, నువ్వు ఆత్మవు" అని చెప్పినప్పుడు మొదట నాకు పూర్తిగా అర్థం కాలేదు. అప్పుడు నేను ఆ విషయం గురించి బాగా స్టడీ చేశాను. చాలా పుస్తకాలు చదివాను. ఎంతోమంది సందేశాలు విన్నాను. ఎంతో మందితో చర్చించాను. ఇలా తెలుసుకునే ప్రయత్నం చేస్తూ, విచారణ చేసిన తర్వాత "నేను దేహం కాదు, నేను ఆత్మను" అనే విషయం నాకు బాగా అర్థమైంది. ఈ విషయం అర్థమైన తర్వాత మళ్ళీ ఇంకొక ఆలోచన మొదలవుతుంది. "నేను ఆత్మను" అని తెలుసుకున్న తర్వాత అసలు ఆత్మ అంటే ఏమిటి? ఆత్మ స్వభావం ఏమిటి? ఆత్మకు చావు ఉందా? ఆత్మ శాశ్వతమా? అనే విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి కలిగింది.

అలా ఆత్మ గురించి అవగాహన చేసుకుంటూ వెళ్తే, ఆత్మకు చావు లేదని, ఆత్మ శాశ్వతంగా ఉంటుందని, ఆత్మకు ఏ రూపమూ లేదని, ఆత్మ అనంతమైన శక్తి కలదని ఇలా ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను. చివరికి ఆ ఆత్మ ఎవరో కాదు, "ఆత్మే నేను" అనే విషయాన్ని కూడా తెలుసుకోగలిగాను. అప్పుడు ఆత్మనే నేను అయినప్పుడు, ఈ దేహం నేను ఎలా అవుతుంది? "నేను దేహం కాదు, నేను ఆత్మను" అనే విషయం అర్థమైనప్పుడు నా జీవితాన్ని చూసే విధానమే మారిపోయింది. ఎందుకంటే అప్పటివరకు నేను దేహం గురించి ఆలోచిస్తూ ఉన్నాను. కానీ నేను ఆత్మను అని తెలుసుకున్న తర్వాత, నా ఆలోచనలు, నా నిర్ణయాలు, నా జీవన విధానం, నేను చేసే పనులు, నేను చూసే ప్రపంచం ఇవన్నీ క్రమంగా మారడం మొదలయ్యింది. ఈ సత్యాన్ని నిజంగా అర్థం చేసుకున్న తర్వాత నా జీవితంలో కూడా విపరీతమైన మార్పులు వచ్చాయి.

నా సంపాదనలో మార్పు వచ్చింది, నా ఆలోచనా విధానం మారింది, నేను చేసే పనులు మారిపోయాయి, నేను చేసే సేవలు మారిపోయాయి,

నేను పెట్టే ఖర్చులు మారిపోయాయి. మొత్తంగా నా జీవితమే మారిపోయింది. అంతకుముందు నేను చేసే పనులన్నీ దేహ లాభం కోసమే ఉండేవి. కానీ "నేను దేహం కాదు, నేను ఆత్మను" అనే విషయం అర్థమైన తర్వాత, నేను చేసే పనులన్నీ ఆత్మ లాభం కోసం చేయడం మొదలుపెట్టాను. అప్పుడు మళ్ళీ ఆలోచిస్తే, "అసలు ఈ ఆత్మ అయిన నేను ఎక్కడి నుంచి వచ్చాను?" అనే ప్రశ్న వచ్చింది.

ఇక్కడి వరకు తెలుసుకున్న తర్వాత, "నేను పైలోకాల నుంచి వచ్చాను", "పైలోకాలు అంటే ఎన్ని లోకాలు ఉన్నాయి? నేను ఏ లోకంలో ఉండే వాడిని? ఆ లోకాల నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చాను?" అనే ఎన్నో ప్రశ్నలు వస్తాయి. అందుచేత ప్రతి విషయం గురించి లోతుగా ఆలోచించాలి, ప్రతి విషయాన్ని విచారణ చేస్తూ వెళ్తే మీకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. మీకు ఒకరు చెప్పింది వేరు, మీ అంతట మీరు గ్రహించింది వేరు. మీరు స్వయంగా విచారణ చేసి గ్రహించింది, మీరు అనుభవంతో నేర్చుకున్నది శాశ్వతంగా మీలో ఉండిపోతుంది. ఒకరు చెప్పింది మీకు తెలుస్తుంది కానీ, అది ఆచరణలోకి రాదు.

అందుచేత, పైలోకాలలో ఉన్న ఆత్మ అయిన మీరు ఇంకా ఉన్నతమైన లోకాలను చేరుకోవడానికి భూమ్మీదకు వచ్చి ఒక దేహాన్ని తీసుకోవాలి. కాబట్టి ఆత్మ అయిన మీరు భూమ్మీదకు వచ్చి, తల్లి గర్భంలో తయారయ్యే ఒక శరీరంలో ప్రవేశించడం జరుగుతుంది. ఎప్పుడైతే ఆత్మ అయిన మీరు తల్లి గర్భంలో తయారవుతున్న శరీరంలోకి ప్రవేశిస్తారో, అప్పుడే ఆత్మకు, ఆ శరీరానికి ఒక కనెక్షన్, ఒక లింక్ ఏర్పడుతుంది, దాన్నే సిల్వర్ కార్డ్ అంటారు. అలా తొమ్మిది మాసాలు పూర్తయ్యాక మీరు జన్మ తీసుకుంటారు. అలాగే పైన నిర్ణయించుకున్న ప్రకారం, భూమ్మీద ఎన్ని సంవత్సరాలు ఉండాలో కూడా ముందుగానే

నిర్ణయించుకుంటారు. మీరు అలా నిర్ణయించుకున్న కాలాన్నే ఆయుష్షు అంటారు. ఆయుష్షు తీరిపోగానే ఏదో ఒక రూపంలో ఈ సిల్వర్ కార్డ్ తెగిపోతుంది. అది రోగం కావచ్చు, యాక్సిడెంట్ కావచ్చు, లేకపోతే సహజ సిద్ధంగా జరగవచ్చు. టైం అయిపోతే ఆయుష్షు అయిపోతుంది. అది ఎప్పుడు అన్నది మాత్రం ఎవరికీ తెలియదు. ఎప్పుడు ఆ సమయం పూర్తవుతుందో, అప్పుడు ఆత్మ అయిన మీరు ఆ శరీరం నుంచి బయటకు వస్తారు. కానీ బయట ఉన్న వాళ్ళు మాత్రం "వీడు చనిపోయాడు" అని అనుకుంటారు. నిజానికి అది చనిపోవడం కాదు, ఆత్మ శరీరాన్ని వదిలేయడం.

ఒక మనిషి చిరిగిపోయిన బట్టలను వదిలేసి కొత్త బట్టలు ఎలా ధరిస్తాడో, అలాగే ముసలిదైపోయిన, పనికి రాని శరీరాన్ని వదిలేసి మళ్ళీ కొత్త శరీరాన్ని ధరిస్తాడు. లోకంలో శరీరాన్ని వదిలేయడాన్నే చావు అని అనుకుంటారు. కానీ ఈ విషయం ఆత్మ జ్ఞానికి స్పష్టంగా తెలుసు. "నేను అనుకున్న పని అయిపోయింది. ఈ శరీరంతో నేర్చుకోవాల్సినవి నేర్చుకున్నాను, చేయాల్సినవి చేశాను. ఇప్పుడు నా శరీరాన్ని నేను వదిలేశాను" అని ఆత్మ జ్ఞాని భావిస్తాడు. కానీ అజ్ఞానులు మాత్రం "చనిపోయాడు" అని చెప్పి బోరున ఏడుస్తారు. ఎవరు చనిపోయినా ఏడుస్తారు. ముఖ్యంగా దగ్గరి వాళ్ళు చనిపోతే మరింత బాధపడతారు.

కానీ ఆత్మ జ్ఞాని అయితే, తాను ఎప్పుడో ఒకరోజు శరీరాన్ని వదిలేయాల్సిందేనని తెలియడం వల్ల ఏడవడు, బాధపడడు. భర్త అయినా, భార్య అయినా, పిల్లలైనా, తల్లిదండ్రులైనా ఎంత దగ్గరి వారైనా సరే, ఆత్మ జ్ఞాని వారి శరీరాన్ని వదిలేయడాన్ని చూసి బాధపడరు. ఎందుకు బాధపడరు? అంటే చావు గురించి తెలుసుకున్నారు. "ఆత్మ అయిన నేను ముసలిదైపోయిన శరీరాన్ని వదిలేశాను. ఆ శరీరం ఇక ఎందుకు పనికి రాకుండా అయి

పోయింది? దానితో నేను ఇంక ఏం చేయగలను?" అని ఆత్మ జ్ఞాని ఆలోచిస్తాడు. ఒక సమయంలో ఆ శరీరం ఇంట్లో వాళ్ళందరికీ కూడా భారంగా మారుతుంది. ఆ శరీరానికి సేవ చేయడానికి, దానికి కావాల్సినవి సమకూర్చడానికి ఇంట్లో వాళ్ళు ఎంతో కష్టపడాల్సి వస్తుంది. "ఇంకా ఎప్పుడు పోతాడురా?" అని అనుకునే పరిస్థితి కూడా రావచ్చు.

మీరు ఎక్కువ కాలం జీవించినా, శరీరం పూర్తిగా పనికి రాకుండా పోతే ఇంట్లో వాళ్ళకు ఆ శరీరం భారమే! ఈ విషయాన్ని ఆత్మ జ్ఞాని అర్థం చేసుకుంటాడు. ఎందుకంటే పనికిరాని పాత శరీరాన్ని వదిలేస్తే, ప్రకృతి మళ్ళీ కొత్త శరీరాన్ని ఇస్తుందనే అవగాహన అతనికి ఉంటుంది. కొత్త శరీరం వస్తే జీవితం ఎంత గొప్పగా ఉంటుందో మీరు ఒక్కసారి ఆలోచించండి. మీరు ముసలి వాళ్ళ జీవితాన్ని, యవ్వనంలో ఉన్న వాళ్ళ జీవితాన్ని ఒక్కసారి పోల్చి చూడండి, మీకే అర్థమవుతుంది. యవ్వనంలో ఉన్న శరీరంతో ఎన్నో పనులు చేయగలరు, ఎన్నో అనుభవాలు పొందగలరు, ఎన్నో విషయాలు నేర్చుకోగలరు. అలాంటి కొత్త శరీరం వస్తూ ఉంటే, ఇక పనికిరాని పాత శరీరాన్ని వదిలేయడానికి ఎవరు బాధపడతారు? బాధపడరు.

ఆత్మజ్ఞానం ఉంటే భయపడరు, నిర్భయంగా ఉంటారు, సిద్ధంగా ఉంటారు. ఆత్మ జ్ఞానికి ఈ విషయం తెలుసు. "ఈ ముసలిదైపోయిన శరీరంతో ఇక ఇంతకన్నా నేను ఏం చేయలేను. ఈ శరీరంతో చేయాల్సినవి, నేర్చుకోవాల్సినవి, సాధించాల్సినవి పూర్తయ్యాయి. ఈ శరీరాన్ని వదిలేసి కొత్త శరీరం నేను తీసుకుంటే, ఇంకా చేయవలసినది కానీ, సాధించవలసినది కానీ సాధించగలను" అని తెలుసుకుంటాడు.

అందుకే తన శరీరాన్ని వదిలేయడానికి, అంటే చనిపోవడానికి భయపడడు. ఇవన్నీ తెలుసుకున్నాడు కాబట్టి. చనిపోవడం అంటే ఆత్మ అయిన

తాను చనిపోవడం కాదు, తాను ధరించిన శరీరం ఇక పనికిరాదని వదిలివేయడం మాత్రమే అనే సత్యాన్ని ఆత్మ జ్ఞాని తెలుసుకున్నాడు.

మళ్ళీ ఫ్రెష్‌గా కొత్త శరీరం వస్తూ ఉంటే, ఈ శరీరంతో ఇక ఎందుకు పాట్లు పడాలి? ఏం చేస్తారు? ఏం సాధిస్తారు? ఏం నేర్చుకుంటారు? శరీరం సరిగ్గా కదలదు, ఎక్కడికీ వెళ్ళలేరు, ఎక్కడికి వెళ్ళాలన్నా ఎవరో ఒకరి సహాయం కావాలి, పుస్తకాలు చదివే ఓపిక ఉండదు, ఏ పని చేయాలన్నా శరీరం సహకరించదు. అందుకే ఆత్మ అయిన మీరు ఆ శరీరాన్ని వదిలేయాలని చూస్తారు. ఇప్పటికే ఈ శరీరంతో ఎన్నో చేశారు, ఎన్నో విషయాలు తెలుసుకున్నారు, ఇంకా నేర్చుకోవాలి, ఇంకా ఎదగాలి, ఇంకా జ్ఞానం పొందాలి. అందుచేత ఆ శరీరాన్ని వదిలేస్తారు. కానీ బయట ఉన్న వాళ్ళు మాత్రం "చనిపోయాడు" అని అనుకుంటారు, "పాపం" అని బాధపడతారు. కానీ ఆత్మ జ్ఞానికి మాత్రం అసలు విషయం తెలుసు. "నేనేమీ చనిపోలేదు. నాకు చావు లేదు. నేను చావను. ఊరికే ఈ శరీరాన్ని వదిలేశాను" అని అతనికి స్పష్టంగా తెలుసు.

అంతేకాదు, ఆత్మ జ్ఞాని మరో విషయాన్ని కూడా తెలుసుకుంటాడు తాను ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం, ఈ లోకంలో ఇంతవరకే ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయించిన సమయం పూర్తయ్యాకే ఆ శరీరాన్ని వదిలేయడం జరిగింది. మరి అలాంటప్పుడు ఎందుకు ఏడుస్తాడు? ఏడవడు. ఈ చావు గురించి ఆత్మ జ్ఞానికి స్పష్టమైన అవగాహన ఉంది కాబట్టి అతను నిర్భయంగా ఉంటాడు. మీరు సినిమాల్లో చూస్తూ ఉంటారు ఎవరైనా హీరో కానీ, విలన్ కానీ కత్తి చూపించి "చంపేస్తాను" అంటే గజగజ వణికిపోతారు. ఎందుకు భయపడతారు? "వాడు నన్ను చంపేస్తాడు" అనే భయంతో.

కానీ ఆత్మ జ్ఞాని అయితే చాలా స్పష్టంగా చెప్తాడు "నువ్వు నన్నేం చంపుతావు? నువ్వు నన్ను ఎక్కడ చంపగలవు? నాకు అసలు చావు ఎక్కడ ఉంది?" అని చాలా నిర్భయంగా, ధీమాగా చెప్తాడు. అతని ధైర్యాన్ని చూసి చంపాలనుకున్న వాడే ఒక క్షణం భయపడతాడు.

పత్రి గారు మహమ్మద్ ప్రవక్త గురించి చెప్తూ, ఆయన ఎన్నో యుద్ధాల్లో పాల్గొనేవారని ఒకసారి ఆయన శత్రువు ఆయనపై ఆధిపత్యం సాధించి, ఆయన గుండెలపై కత్తి పెట్టి, "ఇప్పుడు చెప్పు, నిన్ను ఎవరు కాపాడతారు? నీ అల్లా వచ్చి కాపాడతాడా? ఎవరు వచ్చి కాపాడతారు?" అని అడిగాడట. అప్పుడు మహమ్మద్ ప్రవక్త చాలా ధీమాగా, "అల్లా కాపాడతాడు" అని చెప్పారట. అలా అనే సరికి ఆ వ్యక్తి ఒక్క క్షణం తడబడ్డాడట. ఆ సమయంలో మహమ్మద్ ప్రవక్త తిరగబడి, అతని చేతిలోని కత్తిని లాక్కొని అతనిని చంపడం జరిగిందట. చంపుతానని కత్తి పెట్టినా కూడా మహమ్మద్ ప్రవక్త చాలా నిర్భయంగా ఉన్నారు. ఎందుకు నిర్భయంగా ఉన్నారు? ఆయన మహా జ్ఞాని. ఆత్మకు చావు లేదని ఆయనకు తెలుసు. తనను ఎవరూ నిజంగా చంపలేరని తెలుసు. అందుకే చావుకు భయపడలేదు. "చంపుతాను" అని బెదిరించినా భయపడలేదు, నిర్భయంగా ఉన్నారు.

పత్రి గారు ఇంకా చెప్తారు "ఎవడు ఎవడిని చంపగలడు? అజ్ఞానే భయపడతాడు. ఎవరైనా 'చంపుతాను' అంటే, జ్ఞాని అయితే 'వాడు నన్నేం చంపలేడు నాకు చావు ఎక్కడ ఉంది?' అని నిర్భయంగా ఉంటాడు". మీ అందరి విషయంలో నేను ఒకటే చెప్తున్నాను మీరు చావుకు భయపడితే, మీరు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టే లెక్క. మీకు ఇంకా చావు గురించి పూర్తిగా తెలియదనే చెప్పాలి. చాలామందికి "నాకు ఉన్నవన్నీ దూరమైపోతాయేమో, నా వాళ్ళకు నేను దూరమైపోతానేమో" అనే భయం ఉంటుంది. కానీ జ్ఞానికి

మాత్రం తెలుసు "వీళ్లెవరూ శాశ్వతంగా నా వాళ్ళు కాదు. నేను కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి, కొన్ని అనుభవాలు పొందడానికి భూమ్మీదకు వచ్చాను" అని.

భూమ్మీద మీరు కలిసే వాళ్ళను ఒకసారి గమనించండి. మీరు ఏదో పని కోసం ఢిల్లీ, బొంబాయి వెళ్ళారని అనుకోండి. పది రోజులో, పదిహేను రోజులో పని ఉంటుంది. చిన్నదైనా, పెద్దదైనా ఏదో ఒక హోటల్లో దిగుతారు. మీలాగే ఎన్నో రాష్ట్రాల నుంచి ఎంతోమంది అక్కడికి వచ్చి అదే హోటల్లో ఉంటారు. మీరు ఆ హోటల్లో ఉన్నంతకాలం అక్కడ ఉన్న వాళ్ళతో పరిచయం చేసుకుంటారు, మాట్లాడుకుంటారు. ఎంతో స్నేహంగా ఉంటారు, మీ పని మీరు చూసుకుంటూ ఉంటారు, మళ్ళీ కలుస్తూ ఉంటారు, రాత్రి కలుస్తారు, పొద్దున్న కలుస్తారు, మళ్ళీ మీ పని చేసుకుంటారు.

అలా పది, పదిహేను రోజులు గడిచే సరికి వాళ్ళు మీకు చాలా ఆత్మీయులై పోతారు. కొంతకాలానికి కుటుంబ సభ్యుల్లానే అనిపిస్తారు, అంత పరిచయం ఏర్పడుతుంది. కానీ మీ పని పూర్తయిన తర్వాత ఏం చేస్తారు? మీ పని అయిపోగానే వాళ్ళతో సంతోషంగా, "బాబు, నా పని అయిపోయింది. నేను వెళ్ళిపోతున్నాను" అని చెప్పి వెళ్ళిపోతారు. మీరు వెళ్ళిపోయినందుకు అక్కడ ఉన్న వాళ్ళు ఎవ్వరూ బాధపడరు. వాళ్ళందరినీ వదిలిపెట్టి వెళ్ళడానికి మీరు కూడా బాధపడరు. మీరు మీ పని కోసం వచ్చారు. పని పూర్తి చేసుకున్నారు. తర్వాత వెళ్ళిపోతారు.

అలాగే ఆత్మలైన మీరు కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి, కొన్ని అనుభవాలు పొందడానికి భూమ్మీదకు వచ్చారు. ఇక్కడ ఉండే సమయంలో ఎంతోమందిని కలుస్తారు. ఒక చోటికి వెళ్ళి ఎంతోమందిని ఎలా కలుస్తారో, ఇక్కడ కూడా అలాగే ఎంతోమందిని కలుస్తారు. కుటుంబ సభ్యులను కలుస్తారు, వాళ్ళతో కలిసి జీవిస్తారు. హోటల్లో ఉంటే అక్కడి వాళ్ళతో ఎలా ప్రేమగా

ఉంటారో, ఇంట్లో కూడా కుటుంబ సభ్యులతో అలాగే ప్రేమగా, శ్రద్ధగా ఉంటారు. ఉంటూ ఎవరి పని వాళ్ళు చేసుకుంటూ ఉంటారు. ఒకరోజు మీరు నేర్చుకోవాల్సినవి నేర్చుకుంటారు. దేని కోసం వచ్చారో అవన్నీ పూర్తవుతాయి. ఇక అక్కడ ఎందుకు ఉంటారు? మీ పని పూర్తయితే మీరు వెళ్ళిపోతారు. ఎవరి పని పూర్తయితే వాళ్ళు వెళ్ళిపోతారు.

నిజంగా ఈ విషయం అర్థమైన వాళ్ళు, ఈ జ్ఞానం ఉన్న వాళ్ళు మీరు వెళ్ళిపోయారని బాధపడరు. వాళ్ళను వదిలి వెళ్ళడానికి మీరు కూడా బాధపడరు. కానీ అజ్ఞానంలో ఉంటే వదిలిన వాళ్ళ కోసం బాధపడుతూ పై లోకాలకు వెళ్ళకుండా ప్రేతాత్మలైపోతారు, ఎంతో నష్టపోతారు. అదే జ్ఞానులు అయితే వెంటనే పై లోకాలకు వెళ్ళిపోతారు.

కుటుంబ సభ్యులను వదిలిపెట్టడం గురించి కొంత అర్థం చేసుకున్నాం. ఢిల్లీ హోటల్ ఉదాహరణను కూడా చూశాం. అలాగే ఆస్తులు, ఐశ్వర్యాలను జ్ఞాని ఎలా చూస్తాడో కూడా మీరు గమనించండి. మీరు ఒక పెద్ద కార్పొరేట్ స్కూల్‌లో కానీ, కాలేజీలో కానీ, యూనివర్సిటీలో కానీ చేరారని అనుకోండి. పది సంవత్సరాలు చదువుకోవడానికి వెళ్ళారని అనుకోండి. పెద్ద యూనివర్సిటీ అయితే పది, పదిహేను సంవత్సరాలు కూడా అక్కడ ఉండవచ్చు. మీరు అక్కడ చదువుకునేటప్పుడు బల్లలు ఉపయోగించుకుంటారు, ఛైర్లు ఉపయోగించుకుంటారు, మీకు ఇచ్చిన బీరువాలు, షెల్ఫ్‌లు ఉపయోగించు కుంటారు. మీరు రెసిడెన్షియల్‌గా ఉంటే బెడ్లు, బీరువాలు కూడా ఉపయోగించు కుంటారు.

మీరు ఉపయోగించుకుంటున్నంత కాలం “నాది, నాది” అంటారు. మరొకరు మీ ప్లేస్‌లో కూర్చుంటే “ఇది నాది, నాది” అంటారు. “నా బెడ్, నా బీరువా” అంటారు. కానీ కొన్నాళ్ళకు చదువు పూర్తవుతుంది, మీరు అక్కడి

నుంచి వెళ్ళిపోవాల్సి వస్తుంది. అప్పుడు మీరు ఉపయోగించుకున్న బల్లలు, ఛైర్లు, బెడ్లు, బీరువాలు అన్నింటినీ తీసుకెళ్తారా? ఆలోచించండి. మీకు సంబంధం లేదన్నట్టుగానే అన్నింటినీ అక్కడే వదిలేసి వెళ్ళిపోతారు.

అలాగే ఈ సృష్టిలో కూడా ఆత్మ జ్ఞాని అన్నీ తెలుసుకున్నవాడు. “ఎప్పుడో ఒకప్పుడు ఇవన్నీ వదిలేసి వెళ్ళాలి” అనే అవగాహన అతనికి ఉంటుంది. అందుచేత అవసరాలకు సరిపడేంత మాత్రమే సమకూర్చు కుంటాడు. కానీ అజ్ఞాని మాత్రం అవసరానికి మించి పోగేస్తాడు, కోట్లు పోగేస్తాడు, దౌర్జన్యాలు చేసి పోగేస్తాడు, పాపాలు చేసి పోగేస్తాడు, చేయకూడని పనులు చేసి సంపాదిస్తాడు. ఇవేవీ శాశ్వతంగా ఉండవు “ఇదేది నాది కాదు, వీటన్నిటినీ వదిలి నేను వెళ్ళాల్సిందే, నేను ఇక్కడ శాశ్వతంగా ఉండను” అనే అవగాహన అజ్ఞానికి ఉండదు. “నేను ఇలాగే ఉంటాను” అనుకుంటాడు.

కానీ ఆత్మ జ్ఞానికి తెలుసు అందుకే అవసరాలకు మాత్రమే సమకూర్చుకుంటాడు. వెళ్ళిపోయేటప్పుడు కూడా దాని గురించి బాధపడడు. “ఇన్నీ వదిలేస్తున్నాను” అని ప్రత్యేకంగా ఆలోచించడు. సహజంగా వచ్చి, సహజంగా జీవించి, సహజంగా వెళ్ళిపోతాడు. ఆస్తుల గురించి ఆలోచించడు, కుటుంబ సభ్యుల గురించి ఆలోచించడు.

భార్య గురించి, భర్త గురించి, పిల్లల గురించి, స్నేహితుల గురించి మమకారంతో బాధపడడు. “నేను చేయవలసిన పని అయిపోయింది, ఇంకా కొత్త పాఠాలు నేర్చుకోవడానికి, కొత్త అనుభవాలు పొందడానికి మళ్ళీ కొత్త శరీరం తీసుకుంటే కొత్త అనుభవాలు వస్తాయి” అనే అవగాహనతో వెళ్ళిపోతాడు. అందుచేత ఆత్మ జ్ఞాని నిర్భయంగా జీవిస్తాడు. ఎందుచేత అంటే చావు గురించి తెలుసుకున్నాడు కాబట్టి. చావు గురించి తెలిసిన వాడికి ఇంకా భయం ఎక్కడ ఉంటుంది? అందుకే అతను నిర్భయంగా ఉంటాడు. ప్రతి

గారు ఎప్పుడూ "ప్రతి ఒక్కరూ జ్ఞానం సంపాదించుకోండి" అని చెప్తారు. నేను కూడా అదే చెప్తున్నాను.

ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులు కండి, జ్ఞానం సంపాదించుకోండి అంటాను. చాలామంది ధ్యానం తో ఆగిపోతారు. కానీ పత్రీ గారు జ్ఞానం గురించి చెప్పారు, ధ్యానం గురించి కూడా చెప్పారు. ధ్యానం వల్లనే జ్ఞానం వస్తుందని చెప్పారు. కాబట్టి ధ్యానం ఎందుకు? జ్ఞానం కోసం. ఇప్పుడు ఆ జ్ఞానాన్నే మీరు అందరూ నేర్చుకుంటున్నారు, జ్ఞానం పొందే ప్రయత్నం చేస్తున్నారు.

అందుచేత మీరు ఎందుకు నిర్భయంగా ఉండాలి? చావు గురించి అవగాహన ఉన్నవారు కాబట్టి నిర్భయంగా ఉండాలి. చావు మిమ్మల్ని భయపెట్టదు. మీరే చావును భయపెడతారు. "నా భార్య, నా భర్త, నా పిల్లలు, వీళ్ళకు ఏదైనా అయిపోతుందేమో" అనే మమకారాలు అజ్ఞానంలో ఉంటాయి. కానీ మీ ప్రయాణంలో మీరు కొంతకాలం కలిశారు, అంతే. మళ్ళీ ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు, ఇది మీరు గుర్తుపెట్టుకోవాలి. అప్పుడు మమకారాలు తగ్గుతాయి. బాంధవ్యాల మీద, బంధుత్వాల మీద ఉన్న మోహం తగ్గుతుంది. మీరు పొందవలసిన జ్ఞానం మీద మీ దృష్టి ఎక్కువగా ఉంటుంది. మీరు జ్ఞానవంతులు అవుతారు, అంతేకాదు, మీకు లభించిన జ్ఞానాన్ని ఇతరులకు కూడా అందించి, మీ చుట్టూ ఉన్న వారిని కూడా జ్ఞానవంతులుగా చేయగలుగుతారు.

# ఆత్మ జ్ఞానికి "నేను - మేను" తేడా తెలుస్తుంది

ఆత్మ జ్ఞానికి "నేను–మేను" మధ్య ఉన్న తేడా స్పష్టంగా తెలుస్తుంది. దీని గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఇక్కడ "నేను" అన్నది ఆత్మ, "మేను" అన్నది శరీరం. అలాగే "నేను" అన్నది చైతన్యం, "మేను" అన్నది జడం. ఈ శరీరాన్ని "మేను" అని ఎందుకు అంటున్నారు అంటే, ఎప్పుడైతే ఈ మేనులో ఉన్న "నేను" అనే చైతన్యం శరీరం నుంచి తప్పుకుంటుందో, బయటకు వెళ్ళిపోతుందో, అప్పుడు ఆ శరీరం పూర్తిగా జడమైపోతుంది. అప్పుడు కళ్ళు చూడలేవు, నోరు మాట్లాడలేదు, చేతులు, కాళ్ళు పనిచేయవు, చెవులు వినలేవు. ఏ ఇంద్రియమూ తన పని తాను చేయలేదు. ఎందుకంటే శరీరంలో చైతన్యం లేదు.

అందుచేత గుర్తుపెట్టుకోండి శరీరమే అన్ని పనులు చేస్తుంది అని సాధారణంగా అనుకుంటారు. కానీ వాస్తవానికి ఈ "మేను" అంటే శరీరం పూర్తిగా జడం. "నేను" అన్నదే చైతన్యం. ఆ చైతన్య శక్తి వల్లే ఈ జడమైన శరీరం కళ్ళతో చూడడం, చెవులతో వినడం, నోటితో మాట్లాడడం, చేతులతో పనిచేయడం, కాళ్ళతో నడవడం వంటి ఎన్నో రకాల పనులు చేయగలుగు తుంది. కాబట్టి శరీరాన్ని నడిపించే అసలైన శక్తి శరీరం కాదు, శరీరంలో ఉన్న చైతన్యమైన "నేను" అంటే ఆత్మ. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా తెలుసుకోవాలి.

అందుచేత "నేను" లేకపోతే "మేను" జడమే. "నేను" ఉన్నంత వరకే ఈ శరీరం పనిచేస్తుంది. నేను పని చేయాలన్నా, నేను మాట్లాడాలన్నా, నేను చూడాలన్నా, నేను నడవాలన్నా, ఈ శరీరంలో "నేను" ఉండవలసిందే. చూడండి, ఒక కారును డ్రైవర్ నడిపించినట్టే ఈ మేనును, అంటే ఈ శరీరాన్ని "నేను" అంటే ఆత్మ నడిపిస్తుంది. కాబట్టి "నేను" వేరు, "మేను" వేరు. ఆత్మజ్ఞానం పొందినవారు "జడమైన మేను అంటే ఈ శరీరం నేను కాదు, చైతన్యవంతమైన

ఆత్మే నేను" అని స్పష్టంగా తెలుసుకుంటారు. ఎందుకంటే అజ్ఞాని జడమైన మేనునే "నేను" అని అనుకుంటాడు. గుర్తుపెట్టుకోండి, ఎవరైతే ఈ జడమైన మేనుని "నేను" అనుకుంటారో, వారు అజ్ఞానంలో ఉన్నట్టే. ఇప్పుడు మీలో ఎంతమంది ఈ జడమైన మేనునే "నేను" అని అనుకుంటున్నారో ఒక్కసారి ఆలోచించండి. ఏమండీ, ఈ జడమైన మేను మీరు ఎలా అవుతారు? అసలు మీరు ఎంత గొప్పవారంటే, ఈ మేనునే కాదు, ఈ సృష్టినే నడిపించగల చైతన్య శక్తి కలిగినవారు మీరు. మీరు అంత గొప్పవారు.

అంతేకాదు, ఆత్మజ్ఞాని "నేను" అంటే ఆత్మ భూమి మీదకు వచ్చి, కొంతకాలం ఈ శరీరాన్ని ఉపయోగించుకుని, తిరిగి వెళ్ళిపోతుంది అని తెలుసుకుంటాడు. ఒక డ్రైవర్ కారులోకి వచ్చి కారును నడిపి, తన ప్రయాణం పూర్తయ్యాక కారును వదిలి వెళ్ళిపోయినట్టే, ఆత్మ కూడా ఈ శరీరంలో ప్రవేశించి, తనకు సంబంధించిన పనులను పూర్తిచేసుకుని, చివరికి ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. కాబట్టి డ్రైవర్ అంటే ఆత్మ, కారు అంటే శరీరం. ఈ సత్యాన్ని తెలుసుకున్న ఆత్మజ్ఞాని "తనను తాను తెలుసుకోవడమే మేను యొక్క లక్ష్యం, తనను తాను చేరుకోవడమే నేను యొక్క గమ్యం" అని తెలుసు కుంటాడు. తన లక్ష్యం ఏమిటో, తన గమ్యం ఏమిటో తెలుసుకున్న తర్వాత, ఆత్మజ్ఞాని తన గమనాన్ని, అంటే తన ప్రయాణాన్ని తన వైపే కొనసాగిస్తాడు. ఇక్కడ గమనం అంటే ధ్యానం చేయడం; గమ్యం వైపు నిరంతరం తన గమనాన్ని కొనసాగించడమే ధ్యానం. ఆ గమ్యాన్ని చేరుకోవడానికి మీరు చేసే ధ్యానమే మీ అసలైన ఆధ్యాత్మిక ప్రయాణం. ఆ పని మీరు అందరూ కొనసాగిస్తున్నారు.

దానికోసం జ్ఞానం సంపాదించుకుంటారు. తనను తాను తెలుసు కోవడమే లక్ష్యం, తనను తాను చేరుకోవడమే గమ్యం.

"నేను" అంటే ఎవరో అజ్ఞానికి తెలియదు. తాను ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాడో తెలియదు, ఏం చేస్తున్నాడో తెలియదు, ఎటు వెళ్తున్నాడో తెలియదు. అందుచేత జీవితం అంతా అస్తవ్యస్తంగా సాగిపోతుంది. కానీ

ఆత్మజ్ఞానికి తన లక్ష్యం ఏమిటో, తన గమ్యం ఏమిటో స్పష్టంగా తెలుస్తుంది. అందుకే అతని గమనం ఎప్పుడూ గమ్యం వైపే ఉంటుంది. డబ్బు, పేరు, ప్రఖ్యాతులు ఇవేవీ తన అసలైన గమ్యం కాదని, అవి జీవితంలో ఉన్నా లేకపోయినా తనకు అంతిమంగా అవసరం లేదని ఆత్మ జ్ఞాని తెలుసుకుంటాడు.

చిత్రం ఏమిటంటే, పుట్టక ముందు, అంటే భూమి మీదకు రాక ముందు "నేను" ఎవరో తెలియదు, కానీ ఆత్మజ్ఞాని ఈ భూమి మీద ఉన్నప్పుడే "నేను" ఎవరో తెలుసుకుంటాడు. "నేనుకు నేనే గమ్యం, ఆ గమ్యం వైపు పయనించటమే ధ్యానం" అని ఆత్మ జ్ఞానికి తెలుస్తుంది. గమ్యం లేని "నేనుకు", అంటే అజ్ఞానికి, ఎప్పుడూ చింతే. ఎంత ఉన్నా చింతే, ఎన్ని సంపదలు ఉన్నా చింతే, ఎన్ని సౌకర్యాలు ఉన్నా చింతే. కానీ ఆ చింతకు అసలు కారణం ఏమిటో కూడా అతనికి తెలియదు. తాను తన గమ్యాన్ని చేరుకునే ప్రయత్నం చేయడం లేదనే విషయం కూడా అతనికి తెలియదు. అలాగే, ఆధ్యాత్మిక మార్గంలోకి రావడం అంటే పూజలు చేయడం లేదా ఆచారాలు పాటించడం కాదు, తన అసలైన గమ్యం ఏమిటో తెలుసుకోవడమే ఆధ్యాత్మికత. చివరకు "నేనుకు నేనే గమ్యం, ఆ గమ్యం వైపు గమనించడమే ధ్యానం" అని తెలుసుకున్నప్పుడు ఆత్మజ్ఞానం వైపు అడుగు పడుతుంది. అప్పుడు "ఓహో, నేను వెతుకుతున్నది బయట కాదు, నాలోనే ఉంది" అని తెలుసుకుంటాడు.

గమ్యం చేరే వరకు "నేనుకు" లోపల ఒక వేదన, గుబులు, అసంతృప్తి ఉంటూనే ఉంటాయి. తన లక్ష్యం ఏమిటో, తన గమ్యం ఏమిటో తెలుసుకున్న తర్వాత, ఆత్మజ్ఞాని తన గమనాన్ని, అంటే తన ప్రయాణాన్ని తన వైపే కొనసాగిస్తాడు. ఇక్కడ గమనం అంటే ధ్యానం చేయడం; గమ్యం వైపు నిరంతరం తన గమనాన్ని కొనసాగించడమే ధ్యానం.

కానీ విషయానికి వస్తే నేను ఎంత డబ్బు సంపాదిస్తున్నా, ఎన్ని ఆస్తులు పెంచుతున్నా, ఎన్ని సౌకర్యాలు ఉన్నా, నా లోపల ఏదో తెలియని

వేదన, గుబులు, అసంతృప్తి ఉండేది. ఏదో చేయాలని అనిపించేది, కానీ ఏం చేయాలో స్పష్టంగా తెలియదు. పత్రి గారు నాకు పరిచయం అయిన తర్వాత, ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత, ఆ తెలియని వేదన, గుబులు, అసంతృప్తి క్రమంగా తొలగిపోయాయి. అందుచేత గమనంలో, అంటే ధ్యానంలో ఉన్నప్పుడు, డబ్బు రావచ్చు పోవచ్చు, ఆరోగ్యం రావచ్చు పోవచ్చు జీవితంలో ఎన్నో మార్పులు రావచ్చు. కానీ ఆత్మజ్ఞాని వాటిని పట్టించుకోడు. ఎందుకంటే అతనికి అన్నింటికంటే గమ్యమే ముఖ్యం.

చూడండి, గుడ్డివాడు మరొక గుడ్డివాడికి దారి చూపించలేడు. అలాగే అజ్ఞాని మరో అజ్ఞానికి నిజమైన దారి చూపించలేడు. అందుచేత “నేను” ఎవరో తెలుసుకున్న తర్వాతే తన జీవితాన్ని సరైన దిశలో నడిపించగలుగుతాడు. అప్పుడు మాత్రమే నిజమైన సంతృప్తి కలుగుతుంది. ఇది ప్రతి ఒక్కరి విషయంలోనూ ఒకటే. గమ్యం తెలియకపోతే మీరు ఒకదాని కోసం ఈ భూమి మీదకు వచ్చి, మరొక దాని కోసం జీవితాన్ని మొత్తం గడిపేస్తారు. అందుకే “నేను” ఎవరో తెలుసుకోవడమే అసలైన సాహసం. యుగాలు మారినా, ఎంతమంది పుట్టినా, ప్రతి ఒక్కరూ ఈ సత్యాన్ని తెలుసుకోలేరు, కొంతమంది మాత్రమే “నేను” ఎవరో తెలుసుకునే సాహసం చేస్తారు.

ఈ విషయం భగవద్గీతలో కూడా స్పష్టంగా చెప్పబడింది. 7 అధ్యాయం3 శ్లోకంలో

**“మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః”**

తాత్పర్యం: వేలాది మంది మనుషులలో ఒకానొకరు మోక్ష సిద్ధి కోసం ప్రయత్నిస్తారు, అలా ప్రయత్నించే వారిలో కూడా ఒకానొకడు మాత్రమే నన్ను యథార్థంగా తెలుసుకోగలుగుతున్నాడు.

అంటే ఇలాంటి సాహసయాత్రను కొనసాగిస్తూ, చివరికి తన అసలైన గమ్యాన్ని చేరుకోవడమే ఆధ్యాత్మికత. అందుచేత ప్రతి ఒక్కరూ ఒక విషయం

తప్పకుండా గుర్తుపెట్టుకోవాలి, “ఇల్లు అలకగానే పండగ కాదు, ధ్యానం మొదలు పెట్టగానే గమ్యం చేరలేరు.” ఎవరైనా ఈ భూమి మీదకు వచ్చేది ఒక సాహసయాత్ర కోసమే.

కానీ భూమి మీదకు వచ్చిన తర్వాత తన అసలైన లక్ష్యాన్ని, తన గమ్యాన్ని మర్చిపోతారు. అలా మర్చిపోయిన తన అసలైన గమ్యాన్ని తిరిగి గుర్తు చేసుకోవడమే అసలైన సాహసం. జీవితంలో ఏమి ఉన్నా, లేకపోయినా పర్వాలేదు; ఎంత పేరు, ప్రఖ్యాతులు ఉన్నా, లేకపోయినా పర్వాలేదు. చివరికి మీరు చేరవలసింది మీ అసలైన గమ్యమే. ఆ గమ్యాన్ని చేరుకోవడానికి ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి. అంతేకానీ జీవితంలో ఎదురయ్యే కష్టాలకు భయపడి ఆత్మహత్యలు చేసుకోకూడదు. జీవితం మీకు లభించిన ఒక గొప్ప అవకాశం, ఈ జీవితాన్ని మీ గమ్యాన్ని చేరుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలి.

అందుచేత ప్రతి ఒక్కరూ తమ గమనంలో ఈ నాలుగు విషయాలను తప్పకుండా పాటించాలి.

1) ధ్యానం నేర్చుకోవాలి.

2) ధ్యాన అభ్యాసం చేయాలి.

3) ధ్యానం గురించి ఇతరులకు చెప్పాలి.

4) ఈ ధ్యానాన్ని అందరికీ పంచడానికి కృషి చేయాలి.

మీరు ధ్యానాన్ని నేర్చుకోవడం, ఆచరించడం, ఇతరులకు తెలియ జేయడం, అందరికీ పంచడానికి కృషి చేయడం ద్వారా మీ గమనం గమ్యం వైపు కొనసాగుతుంది. ఇవన్నీ ఆత్మ జ్ఞానికి స్పష్టంగా తెలుస్తాయి. తన గమ్యం ఏమిటో తెలుసుకున్నవాడు, ఆ గమ్యాన్ని చేరే వరకు తన సాధనను ఆపకుండా కొనసాగించడమే నిజమైన ఆధ్యాత్మిక జీవితం అని అర్థం చేసుకుంటాడు.

# ఆత్మ జ్ఞాని మనిషి యొక్క గమ్యం, లక్ష్యం తెలుసుకున్నవాడు

ఆత్మజ్ఞాని అన్ని విషయాలను తెలుసుకుంటూ ఉంటాడు. అందులో ముఖ్యంగా, మానవుడి గమ్యం ఏమిటి? లక్ష్యం ఏమిటి? ఈ గమ్యం, ఈ లక్ష్యం ఎలా వచ్చింది? వీటిని ఎవరు నిర్దేశించారు? అనే విషయాలను కూడా స్పష్టంగా తెలుసుకుంటాడు.

ఎవరు నిర్దేశించారు అంటే, మనకు పత్రి గారు ఒక ముఖ్యమైన విషయాన్ని చెప్పారు "మీరు దేహాలు కాదు, ఆత్మలు" అని. ఈ విషయాన్ని మీరు ఎప్పటికీ మర్చిపోకూడదు. "నేను దేహం కాదు, నేను ఆత్మను" అనే సత్యాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మరి ఈ ఆత్మ ఎక్కడి నుంచి వచ్చింది? మనం ఎక్కడి నుంచి వచ్చాము? అంటే, ఒక పూర్ణాత్మ నుంచి కానీ, మూలాత్మ నుంచి కానీ విడిపోయి అంశాత్మగా వచ్చాము. అందుచేత మనం ఆ పూర్ణాత్మ నుంచి విడిపోయిన అంశాత్మలు. అంశాత్మ అంటే పూర్ణాత్మలోని ఒక భాగం. ఒక తల్లి తనలో నుంచి పిల్లలను ఎలా సృష్టిస్తుందో, అలాగే ఆ పూర్ణాత్మ కూడా తనలో నుంచి అంశలను సృష్టిస్తూ ఉంటుంది. అలా సృష్టించిన తరువాత, ఆ పూర్ణాత్మ తాను సృష్టించిన ప్రతి అంశాత్మకు ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది "నీవు కూడా నాలా తయారు కావాలి, నాలా ఎదగాలి, నా అంతటి స్థితికి చేరుకోవాలి" అని లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది.

ఆ స్థితిని సాధించే వరకు జన్మలు తీసుకుంటూనే ఉంటావు అని చెప్పి, జన్మ చక్రంలోకి ప్రవేశపెట్టడం జరుగుతుంది. అంటే, మనం ఎక్కడి నుంచి వచ్చామో, ఎలాంటి స్థితిని చేరుకోవాలో, చివరికి ఏ స్థాయికి ఎదగాలో అనే అసలైన లక్ష్యం మీకు ముందే నిర్దేశించబడి ఉంటుంది.

మరి ఈ లక్ష్యాన్ని సాధించాలంటే కొన్ని పనులు చేయాలి, కొన్ని

సాధనలు చేయాలి. ఆ పనులు, ఆ సాధనలు చేయాల్సిన అవసరం ఉంది కాబట్టి కర్మ చక్రంలోకి కూడా ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఆ పూర్ణాత్మ తన అంశాత్మగా ఉన్న మనల్ని ఒక శరీరంలోకి ప్రవేశపెడుతుంది. అంటే, ఒక జీవుడిలోకి ప్రవేశపెట్టడం జరుగుతుంది.

ఎప్పుడైతే మనం ఒక జీవుడిలోకి ప్రవేశపెట్టబడ్డామో, అప్పుడు మనం జీవులం అవుతాం. అప్పటివరకు మనం అంశాత్మలమే. కానీ ఒక శరీరంలోకి ప్రవేశించిన తరువాత మనం జీవుడిగా మారతాము. అప్పటి నుంచి మనల్ని జీవుడు అని అంటారు. అలా శరీరాన్ని తీసుకుని భూమ్మీదకు రావాలంటే, ముందుగా ఒక తల్లి గర్భంలో తయారవుతున్న శరీరంలోకి ప్రవేశించాలి. తొమ్మిది మాసాలు పూర్తయిన తరువాత తల్లి గర్భం నుంచి భూమ్మీద జన్మ తీసుకుంటారు.

అయితే తల్లి గర్భంలో ఉన్నంతకాలం, అంటే భూమ్మీదకు వచ్చే వరకు, మీకు మీ లక్ష్యం ఏమిటి? మీ గమ్యం ఏమిటి? అనే విషయాలన్నీ గుర్తుంటాయి. కానీ ఎప్పుడైతే మీరు భూమ్మీదకు వస్తారో, అప్పుడు అవన్నీ మర్చిపోతారు. ఇక్కడ తల్లిదండ్రుల పాత్ర ఉంటుంది. తల్లిదండ్రులు మిమ్మల్ని ఎలా పెంచుతారో, ఎలా తీర్చిదిద్దుతారో, మీరు కూడా అలాగే తయారవుతారు.

తల్లిదండ్రులు హిందువులు అయితే, పిల్లవాడు కూడా "ఓహో! నేను హిందువునా?" అని అనుకుంటాడు. వారు క్రిస్టియన్లు అయితే, "నేను క్రిస్టియనా?" అని అనుకుంటాడు. వారు ముస్లింలు అయితే, "నేను ముస్లింనా?" అని అనుకుంటాడు. అలా సుమారు ఎనిమిది సంవత్సరాల వరకు కుటుంబంలో ఉండటం వల్ల, ఆ కుటుంబ ప్రభావంలోనే పెరుగుతారు. ఆ కుటుంబానికి సంబంధించిన అలవాట్లను చేసుకుంటారు, ఆచారాలను పాటిస్తారు, కుటుంబంలో ఉన్న వాళ్ళు ఏ పనులు చేస్తారో, మీరు కూడా వాటినే చేస్తూ ఉంటారు. అలా కుటుంబ వాతావరణంలోనే ఎదుగుతారు.

ఎనిమిది సంవత్సరాలు దాటిన తరువాత మీరు సమాజంలోకి వస్తారు. ఆ సమాజంలో, మీ చుట్టూ ఉన్న వాళ్ళు ఎలా ప్రవర్తిస్తూ ఉంటారో, దేనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ ఉంటారో, వాటిని గమనిస్తూ, వాటి ప్రభావానికి లోనవుతూ ఉంటారు. సమాజంలో ఎన్నో రకాల మనుషులు ఉంటారు. కొంతమంది డబ్బుకు ప్రాముఖ్యం ఇస్తారు. కొంతమంది చదువుకు ప్రాముఖ్యం ఇస్తారు. కొంతమంది సినిమాల్లో నటించడానికి ప్రాముఖ్యం ఇస్తారు. కొంతమంది రాజకీయాలకు ప్రాముఖ్యం ఇస్తారు. కొంతమంది ఆటలకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇలా సమాజంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క ఆసక్తి, ఒక్కొక్క ప్రాధాన్యత ఉంటుంది.

ఇలా సమాజంలో ఉన్న ఎన్నో రకాల వ్యక్తులను, వారి జీవితాలను చూసినప్పుడు, వాటిలో ఏదో ఒక రంగంపై మీకు ఆకర్షణ కలుగుతుంది. ఆ ఆకర్షణ పెరిగిన తరువాత, “నేను కూడా ఈ రంగంలో చాలా ఉన్నతమైన స్థితికి ఎదగాలి” అని అనుకుంటారు. అలా అనుకుని, జీవితంలో అదే మీ లక్ష్యంగా పెట్టుకుంటారు. ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తారు. దాని కోసం కష్టపడతారు. రాత్రింబవళ్ళు శ్రమిస్తారు. అలా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఎదుగుతూ ఉంటారు.

ఒక్కోసారి మీరు ప్రయత్నించిన రంగంలో టాప్ లెవెల్‌కు చేరుకుంటారు. ఒక్కోసారి మీరు అనుకున్న స్థాయికి చేరుకోలేకపోవచ్చు కూడా. కానీ అనుకున్న స్థాయికి చేరుకున్నప్పుడు, “నా జీవితంలో నేను అనుకున్నది సాధించాను, ఇక నాకు ఇంకేమీ అవసరం లేదు” అని అనుకుంటారు.

ఇంకొకరు వ్యాపార రంగంలో గొప్ప వారు కావాలనుకుంటారు. ముకేష్ అంబానీ లాగా గొప్ప వ్యాపారవేత్త కావాలని అనుకుంటారు. ఇలా ఒక్కొక్కరు తమ ఆసక్తిని బట్టి ఒక్కో రంగంలో ఉన్నత స్థితికి ఎదగాలని ప్రయత్నిస్తారు. కొంతమంది సైంటిస్టులు అవ్వాలనుకుంటారు. కొంతమంది

సాఫ్ట్‌వేర్ రంగంలో టాప్‌లో నిలవాలనుకుంటారు. ఇలా రకరకాల లక్ష్యాలను మీరు ఈ లోకంలో చూస్తున్నారు.

కానీ ఇక్కడ ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే, మీకు మొదటగా నిర్దేశించబడిన అసలైన లక్ష్యాన్ని మీరు మర్చిపోతారు. ఆ అసలైన లక్ష్యాన్ని మర్చిపోయి, ఒక్కో జన్మలో మీరు ఉన్న కుటుంబాన్ని, సమాజాన్ని, పరిసరాలను బట్టి ఒక్కో కొత్త లక్ష్యాన్ని నిర్ణయించుకుంటారు. ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు.

అలా సుమారు 300–350 జన్మలు రకరకాల లక్ష్యాలతో జీవిస్తూ, జన్మలు తీసుకుంటూ ఉంటారు. ఈ ప్రయాణంలో ఎన్నో కర్మలు చేస్తారు. కొన్ని మంచి కర్మలు చేస్తారు, కొన్ని తప్పులు చేస్తారు. కొన్ని పాప కర్మలు కూడా చేస్తారు. వాటి ఫలితంగా జీవితంలో ఎన్నో కష్టాలు, బాధలు ఎదురవుతాయి. ఒక్కోసారి జన్మలు పెరిగే కొద్దీ కర్మలు కూడా పెరుగుతాయి. ఆ కర్మ ఫలాలను అనుభవించలేక, ఏం చేయాలో తెలియక, జీవితంలో సతమతమవుతున్న సమయంలోనే మీకు సద్గురువు యొక్క సాంగత్యం లభిస్తుంది.

అప్పుడు మీరు ఆ సద్గురువు పట్ల ఆకర్షితులైతే, సద్గురువు మీకు ఒక గొప్ప సత్యాన్ని తెలియజేస్తారు. "నాయనా! నీ అసలైన లక్ష్యం ఇవన్నీ కాదు. నువ్వు ఇలాంటి లక్ష్యాలు ఎన్ని సాధించినా, నీ జన్మలు అలా పెరుగుతూనే ఉంటాయి. దుఃఖం కూడా అలాగే ఉంటుంది. దుఃఖం లేకుండా ఉండాలంటే, నువ్వు జన్మ లేని స్థితిని సాధించాలి. ఆత్మ అయిన నీకు ఒక లక్ష్యం ముందే నిర్దేశించబడింది. ఆ లక్ష్యాన్ని తెలుసుకుని, దాన్ని సాధించే ప్రయత్నం చేయి" అని సద్గురువు చెబుతారు.

అప్పుడు ఏం చేస్తారు? ఇప్పటివరకు జీవితంలో ముఖ్యమైనవిగా భావించిన మిగతా లక్ష్యాలన్నింటినీ ప్రక్కన పెట్టి, గురువు చూపించిన అసలైన

లక్ష్యం మీదే దృష్టి పెడతారు. మరి మీ అసలైన లక్ష్యం ఏమిటి? మీరు కూడా పూర్ణాత్మగా మారాలి.

మొదట్లోనే చెప్పుకున్నాం కదా ఆ పూర్ణాత్మ "నీవు కూడా నాలా తయారవ్వాలి. నా అంతటి స్థితికి ఎదగాలి" అని మీకు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆ స్థితిని సాధించే వరకు మీరు జన్మలు తీసుకుంటూనే ఉంటారని చెప్పింది. ఇప్పుడు సద్గురువు కూడా అదే విషయాన్ని గుర్తుచేస్తున్నారు. మీరు జన్మలేని స్థితికి ఎదగాలి అంటే, మీరు కూడా పూర్ణాత్మగా మారాలి. పూర్ణాత్మగా మారాలంటే పూర్ణజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. మొత్తం జ్ఞానాన్ని తెలుసుకోవాలి. పూర్ణజ్ఞానాన్ని పొందాలి. ఇదే ప్రతి ఒక్కరి అసలైన లక్ష్యం.

ఆ తరువాత ఆ లక్ష్యం వైపు అడుగులు వేయడం ప్రారంభిస్తారు. గురువు సలహా మేరకు సాధన చేస్తారు, సద్గురువు చూపించిన మార్గంలో నడుస్తారు, జ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదువుతారు, జ్ఞానులు ఇచ్చిన సందేశాలను వింటారు, ఎన్నో విషయాలను తెలుసుకుంటారు, మీ అసలైన లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తారు. అలా ప్రయత్నిస్తున్న వారే మీరు.

అందుకే ఇప్పుడు భీమవరం వస్తున్న వారిని, ఈ జూమ్‌లోకి వస్తున్న వారిని మీరు గమనించండి, మీకు ఇంకొక పని ఏమీ ఉండదు, ఇంకొక అసలైన లక్ష్యం ఏమీ ఉండదు. జ్ఞానాన్ని పెంచుకోవడం, పూర్ణజ్ఞానాన్ని పొందడం, చివరికి పూర్ణాత్మగా మారడం ఇదే మీ లక్ష్యం.

మీరు ఈ జ్ఞాన మార్గంలోకి రాకముందు ఒక్కొక్కరికి ఒక్కొక్క లక్ష్యం ఉండేది. కొంతమంది జీవితంలో "నేను ఒక ఇల్లు కట్టుకోవాలి" అని అనుకుంటారు. జీవితమంతా దాని చుట్టూనే తిరుగుతుంది. లోన్ తీసుకుంటారు, ఒక బిల్డింగ్ కడతారు. ఆ తరువాత ఆ లోన్ తీర్చడమే వారి జీవితంలో మరో పెద్ద బాధ్యతగా మారుతుంది. అలా నెల నెలా EMIలు కడుతూ, "రిటైర్ అయిన తరువాత ఈ ఇంట్లో ప్రశాంతంగా ఉండొచ్చు" అని

అనుకుంటారు కానీ పాపం, ఆ సమయం వచ్చే వరకు వాళ్ళు ఉంటారో లేదో కూడా తెలియదు. ఆ లోపలే జీవితం ముగిసిపోవచ్చు. ఇలా కొంత మందికి కొన్ని లక్ష్యాలు ఉంటాయి. వారి జీవితమంతా వాటి కోసమే రాత్రింబవళ్ళు గడిచిపోతుంది. అదే వారి జీవితానికి లక్ష్యంగా మారిపోతుంది.

కానీ కొద్దిపాటి జ్ఞానం కలిగినవారు తమ అసలైన లక్ష్యాన్ని తెలుసుకుంటారు. "నేను పూర్ణాత్మగా మారాలి" అనే లక్ష్యాన్ని గుర్తించి, దాని కోసం కృషి చేస్తూ ఉంటారు. ఇక్కడ ఒక విషయాన్ని మీరు తప్పకుండా గుర్తుపెట్టుకోండి ఎవరైతే తమ అసలైన లక్ష్యాన్ని సాధిస్తారో, అంటే పూర్ణజ్ఞానాన్ని పొందుతారో, వారే తమ గమ్యాన్ని చేరుకుంటారు. మరి ప్రతి ఒక్కరి గమ్యం సత్యలోకాన్ని చేరడం.

సత్యలోకాన్ని చేరాలంటే మీరు పూర్ణాత్మగా తయారవ్వాలి. పూర్ణాత్మ స్థితిని పొందిన వారికే అక్కడికి చేరే అర్హత ఉంటుంది. అందరికీ ఆ అర్హత ఉండదు. ఆ అర్హతను సంపాదించుకున్నప్పుడు మీరు మీ గమ్యాన్ని చేరుకుంటారు. సత్యలోకాన్ని చేరుకుంటారు.

ఎప్పుడైతే మీరు ఆ గమ్యాన్ని చేరుకుంటారో, పూర్ణాత్మ నిర్దేశించిన అసలైన లక్ష్యాన్ని సాధిస్తారో, ఇక జన్మ ఎందుకు అవసరం ఉంటుంది? ఇక భూమ్మీదకు రావాల్సిన అవసరం ఉండదు. మీ ప్రయాణం అక్కడితో పూర్తవుతుంది.

మీరు గమనించినట్లయితే, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా సాధించవలసిన ఒక లక్ష్యం ఉంది, చేరుకోవలసిన ఒక గమ్యం ఉంది. సహజంగా ఈ విషయం ఆత్మ జ్ఞానికే స్పష్టంగా తెలుస్తుంది. ఆత్మజ్ఞానం మీద ఆసక్తి ఉన్నవారికి ఈ విషయం అర్థమవుతుంది. ఈ జ్ఞానం మీకు కలగాలంటే ఇంచుమించు 350 జన్మలు కచ్చితంగా పడతాయి.. అలా 350 జన్మలు దాటి వచ్చిన వారే మీరు. అందుకే మీరందరూ ఈ ధ్యాన మార్గంలోకి,

ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చారు. అయితే ధ్యానంలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ తమ అసలైన లక్ష్యం గురించి అవగాహన ఉండదు. అందుచేత మీరు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోండి.

ఆత్మ జ్ఞానికి తన గమ్యం ఏమిటో, తన అసలైన లక్ష్యం ఏమిటో స్పష్టంగా తెలుస్తుంది. అందుకే అతని ప్రయత్నం ఎప్పుడూ ఆ లక్ష్యం వైపే ఉంటుంది. మిగతా విషయాలకు అతను పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వడు. ఈ సృష్టిలో ఎన్నో విషయాలు ఉన్నాయి, వందల రకాలు, వేల రకాలు ఉన్నాయి. ఒకటి సమకూర్చుకుంటే ఇంకొకటి కావాలి. ఇంకొకటి సమకూర్చుకుంటే మరొకటి కావాలి. ఇలా కోరికలకు అంతం ఉండదు. జీవితమంతా ఏదో ఒకటి సాధించాలనే ప్రయత్నంలోనే గడిచిపోతుంది.

కానీ అవేవీ మీ అసలైన లక్ష్యం కాదు. అటువంటి లక్ష్యాలు ఎన్ని సాధించినా, మళ్ళీ జన్మ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎవరైతే తమ అసలైన లక్ష్యమైన పూర్ణాత్మగా మారడాన్ని సాధిస్తారో, వారికి ఇక జన్మ ఉండదు. ఆ లక్ష్యం ముందే నిర్దేశించబడింది. కాబట్టి ఇప్పుడు మీ అందరి అసలైన లక్ష్యం పూర్ణాత్మగా మారడం. మీ అందరి గమ్యం సత్యలోకాన్ని చేరడం, ఈ విషయాన్ని మీరు ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. ఆ దిశగా అడుగులు వేయండి, ఈ జన్మలో కాకపోతే ఇంకో జన్మలో, ఈ జన్మలో సాధించ లేకపోతే మరొక జన్మలో అయినా, మీరు మీ అసలైన లక్ష్యాన్ని సాధించి తీరాలి. మీరు దానికోసమే ఇక్కడికి వచ్చారు, మీ జీవితానికి అసలైన ప్రయోజనం అదే, అంతకన్నా ఇంకేమీ కాదు.

# ఆత్మజ్ఞాని జరిగే దానిని జరగనిస్తాడు దేనికీ భయపడడు

ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి యొక్క ప్రవర్తన ఎలా ఉంటుంది అనే విషయాన్ని మీరు తెలుసుకుంటున్నారు. ఈరోజు అదే విషయానికి సంబంధించిన మరో ముఖ్యమైన సందేశాన్ని తీసుకుందాం. ఆత్మజ్ఞాని జరిగే దానిని జరగనిస్తాడు, దేనికీ భయపడడు.

మీరు గమనించినట్లయితే, మీ జీవితంలో కానీ, మీ కుటుంబ సభ్యుల జీవితాల్లో కానీ, సమాజంలో కానీ, ప్రపంచంలో కానీ ఎన్నో సంఘటనలు జరుగుతూ ఉంటాయి. వాటిలో కొన్ని మనకు ఆనందాన్ని కలిగించే సంఘటనలు ఉంటాయి. మరికొన్ని మనకు బాధను కలిగించే సంఘటనలు ఉంటాయి. ఇంకొన్ని సంఘటనలు చాలా భయంకరంగా కూడా అనిపిస్తాయి. అటువంటి సంఘటనలు మీ జీవితంలో ఎదురైనప్పుడు మీరు వెంటనే భయపడిపోతారు.

“ఇలా ఎందుకు జరిగింది? నా జీవితంలోనే ఎందుకు ఇలా జరిగింది? ఇప్పుడు నేను ఏం చేయాలి? నా పరిస్థితి ఏమవుతుంది? ఇక నేను ఎలా బతకాలి?” అని ఆలోచిస్తూ ఆందోళన చెందుతారు. కొన్నిసార్లు జరిగిన సంఘటనను పదే పదే గుర్తు చేసుకుంటూ బాధపడతారు, భయపడతారు, కుమిలిపోతారు.

కానీ ఏది జరగాలో అది జరుగుతుంది, జరగవలసిన దాన్ని ఎవరూ ఆపలేరు అని ఆత్మ జ్ఞానికి ఒక అవగాహన ఉంటుంది.. జరిగిన దాన్ని అర్థం చేసుకుని, తన కర్తవ్యాన్ని తాను చేస్తాడు. జరిగిన సంఘటనను మార్చ లేనప్పుడు

దాని గురించి భయపడుతూ, బాధపడుతూ, మనశ్శాంతిని కోల్పోవడం వల్ల ప్రయోజనం ఏముంది?

కొంతమంది సంసారాలను గమనించండి, కొంతమంది కుటుంబాల్లో ఎప్పుడూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. భార్యాభర్తల మధ్య చిన్న విషయాలు పెద్ద సమస్యలుగా మారతాయి. ఎంత సర్దుకుందామని ప్రయత్నించినా, ఒకరి మాటను మరొకరు అర్థం చేసుకోకపోవడం వల్ల సమస్యలు మరింత పెరుగుతాయి.

ఆవేశంలో ఒకరు ఒక మాట అంటారు, కోపంలో మరొకరు ఇంకొక మాట అంటారు. ఒకరి మనసులో ఉన్న బాధను మరొకరు అర్థం చేసుకోరు. ఒకరి పరిస్థితిని మరొకరు అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించరు. చివరకు చిన్న సమస్యే పెద్ద సమస్యగా మారుతుంది. అప్పుడు ఇద్దరూ, "మా జీవితం ఇలా అయిపోయింది, ఇక మా జీవితంలో శాంతి ఉండదా?" అని బాధపడుతుంటారు.

కొన్ని సందర్భాల్లో ఈ సమస్యలు విడాకుల వరకు కూడా వెళ్తాయి. భార్యాభర్తలు విడిపోతారు. మరికొంతమంది విడిపోకుండా కలిసి ఉంటూనే ప్రతిరోజూ బాధపడుతుంటారు. బయటికి కుటుంబం కలిసి ఉన్నట్లు కనిపించినా, లోపల మాత్రం శాంతి ఉండదు.ఇలాంటి సంఘటనలు ఈ లోకంలో ఎన్నో జరుగుతూనే ఉన్నాయి.

కానీ ఆత్మజ్ఞాని ఇలాంటి పరిస్థితిని చూసినప్పుడు, "నా జీవితం అంతా నాశనం అయిపోయింది" అని తనను తాను బాధించుకోడు. పరిస్థితిని స్పష్టంగా గమనిస్తాడు. తన వల్ల మార్చగలిగినది ఏదైతే ఉందో దాన్ని మార్చడానికి ప్రయత్నిస్తాడు. తన వల్ల మార్చ లేనిది ఏదైతే ఉందో దాన్ని

అంగీకరిస్తాడు. ఆత్మజ్ఞాని అంటే సమస్యలు లేని వ్యక్తి కాదు. సమస్యలు వచ్చినప్పుడు వాటిని చూసి భయపడని వ్యక్తి.

సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. మనకు నచ్చినవి జరుగుతాయి. మనకు నచ్చినవి కూడా జరుగుతాయి. అయితే ఆత్మజ్ఞాని జరిగిన సంఘటనలు ఎలా ఉన్నా తన అంతరంగ శాంతిని కాపాడుకుంటాడు.

అందుకే మీరు కూడా జీవితంలో ఏదైనా సంఘటన ఎదురైనప్పుడు వెంటనే భయపడకుండా, ముందుగా "ఇది జరిగింది. ఇప్పుడు నేను చేయవలసిన కర్తవ్యం ఏమిటి?" అని ఆలోచించండి. జరిగేది జరుగుతుంది. కానీ అది జరిగినప్పుడు మీరు ఎలా స్పందిస్తారనేది మీ చేతుల్లో ఉంది.

ఈ అవగాహనతో మీరు జీవించినప్పుడు మీలో భయం, ఆందోళన తగ్గుతుంది. కొన్ని సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయో వెంటనే అర్థం కాకపోవచ్చు. మనకు అర్థం కాని పరిస్థితులు ఎదురైనప్పుడు మనసులో భయం, ఆందోళన మొదలవుతాయి. "ఇలా ఎందుకు జరిగింది? ఇక ముందు ఏమవుతుంది?" అనే ఆలోచనలు మనల్ని మరింత కలవరపెడతాయి.

కానీ ఆత్మజ్ఞానికి ఒక స్పష్టమైన అవగాహన ఉంటుంది. "జరగాల్సింది,జరిగింది, దానికి భయపడేది ఏముంది?" జరిగిన దాన్ని వెనక్కి తీసుకురాలేం, జరగాల్సిన దాన్ని పూర్తిగా ఆపలేం. కాబట్టి ప్రతి సంఘటనను చూసి భయపడి పోవడం వల్ల ప్రయోజనం ఏముంది? పరిస్థితిని అర్థం చేసుకుని, దానికి తగిన విధంగా స్పందించడం నేర్చుకోవాలి.

జరిగేదానికి భయపడేవారికి, జరగబోయే దాని గురించి ముందుగానే ఆందోళన చెందేవారికి ఒక విషయం గుర్తుంచుకోవాలి, మీ జ్ఞానం పెరిగే కొద్దీ, మీ అవగాహన కూడా పెరుగుతుంది.

ఇంతవరకు మీరు తెలుసుకున్న విషయాలన్నింటినీ ఒకసారి గమనించండి. జీవితం గురించి, కర్మ గురించి, సృష్టి గురించి, ఆత్మ గురించి మీరు తెలుసుకుంటున్న కొద్దీ "ఏది శాశ్వతం కాదు" అనే ఒక గొప్ప సత్యం అర్థమవుతుంది

మీ జీవితంలో ఏ పరిస్థితి వచ్చినా అది ఎప్పటికీ అలాగే ఉండదు. సుఖం శాశ్వతం కాదు, దుఃఖం కూడా శాశ్వతం కాదు, విజయం శాశ్వతం కాదు, అపజయం కూడా శాశ్వతం కాదు, కష్టం శాశ్వతం కాదు, సమస్య కూడా శాశ్వతం కాదు. పరిస్థితులు మారుతుంటాయి. సంఘటనలు వస్తుంటాయి, కొంతకాలం ఉంటాయి, ఆ తర్వాత మారిపోతుంటాయి.

కాబట్టి వాటిని చూసి భయపడకుండా, సాక్షిగా ఉండడం నేర్చుకోవాలి. ఇదే ఆత్మజ్ఞాని యొక్క ముఖ్యమైన లక్షణం. ఆత్మజ్ఞాని జరిగే దానిని జరగనిస్తాడు. ఇది నిర్లక్ష్యం కాదు, ఇది చేతులు ముడుచుకుని కూర్చోవడం కాదు. పరిస్థితిని మార్చడానికి అవసరమైన ప్రయత్నం చేస్తాడు.

ఉదాహరణకు, మీ జీవితంలో ఏదైనా సమస్య వచ్చిన వెంటనే భవిష్యత్ అంతా అంధకారంగా కనిపిస్తుంది. "ఇక నా జీవితం ఇంతే అని అనుకుంటారు. కానీ ఆత్మజ్ఞాని అలా ఆలోచించడు చీకటి కూడా శాశ్వతం కాదు. రాత్రి ఎంత సేపు ఉన్నా ఉదయం తప్పకుండా వస్తుంది. చీకటి ఎంత ఎక్కువగా ఉన్నా కొంతకాలం తర్వాత వెలుతురు వస్తుంది అదే సృష్టి ధర్మం అని తెలుసుకుంటాడు.

అందుకే సృష్టిలో ఉన్న ఈ సత్యాలను మీరు ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి. "ఏదీ శాశ్వతం కాదు. పరిస్థితులు మారుతాయి, కాబట్టి భయపడకుండా సాక్షిగా ఉండాలి." ఈ విషయాలను కేవలం వినడం మాత్రమే

కాకుండా, మీ జీవితానికి ఉపయోగపడే విధంగా గుర్తుంచుకోవాలి. అందుకే నేను ఎప్పుడూ చెబుతూ ఉంటాను మీరు తెలుసుకుంటున్న ఈ ముఖ్యమైన విషయాలన్నింటినీ ఒక ప్రత్యేకమైన డైరీలో రాసుకోండి.

ఎందుకంటే జీవితంలో ఎప్పుడు ఏ సమస్య వస్తుందో, ఎలాంటి సంఘటన ఎదురవుతుందో, ఏ పరిస్థితి ఏర్పడుతుందో మీకు ముందుగా తెలియదు. అలాంటి సమయంలో మీరు ఆ డైరీని ఒక్కసారి తెరిచి, ఇంతవరకు తెలుసుకున్న విషయాలను మళ్ళీ చదివితే, పెద్దలు చెప్పిన మాటలు మీకు గుర్తుకు వస్తాయి. ఆ జ్ఞానం మీలో ధైర్యాన్ని కలిగిస్తుంది. కొన్ని సందర్భాల్లో మీ సమస్యకు పరిష్కారం కూడా మీకు కనిపిస్తుంది.

అప్పుడు ప్రతి చిన్న విషయానికీ ఎవరో ఒకరిని అడగాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే మీరు ఎవరినైనా సలహా అడిగితే, వారు తమకు ఉన్న జ్ఞానం, అనుభవం పరిధిలోనే మీకు సమాధానం చెబుతారు. వారి సలహా వారి స్థాయికి అనుగుణంగా ఉంటుంది. కానీ మీరు స్వయంగా జ్ఞానాన్ని పెంచుకుంటే, పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యం మీలోనే పెరుగుతుంది.

అందుకే ఇప్పుడు మీరు తెలుసుకుంటున్న ప్రతి విషయం భవిష్యత్తులో మీ జీవితంలో ఏదో ఒక సందర్భంలో తప్పకుండా ఉపయోగపడుతుంది. కష్ట కాలంలో మీకు ధైర్యాన్ని ఇస్తుంది. కాబట్టి మీరు తెలుసుకున్న జ్ఞానాన్ని ఎప్పుడూ మర్చిపోకండి.

కొంత మందికి విషయాలు చాలా బాగా గుర్తుంటాయి. జ్ఞాపక శక్తి ఉన్నవారికి, బుద్ధి బాగా వికసించిన వారికి, ఒక సందర్భం ఎదురైన వెంటనే తగిన జ్ఞానం గుర్తుకు వస్తుంది. కానీ బుద్ధి వికసించని వారికి, తాము గతంలో విన్న విషయాలు ఆ సమయంలో గుర్తుకు రావు.

అందుకే జ్ఞానం తెలుసుకోవడం మాత్రమే కాదు, దాన్ని గుర్తుంచుకోవడం, మననం చేయడం, అవసరమైన సమయంలో ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకోవడం కూడా చాలా ముఖ్యం. మీరు ఎంతగా జ్ఞానాన్ని పెంచుకుంటారో, అంతగా మీ అవగాహన పెరుగుతుంది. అవగాహన పెరిగిన కొద్దీ భయం తగ్గుతుంది. భయం తగ్గిన కొద్దీ మీరు పరిస్థితులను ప్రశాంతంగా చూడగలుగుతారు. అప్పుడు జీవితంలో ఏ సంఘటన వచ్చినా మీరు వెంటనే కుంగిపోరు. "ఇది కూడా శాశ్వతం కాదు, ఇది కూడా మారిపోతుంది. నేను భయపడాల్సిన అవసరం లేదు, నేను సాక్షిగా ఉండాలి, నేను చేయవలసిన కర్తవ్యాన్ని నేను చేస్తాను" అనే అవగాహనతో జీవించగలుగుతారు.

అందుకే పత్రి గారు లాక్‌డౌన్ సమయంలో కూడా ఈ విషయాన్ని ఎంతో స్పష్టంగా చెప్పారు. "ఆత్మజ్ఞాని జరిగే దానిని జరగనిస్తాడు, దేనికీ భయపడడు." ఆత్మజ్ఞాని యొక్క జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఈ ఒక్క వాక్యం చాలు.

ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఎన్నో పరిస్థితులు ఎదురవుతూనే ఉంటాయి. ఎలాంటి పరిస్థితులు ఎదురవ్వకుండా ఎవరి జీవితం కూడా ఉండదు. సుఖమైన పరిస్థితులు వస్తాయి, కష్టమైన పరిస్థితులు వస్తాయి. అనుకూలమైన సంఘటనలు జరుగుతాయి, ప్రతికూలమైన సంఘటనలు కూడా జరుగుతాయి. ఈ విషయాన్ని మీరు ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. భూమి ఒక పాఠశాల  అనుభవాల ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలి

ఈ భూమ్మీద ఎన్నో సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. అవి జరగకుండా ఉండవు. కాబట్టి అవి జరిగినప్పుడు వెంటనే భయపడి పోకుండా, వాటిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. అవి జరగనివ్వండి. వాటి ద్వారా

మీరు నేర్చుకోవలసిన పాఠాన్ని నేర్చుకోండి.

మీరు గతంలో చేసిన కర్మల ఆధారంగానే మీ ప్రస్తుత జన్మ ఉంటుంది. గతంలో అంటే ఈ జన్మకు ముందు మీరు ఎన్ని జన్మలు తీసుకున్నారో, ఆ జన్మల్లో చేసిన కర్మల నుంచి, ఈ జన్మలో అనుభవించడానికి మీరు ఎంచుకున్న కర్మల ఆధారంగానే మీ జన్మను మీరు ఎంచుకున్నారు. ఇది చాలా ముఖ్యమైన విషయం, మీరు గుర్తుపెట్టుకోవాలి మీ జన్మ కూడా మీ ఎంపికే. మీరు ఎటువంటి ప్రదేశంలో పుట్టాలి, ఎటువంటి కుటుంబంలో జన్మించాలి, ఎటువంటి కులంలో పుట్టాలి, ఎటువంటి భర్తను లేదా భార్యను ఎంచుకోవాలి, ఎటువంటి పిల్లలను పొందాలి అనేది కూడా మీరు చేసుకున్న ఎంపికలలో భాగమే. అయితే, ఈ ఎంపికలన్నీ జీవితం ఎప్పుడూ సుఖంగా, సాఫీగా సాగిపోవడానికి కాదు. ఎందుకంటే ఎవరి జీవితం కూడా ఎప్పుడూ సాఫీగా ఉండదు. జీవితంలో ఎదురయ్యే ప్రతి పరిస్థితి వెనుక ఒక కారణం ఉంటుంది. మీరు అనుభవించవలసిన అనుభవాలను అనుభవిస్తూ, నేర్చుకోవలసిన పాఠాలను నేర్చుకుంటూ, క్రమంగా మీ జ్ఞానాన్ని పెంచుకోవడానికే ఈ జీవితం ఒక అవకాశంగా లభించింది.

కాబట్టి మీకు ఈ అవగాహన ఉండాలి. మీరు ఈ శరీరం కాదు, మీరు ఆత్మ. మీకు కనిపిస్తున్న ఈ శరీరం కేవలం మీరు ఉపయోగిస్తున్న ఒక సాధనం మాత్రమే. ఆత్మ అయిన మీరు ఈ శరీరాన్ని ఎందుకు తీసుకున్నారు అంటే, కొన్ని అనుభవాలను పొందడానికి, కొన్ని పాఠాలను నేర్చుకోవడానికి, గత కర్మలను అనుభవించి వాటి ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవడానికి. అందువల్ల జీవితంలో ఏ సంఘటన జరిగినా, "ఇది నాకు ఎందుకు జరిగింది?" అని బాధపడటం కంటే, "ఈ సంఘటన ద్వారా నేను ఏమి నేర్చుకోవాలి? ఇందులో

నాకు ఏ పాఠం ఉంది? నా జ్ఞానం ఎలా పెరగాలి?" అని ఆలోచించాలి. మీరు జీవితాన్ని ఈ దృష్టితో చూడటం ప్రారంభించినప్పుడు, ప్రతి అనుభవం, ప్రతి సంఘటన ఒక పాఠంగా మారుతుంది.

పత్రి గారు స్పష్టంగా చెప్పారు, భూమి ఒక పాఠశాల అని. మీరు పై లోకంలో జన్మను ఎంచుకున్నప్పుడే, అంటే భూమ్మీదకు రావాలని మీరు నిర్ణయించుకున్నప్పుడే, "నేను ఒక పాఠశాలలోకి వెళ్తున్నాను" అని తెలుసుకోవాలి. మీరు ఒక పాఠశాలకు వెళ్ళి పాఠాలు ఎలా నేర్చుకుంటారో, అలాగే భూమ్మీదకు వచ్చి కూడా పాఠాలు నేర్చుకుంటారు. మీరు పాఠశాలకు వెళ్ళి పాఠాలు నేర్చుకుంటున్నప్పుడు, ఆ పాఠశాలలో ఉన్నవన్నీ మీవి కావు, మీరు ఎంతకాలం అక్కడ ఉంటారో అంతకాలం వాటిని ఉపయోగించు కుంటారు. అలాగే భూలోకానికి వచ్చి మీరు పాఠాలు నేర్చుకుంటున్నప్పుడు, ఈ భూలోకంలో మీరు సంపాదించుకున్నవన్నీ మీవి కావు. ఇది ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. కానీ "మా ఆయన సంపాదించాడు, మా అబ్బాయి సంపాదించాడు, నేను సంపాదించాను" అని ఇలా భావిస్తారు. ఇక్కడ మీది అంటూ ఏమీ లేదు. "నేను సంపాదించాను, నేను సంపాదించాను" అని అనుకున్న వాళ్ళందరికీ ఎప్పుడు తెలుస్తుంది అంటే, శరీరం వదిలిన తర్వాత తెలుస్తుంది. అప్పుడు బాధపడతారు. "ఏంటి, ఇవన్నీ నావే అనుకున్నాను, ఒక్కటి కూడా నాతో రావడం లేదేంటి?" అని అనుకుంటారు. ఇది ముందే తెలిస్తే, సంపాదించడం కోసం తప్పులు చేయడం, పాపాలు చేయడం, అధర్మంగా వ్యవహరించడం ఎందుకు చేస్తారు? ఇవన్నీ చేసి ఆ పాపాల మూటను మాత్రం పట్టుకొని వెళ్తారు.

కానీ ఈ సంపదల్లో ఏదీ మీతో రాదు. కాబట్టి మొదట మీరు

తెలుసుకోవలసింది ఏమిటంటే, “నేను పాఠాలు నేర్చుకోవడానికే భూమ్మీదకు వెళ్తున్నాను” అనే అవగాహన. మీరు ఎంచుకున్న కర్మలను బట్టి సంఘటనలు జరుగుతాయి. జరగవలసినది ఉంది, ఆ సమయంలో జరగాలి, కాబట్టి జరుగుతుంది. ఎందుకు జరిగాయి? జీవితంలో మీరు ఆ సంఘటన ద్వారా కొన్ని అనుభవాలు పొందాలి, కొన్ని విషయాలు నేర్చుకోవాలి. కానీ మీరు ఏమనుకుంటారు అంటే, “నా జీవితంలో ఇన్ని కష్టాలు ఎందుకు?” అని అనుకుంటారు. అవి కష్టాలు కావండి మీరు నేర్చుకోవలసిన పాఠాలు కొన్ని ఉన్నాయి. ఆ సంఘటనల నుంచి నేను నేర్చుకోవలసిన పాఠాలు ఏమిటి? అనే కోణంలో మీరు ఆలోచిస్తే మీకు తెలుస్తుంది.

అందుకే బుద్ధిని బాగా పెంచుకోవాలి అని చెబుతారు. బుద్ధి, జ్ఞానం రెండూ ఉండవలసిందే. ఈ రెండింటినీ మీరు ఎంత పెంచుకుంటే మీరు అంత ఎదిగినట్లు లెక్క. బుద్ధి ఉంటే మీరు బాగా ఆలోచిస్తారు. జ్ఞానం ఉంటే ప్రతి విషయాన్ని అర్థం చేసుకుంటారు. దేనికీ కంగారుపడరు, భయపడరు, బాధపడరు. కొంతమంది జీవితాలను చూస్తే కుటుంబంలో దారుణమైన పరిస్థితులు ఉంటాయి. కొన్ని ఉమ్మడి కుటుంబాలు ఉంటాయి. కుటుంబంలో రకరకాల వ్యక్తులు ఉంటారు. కొంతమంది మీకంటే తెలివైన వాళ్ళుఉంటారు, మీకంటే మేధావులు ఉంటారు, మీకంటే బలవంతులు ఉంటారు, మీకంటే ఎక్కువగా సంపాదించే వాళ్ళుఉంటారు. ఇలా ఎన్నో తేడాలు ఉంటాయి.

అక్కడ ఒక్కోసారి మీ మాట చెల్లదు. ఒక్కోసారి మీరు ఒంటరిగా అయిపోతారు. మిగతా వాళ్ళంతా ఏకం అయిపోతారు. ఏం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. “ఇలా అయిపోయింది నా జీవితం” అని భయపడుతూ ఉంటారు. అలాగే కొంత మందికి ఆర్థికపరమైన ఇబ్బందులు వస్తాయి.

భరించలేని పరిస్థితులు వస్తాయి. ఒకప్పుడు బాగానే బ్రతికారు. కానీ అనుకోకుండా నష్టం వచ్చింది. నష్టం వస్తే వచ్చింది. అప్పుల పాలై పోయారు, అప్పుల్లో కూరుకుపోయారు. వారి ఆదాయం చూస్తే ఏమీ కనిపించదు, కానీ అప్పులు చూస్తే చాలా ఉంటాయి. మరి అప్పులు ఎలా తీరుస్తారు? బ్రతకాలి అంటే ఈ రోజుల్లో అంత తేలిక కాదు. ఎలా బ్రతకాలి అని ఎంతో మదనపడుతూ ఉంటారు.

ఇంకా కొంత మందికి అప్పులు చేయడం వల్ల అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కొంతమంది దౌర్జన్యం చేస్తారు, బెదిరిస్తారు, రకరకాల మాటలు అంటారు. వాటిని తట్టుకోలేరు. వాడు వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోతాడు. వాడు వెళ్ళిపోయినప్పటి నుంచి “ఎలాగా? ఎలాగా?” అని ఆలోచిస్తూ, అయోమయంలో పడిపోతారు. ఆ జీవితం ఎలా గడుస్తుందో తెలియదు. ఎంత భయపెడుతూ ఉంటారో! అంతగా భయపడుతూ ఉంటారు.

అందుకే పత్రి గారు ఈ విషయాన్ని చెప్పారు: “ఆత్మజ్ఞాని జరిగే దాన్ని జరగనిస్తాడు, దేనికీ భయపడడు.” దీన్ని బట్టి మీరు అర్థం చేసుకోండి, జ్ఞానం ఎందుకు సంపాదించుకోవాలి? అంటే దీని కోసమే సంపాదించాలి. ఈ ప్రయోజనాలన్నీ పొందడం కోసమే జ్ఞానం సంపాదించుకోవాలి.

మీరు జ్ఞానం సంపాదించుకోకుండా అజ్ఞానంలోనే ఉంటే, మీ జీవితం ఇంకా నరకంలా అనిపిస్తుంది. ఒక్కోసారి ఆ బాధను భరించలేక కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడతారు. కాబట్టి మీరు జ్ఞానాన్ని పెంచుకోవాలి, బుద్ధిని పెంచుకోవాలి, జీవితంలో జరిగే ప్రతి సంఘటనను ఒక పాఠంగా తీసుకొని, దాని ద్వారా నేర్చుకోవలసిన విషయాన్ని నేర్చుకోవాలి. అప్పుడు మాత్రమే జీవితాన్ని సరైన అవగాహనతో, భయం లేకుండా, ప్రశాంతంగా

జీవించగలుగుతారు.

ఇంకా కొంతమంది ఉంటారు. చాలా వైభవంగా గొప్పగా ఉంటారు. యుద్ధం వస్తుంది, బాంబులు పడతాయి, ప్యాలస్‌లా ఉన్న బిల్డింగ్ అంతా కుప్పకూలిపోతుంది. ఇప్పుడు వాళ్ళ పరిస్థితి ఏంటి చెప్పండి? అనుకున్నట్టుగా ఉండదు జీవితం. ఎప్పుడు ఎలా మారుతుందో ఎవరికీ తెలియదు. సరే, ఇది ఒకందుకు మంచిది. "ఏం మంచి అండి?" అంటారు. మంచి అనుకుంటే ధైర్యంగా ఉంటారు, చెడ్డగా అనుకుంటే ఆత్మహత్య చేసుకుంటారు, అది మీ నిర్ణయంలో ఉంటుంది.

పత్రి గారు చెప్పేది యోగులకు తెలుస్తుంది కానీ భోగులకు తెలియదు. పత్రి గారు ఏమంటారంటే, "మానవుడు బ్రతకడానికి ఒక రొట్టె ముక్క, ఆవకాయ తొక్క సరిపోదా?" అంటారు. ఎన్ని వేలు కావాలండి దానికి? ఎన్ని లక్షలు కావాలి? అలాగే జీవిస్తున్నారు యోగులు. అన్నీ వదిలేసి దూరంగా వెళ్ళిపోయి, ఆ సాధన చేసుకుంటూ, ఆ పూటకు ఏది దొరికితే దానితో కాలక్షేపం చేస్తున్నారు. బ్రహ్మాండంగా ఎదుగుతారు. కానీ "ఇన్ని ఉండాలి, ఇన్ని కావాలి, ఇవి లేకపోతే నేను ఉండలేను, ఇవి లేకపోతే నేను బ్రతకలేను" అనుకునే వారికి ఏది జరిగినా చాలా భయభ్రాంతులకు గురవుతారు. అలా జరిగే దాని పట్ల భయపడే వారంతా పూర్తి అజ్ఞానంలో ఉన్నట్లు లెక్క.

నా జీవితంలో జరిగినవే కాదు, అమ్మ జీవితంలో కూడా కొన్ని సంఘటనలు జరిగాయి. అమ్మ ఒళ్ళంతా కాలిపోయి హాస్పిటల్‌లో ఉన్నప్పుడు బట్టలన్నీ తీసేసి బెడ్ మీద పడుకోబెట్టారు. ఒళ్ళంతా కట్లు కట్టారు. రోజు విడిచి రోజు వచ్చి ఆ కట్లన్నీ ఊడదీసి, ఆ దూదంతా తీసి, మళ్ళీ మందు రాసి, మళ్ళీ కట్టేవారు. వాళ్ళు వచ్చినప్పుడు అవన్నీ పీకుతుంటే, ఆవిడకు

వాళ్ళంతా యమకింకరుల్లా కనిపించేవారట. ఆ టైం అవుతుందంటేనే భయం వేసేదట. యమకింకరులు అంటే ఎవరికైనా భయమే. ఏం చేస్తారు? భరించాలి తప్పదు. కోడికి పీక కోస్తూ ఉంటే, కాళ్ళతో తొక్కినా అది భరిస్తుంది. ఏం చేస్తుంది? ఏమీ అనడానికి లేదు, తప్పించుకోవడానికి లేదు, ఏమీ లేదు. అలాగే ఆవిడ పరిస్థితి కూడా అయిపోయింది. లేచే ఓపిక లేదు, అటు నుంచి ఇటు తిరగలేదు. రోజూ వచ్చే వాళ్ళుఈ పనులు చేసే వారు. ఎన్ని ఇంజెక్షన్లు పొడిచినా నోరు మూసుకొని కూర్చోవాలి. ఏం చేసినా నోరు మూసుకోవాలి. భరించడమే అనిపిస్తుంది. “ఇలా అయిపోయింది నా జీవితం” అని ఆవిడ అనుకునే పరిస్థితిలో పత్రి గారు మూడు నాలుగు సార్లు హాస్పిటల్‌కు వచ్చారు. ధైర్యం చెప్పారు. “నువ్వు మళ్ళీ మామూలు మనిషి అవుతావు” అన్నారు. “మరి నేను ఎక్కడికైనా వెళ్ళగలనా?” అంటే, “అన్ని ఊళ్ళకు తిరుగుతావు, విదేశాలు కూడా తిరుగుతావు” అని ఎంతో ధైర్యం చెప్పారు. ఆయన ఆ బెడ్ ప్రక్కనే కుర్చీలో కూర్చుని, ఆవిడ చెయ్యి తీసుకుని తన చేతిలో పెట్టుకుని అన్నమాచార్య పాటలు కూడా పాడారు. ఆయన అలా కాన్ఫిడెన్స్ కలిగించారు. అంతకుముందు “ఇక అయిపోయింది నా జీవితం” అని ఆవిడ అనుకుంటే, ఆయన ఏమన్నారు అంటే, “నువ్వు మళ్ళీ మామూలు మనిషి అవుతావు, అన్ని చోట్లకు తిరుగుతావు, ఇంకా ఎన్నో యజ్ఞాలు ఉన్నాయి, ఆ యజ్ఞాలకు వస్తావు, విదేశాలకు వెళ్తావు” అని చెప్పారు.

అంత కాన్ఫిడెన్స్ క్రియేట్ చేయడం వల్ల, “పత్రి గారు చెప్పింది కరెక్టే, కచ్చితంగా అలా జరుగుతుంది” అనే భావం ఆవిడలో ఏర్పడింది. “ఇప్పుడు నేను ఇలా ఉన్నాను” అనే భావాన్ని లోపల ఫిక్స్ చేసుకోకుండా, ఈ పరిస్థితులన్నింటినీ మర్చిపోయింది. దాన్ని పట్టించుకోలేదు. ధైర్యంగా

నిలబడింది, మరి ఎలా బయటకు వచ్చిందో, ఎలా తిరుగుతుందో మేము ఆశ్చర్యపోతూ ఉంటాం. ఎక్కడెక్కడికి వెళ్తుంది! ఎవ్వరూ లేకుండా ఒక్కతే వెళ్తుంది. మరి ఇక్కడ పత్రి గారు చెప్పిన మాట, “ఆత్మజ్ఞాని జరిగే దాన్ని జరగనిస్తాడు, దేనికీ భయపడడు.” ఇప్పుడు నాకంటే ఎక్కువగా తిరుగుతుంది ఆవిడ. మొదట్లో “నా వల్ల కాదు” అనేది. ఇప్పుడు నన్ను మించిపోయింది. ఆమెలో ఇంకో పట్టుదల కూడా ఉంది. మా సారు రాఘవరావు గారు క్లాసులు చెబుతున్నారు. “నేను ఎందుకు చెప్పలేను?” అని. మొదట్లో “నా వల్ల కాదులే, మీరు చెప్పుకోండి” అనేది. తర్వాత ఆమె లోనే అంతర్మథనం జరిగింది. “ఆయన ఏంటి? నేను ఎందుకు చెప్పలేను?” అని అనుకుని, అక్కడి నుంచి ఖాళీ దొరికితే ధ్యానం చేయడం మొదలుపెట్టింది. ఈ మూడు రోజుల క్లాసులలో ధ్యానం చేస్తుంది, ఇంటి దగ్గర కూడా ఖాళీ దొరికితే ధ్యానం చేస్తుంది. పక్క గదిలోకి వెళ్ళి ధ్యానంలో కూర్చుంటుంది. ఇంట్లో పని మనుషులు ఉండడం వల్ల చేయవలసిన పనులన్నీ వాటంతట అవే అయిపోయేవి.

ఒకప్పుడు పుస్తకంలో ఉన్న దాన్ని బట్టీ పట్టీ క్లాసులు చెప్పే స్థాయి నుండి ఇప్పుడు ఒక చిన్న వాక్యం ఇస్తే దానిమీద అనర్గళంగా చెప్పే స్థాయికి ఎదిగింది. ఆ సంఘటన జరిగినప్పుడు, “సరే, ఇది ఎందుకు జరిగిందో? జరిగింది, భయపడాల్సిన అవసరం లేదు” అనే ధైర్యంతో ఉంది.

అలానే నేను యాసిడ్ నోట్లో పోసుకున్నప్పుడు కూడా ముందు అలాగే అనిపించింది. కానీ ఇవన్నీ మనం తెచ్చుకున్నవే, మనం చేసుకున్నవే కాబట్టి, “సరే, జరగాల్సి ఉంది, జరిగింది. దీని ప్రయోజనం ఏదో ఉంది” అని అనుకుని ధైర్యంగా ఉంటే, అనుకున్న దాని కంటే తొందరగా బయటకు రాగలిగాను. భయపెట్టారు, గొంతుకు పోతుందనో, లేకపోతే మళ్ళీ ఆపరేషన్

ఏమైనా చేయాలేమో అని చెప్పారు. కానీ ఏమీ లేకుండా బయటపడ్డాను. అందుచేత ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్నో జరుగుతూ ఉంటాయి. అందుకే పత్రి గారు అంటారు, "జరిగేదాన్ని జరగనివ్వండి, దేనికీ భయపడకూడదు." ఆరోగ్య ఇబ్బందులు వస్తాయి, ఆర్థిక ఇబ్బందులు వస్తాయి, కుటుంబ పరమైన ఇబ్బందులు వస్తాయి, ఇంకా ఎన్నో వస్తాయి. "ఇలాంటి మొగుడు వచ్చాడు, ఇలాంటి పెళ్లాం వచ్చింది, ఇలాంటి పిల్లలు వచ్చారు" అని అనుకుంటారు. ఏమీ కాదు.

నేను కూడా చిన్నప్పటి నుంచి కొన్ని విషయాలను గమనించాను. కొన్ని కుటుంబాలు వారి తెలివి తక్కువ తనంతోనో, మరేదైనా కారణంతోనో ఆర్థికంగా చితికిపోయి, ఆస్తులన్నీ అమ్ముకొని, ఏమీ లేని స్థితిలో ఉన్నా, "ఇక వీళ్ళు జీవించడం కూడా కష్టం" అని అనుకునే పరిస్థితిలో కూడా మామూలుగానే జీవించేవారు. నేను ఆశ్చర్యపోయేవాడిని. వాళ్ళకు ఎలా వస్తున్నాయి? ఆ తిండి ఎక్కడి నుంచి వస్తుంది? అని. కానీ భగవంతుడు, ప్రకృతి ఏదో ఒక దారి చూపిస్తాడు. ఒక సామెత ఉంది, "When one door closes, another door opens." ప్రకృతిలో ఒక దారి మూసుకుపోతే ఇంకో దారి ఆటోమేటిక్‌గా తెరుచుకుంటుంది. అన్ని దారులు మూసుకుపోయాయని అనుకున్నా, ఆఖరి దారి కూడా మూసుకుపోయిందని అనుకున్నా, ఇంకో దారి తెరుచుకుంటుంది. ప్రకృతిలో ఉన్నటువంటి ఏర్పాటు ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. అలాంటి విషయాలన్నీ పత్రి గారు లాక్‌డౌన్ టైంలో చెప్పారు. నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఆయన ఆ లాక్‌డౌన్ టైంలో చెప్పిన ఈ విషయాలన్నీ ఇప్పుడు చూస్తే, అవి ఎంత సత్యమైనవో అర్థమవుతుంది. కాబట్టి గుర్తుపెట్టుకోండి: "ఆత్మ జ్ఞాని జరిగే దాన్ని జరగనిస్తాడు, దేనికీ భయపడడు."

# ఆత్మ జ్ఞాని వయస్సును లెక్కించడు జ్ఞాన వృద్ధులే నిజమైన పెద్దలు

పత్రి గారు చెప్పిన ప్రతి సందేశం కూడా చాలా, చాలా ముఖ్యమైనది. ఆధ్యాత్మికంగా ఎవరైతే ఎదగాలనుకుంటారో, జ్ఞాన సంపన్నులు కావాలను కుంటారో, వారు తప్పని సరిగా పత్రి గారు చెప్పిన ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టుకోవాలి. ఆయన చెప్పిన విషయం మీ జీవితంలో ఆచరణలోకి వచ్చినప్పుడు, మీలో కొంత జ్ఞానం పెరిగినట్టే లెక్క. జ్ఞానం సంపాదించుకోవడం అనేది మీ ప్రవర్తనను బట్టి ఆధారపడి ఉంటుంది. ఊరికే విన్నంత మాత్రాన మీకు జ్ఞానం వచ్చినట్టు కాదు.

"ఆత్మజ్ఞాని వయస్సును లెక్కించడు, వయస్సు లెక్క దేహానికే కానీ ఆత్మకు కాదు. ఆత్మ కాలానికి అతీతమైనది".

మీరు జ్ఞాన పరంగా ఎదిగారా? లేదా? అన్నది తెలుసుకోవడానికి ఇది కూడా ఒక కొలమానమే. సాధారణంగా అందరూ వయస్సు గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. ఎవరైనా కనిపిస్తే, "మీ వయస్సు ఎంత?" అని అడుగుతారు. అలాగే కొంతమంది వృద్ధులు "నా వయస్సు ఇంత" అని చెప్పుకుంటూ ఉంటారు. అలా వయస్సు ప్రస్తావనతోనే ఎక్కువగా మాట్లాడుతున్నారంటే, వారిని అజ్ఞానులుగా అనుకోవచ్చు.

అసలు మీకు వయస్సు ప్రస్తావన ఎందుకు? వయస్సు పెరిగితే అన్నీ తెలిసినట్టుగా, గొప్ప వారైనట్టుగా భావిస్తారు. కానీ వయస్సు పెరగడం గొప్ప కాదు, జ్ఞానం పెరగడం గొప్ప. అందుకే బుద్ధుడు **"వయోవృద్ధులు కాదు, జ్ఞాన వృద్ధులు కావాలి"** అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే, **"వయస్సులో వృద్ధుడైన వాడిని నేను వృద్ధుడు, పెద్ద వాడు అనను, బాలుడైనా**

**సరే జ్ఞానంలో వృద్ధుడైతే వాడినే వృద్ధుడు అంటాను"** అని చెప్పారు, అంటే జ్ఞాన వృద్ధులే నిజమైన వృద్ధులు. వయోవృద్ధులు పెద్దవారు కాదు, జ్ఞాన వృద్ధులే నిజమైన పెద్దవారు.

లోకంలో ఒక సామెత ఉంది, "పెద్దల మాట చద్దిమూట" అని. లోకంలో మానవులు సాధారణంగా పెద్దలు అంటే వయస్సు ఎక్కువగా ఉన్న వాళ్ళు అని భావిస్తారు. కానీ జ్ఞాన వృద్ధులే నిజమైన పెద్దవారు. అటువంటి వారి మాటలు నిజంగా ఒక చద్దిమూట లాంటివి.

పూర్వకాలంలో ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు చద్దన్నాన్ని ఏదో ఒక ఆవకాయ ముక్కతో కలిపి మూట కట్టుకుని తీసుకెళ్ళేవారు. భోజన సమయం అయినప్పుడు చద్దన్నాన్ని తిని, సాయంకాలం వరకు పని చేసుకుని తిరిగి వచ్చేవారు. అలాంటి చద్దిమూటను జ్ఞానం ఉన్నవారి మాటలతో పోల్చవచ్చు. ఆ మాటలు చాలా సాధారణంగా కనిపించినా, వాటిలో ఎంతో లోతైన జ్ఞానం దాగి ఉంటాయి.

అలాగే ఒక వ్యక్తి వయసులో చిన్నవాడై ఉండవచ్చు, బాలుడై ఉండవచ్చు కానీ అతనిలో జ్ఞానం ఉంటే, అతడే నిజమైన వృద్ధుడు. వయస్సు పెరగడం మాత్రమే వృద్ధాప్యం కాదు, జ్ఞానం, వివేకం, అనుభవం పెరగడమే నిజమైన వృద్ధాప్యం. అందుచేత పత్రి గారు ఏమంటారు అంటే చాలా మంది రాముడిని ఆదర్శంగా చెబుతూ ఉంటారు. రాముడు తన తండ్రి మాటను జవదాటలేదని, తండ్రి మాటను గౌరవించి, ఆ మాటకు కట్టుబడి జీవించాడని చెబుతారు. అలా తండ్రి మాట వినటం చాలా ముఖ్యం అని చెబుతుంటారు.

లోకంలో రాముడిని ఉదాహరణగా చెబితే, పత్రి గారు ప్రహ్లాదుడిని ఉదాహరణగా చెబుతారు. మరి నిజంగా హిరణ్యకశిపుడు జ్ఞాన మార్గంలో ఉన్న ప్రహ్లాదుడిని ఎందుకు కోపగించుకున్నాడు? "ఏమిత్రా, ఎప్పుడూ

నారాయణ, నారాయణ అంటూ కూర్చుంటావు! నేను మూడు లోకాలను జయించాను. నాకు వారసుడివి నువ్వు. నువ్వు కూడా నా తర్వాత చక్రవర్తివై, రాజ్యాన్ని పాలిస్తూ సుఖంగా జీవించు" అని చెప్పాడు. కానీ ప్రహ్లాదుడు తండ్రి ఎంత చెప్పినా వినలేదు. మొదట ప్రేమగా చెప్పాడు, తరువాత గట్టిగా చెప్పాడు, ఆ తర్వాత బెదిరించాడు. చివరకు ప్రహ్లాదుడిని చంపుతానని కూడా బెదిరించి, అనేక విధాలుగా చంపడానికి ప్రయత్నించాడు. అయినా ప్రహ్లాదుడు భయపడలేదు, తన ప్రాణాలకంటే సత్యాన్నే గొప్పదిగా భావించాడు.

అందుచేత తండ్రి అయినా సరే, తాత అయినా సరే, వారు చెప్పేది ఏమిటో మీరు ఆలోచించుకోవాలి. వారు గనుక సత్యానికి, జ్ఞానానికి విరుద్ధంగా బోధిస్తూ ఉంటే, వారి మాట ఎలా వింటారు? వారి మాట వింటే వారు నాశనం అవుతారు, మీరు కూడా నాశనం అవుతారు. అందుచేత ప్రహ్లాదుడు తండ్రి మాట వినలేదు. ఇక్కడ మీరు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. తండ్రి అయినా, తల్లి అయినా, తాత అయినా, గురువు అయినా ఎవరు చెప్పినా, వారు చెప్పే మాట సత్యానికి, జ్ఞానానికి, ధర్మానికి అనుగుణంగా ఉందా లేదా అని మీరు ఆలోచించాలి. కేవలం వారు పెద్దవారు కాబట్టి, వారు చెప్పిన ప్రతి మాటను ఆలోచించకుండా అనుసరించడం జ్ఞానం కాదు. ఒకవేళ వారు సత్యానికి, జ్ఞానానికి విరుద్ధంగా బోధిస్తే, మీరు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తే దాని ఫలితం వారికి నష్టమే, మీకు కూడా నష్టమే. అందుకే ప్రహ్లాదుడు తండ్రి మాటను వినకుండా సత్యం వైపే నిలబడ్డాడు.

ఇప్పుడు చూడండి, పత్రి గారి మార్గంలోకి, జ్ఞాన మార్గంలోకి వచ్చిన తర్వాత చాలామంది తమ జీవితంలో అనేక మార్పులు చేసుకున్నారు. ఉదాహరణకు, చాలామంది మాంసాహారాన్ని మానేశారు. హింసకు కారణమయ్యే మాంస భక్షణాన్ని విడిచిపెట్టి, అహింస, సాత్త్విక జీవన విధానం

వైపు అడుగులు వేశారు.

కానీ పెద్దలు ఏమంటారంటే, "పిచ్చివాడా! నువ్వు మాంసం తినకపోతే నీకు బలం ఎక్కడి నుంచి వస్తుంది? నువ్వు ఏ పని చేయగలవు? మాంసం తినకపోతే నువ్వు మనిషివేనా? ఎంత రుచిగా ఉంటుందో తెలుసా?" అని అంటుంటారు. "మా తాత తిన లేదా? మా ముత్తాత తిన లేదా? మన వంశంలో అందరూ తిన్నారు. నువ్వు మాత్రం మాంసం మానేసి దద్దమ్మలా ఎందుకు ఉంటావు?" అంటూ ఎగతాళి చేస్తారు, ఆక్షేపిస్తారు, కొన్నిసార్లు తిడతారు కూడా. భర్త చెప్పవచ్చు, భార్య చెప్పవచ్చు, తల్లిదండ్రులు చెప్పవచ్చు, పెద్దలు చెప్పవచ్చు. అయినా పత్రి గారి శిష్యుల్లో చాలామంది అలాంటి మాటలను పట్టించుకోకుండా తమ నిర్ణయంపై నిలబడ్డారు.

ఎందుకంటే కేవలం ఎవరో చెప్పారని మాంసాహారాన్ని మానేయలేదు, దాని వెనుక ఉన్న కారణాన్ని, దాని వల్ల కలిగే పరిణామాలను తెలుసుకున్నారు. మాంసాహారం కోసం జరిగే హింస ఎంతటి బాధకు కారణమవుతుందో, అలాంటి ఆహారం మీలో రజోగుణాన్ని ఎలా పెంచుతుందో, రజోగుణం పెరిగిన కొద్దీ ఆలోచనలు, మాటలు, ప్రవర్తన ఎలా మారుతాయో అర్థం చేసుకున్నారు. అందుకే "నేను అలాంటి జీవితం జీవించను, అలాంటి హింసకు కారణం కాను, అలాంటి కర్మను చేయను" అని స్పష్టంగా నిర్ణయించుకున్నారు. తిన్నప్పుడు రుచి ఉండవచ్చు కానీ దాని ఫలితం ఏమిటో తెలుసుకున్నారు. ఆ కర్మకు సంబంధించిన ఫలితాన్ని అనుభవించే సమయం వచ్చినప్పుడు, ఆ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో మీరు ముందుగానే ఆలోచించాలి.

అందుకే పెద్దలు ఏమన్నా సరే, కుటుంబంలో ఎవరెంత ఒత్తిడి చేసినా సరే, ఇప్పుడు ఎంతోమంది చేయకూడదని తెలుసుకున్న పనులను,

ముఖ్యంగా హింసకు కారణమయ్యే మాంసభక్షణను పూర్తిగా మానేశారు. నేను కూడా కొన్ని చోట్ల గమనిస్తున్నాను కొంతమంది భర్తలు, నువ్వు మాంసం తినడం మానేశావు, అది నీ ఇష్టం, నేను నిన్ను తినమని అనడం లేదు, నువ్వు తినకపోతే తినకు. కానీ నాకు మాత్రం వండి పెట్టు అని అంటుంటారు.

అలాంటి సందర్భాల్లో భర్త మాటను కాదనలేక, భయంతోనో, కుటుంబంలో సమస్యలు వస్తాయనే భయంతోనో కొంతమంది మళ్ళీ వండి పెడుతున్నారు. అయితే ఇంకా కొంతమంది భర్త ఎంత ఒత్తిడి చేసినా, భార్య ఎంత ఒత్తిడి చేసినా, వారు మాత్రం మాంసం జోలికి వెళ్ళడం లేదు. కావాలంటే నన్ను చంపేయి, కానీ నేను మాత్రం ఏ జీవిని చంపను. నువ్వు తినాలనుకుంటే బయటకు వెళ్ళి తిను, నేను నిన్ను అడ్డుకోను. కానీ నా చేత మాత్రం ఆ పాప కర్మ చేయించకు అని స్పష్టంగా చెప్పిన వాళ్ళు కూడా ఉన్నారు. ఇది కేవలం ఒక ఆహారపు అలవాటును మార్చుకోవడం కాదు. తాను తెలుసుకున్న జ్ఞానానికి, తాను నమ్మిన ధర్మానికి, తాను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండటం.

మీరు ఎవరి వయస్సు ఎంత అని లెక్కించాల్సిన అవసరం లేదు. ఎవరైనా సరే, ముందుగా వారి వయస్సును కాకుండా వారి జ్ఞానాన్ని పరిగణలోకి తీసుకోండి. వారు చెప్పేది సత్యమా కాదా అని చూడండి. వారు ఆచరించమని చెప్పేది ధర్మమా కాదా అని తెలుసుకోండి. ఆ సత్యాన్ని, ఆ ధర్మాన్ని మీ జీవితంలో ఆచరిస్తూ, సత్యంలో జీవిస్తూ ఉంటే మీ భవిష్యత్తు అద్భుతంగా మారుతుంది.

ప్రహ్లాదుడు ఎంత గొప్పవాడయ్యాడో మీరు గమనించండి. మూడు లోకాలను జయించిన హిరణ్యకశిపుడి పేరు ఎవరూ తమ పిల్లలకు పెట్టుకోరు. కానీ ప్రహ్లాదుడి పేరు ఎంతోమంది పెట్టుకుంటారు. ఎందుకు? ప్రహ్లాదుడి పేరు పెడితే ఆ బిడ్డ కూడా ప్రహ్లాదుడిలా సత్యాన్ని, జ్ఞానాన్ని, ధర్మాన్ని అనుసరించే

వ్యక్తిగా ఎదగాలని కోరుకుంటారు. అదే విధంగా రావణాసురుడి పేరు పెట్టుకోరు, రాముడి పేరు పెట్టుకుంటారు. ఎందుకంటే పేరు మాత్రమే కాదు, ఆ పేరుతో ఉన్న వ్యక్తి యొక్క గుణాలు, ఆచరణ కూడా వారిపై ప్రభావం చూపుతాయని భావిస్తారు.

ఒక వ్యక్తి వయస్సులో చిన్నవాడై ఉండవచ్చు, కానీ అతనికి బుద్ధి, జ్ఞానం ఉండవచ్చు. మరో వ్యక్తి వయస్సులో పెద్దవాడై ఉండవచ్చు, కానీ జ్ఞాన పరంగా ఇంకా ఎదగక పోవచ్చు. వయస్సు అనేది దేహానికి సంబంధించినది, ఆత్మకు వయస్సుతో ఎలాంటి సంబంధం లేదు. ఆత్మ యొక్క గొప్పతనాన్ని దాని వయస్సుతో కొలవలేరు.

ఇప్పుడు మీరు పత్రి గారి విషయాన్ని గమనించండి మనందరం కూడా పత్రి గారిని ఎంతో గౌరవించే వాళ్ళం, ఆయనను ఎంతో ఇష్టపడే వాళ్ళం. ఆయన చెప్పే ప్రతి మాటను శ్రద్ధగా విని, వ్రాసుకుని, దాన్ని మీ జీవితంలో ఆచరించడానికి ప్రయత్నించే వారు. ఎందుకు అంటే ఆయన బ్రహ్మజ్ఞాని, అపారమైన జ్ఞాన సంపన్నుడు, సృష్టి రహస్యాలను అర్థం చేసుకున్నవాడు. తన జీవితాన్ని మాత్రమే కాకుండా, ఇతరుల జీవితాలను కూడా లోతుగా అవగాహన చేసుకున్నవాడు.

అందుకే ఆయన చెప్పిన మాటలను నిజంగా అర్థం చేసుకుని, ఆయన ఇచ్చిన సాధనను శ్రద్ధగా ఆచరిస్తున్నవారు జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడగలుగుతున్నారు. నేను కూడా అనేక సందర్భాల్లో గమనించాను. ఒకప్పుడు ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచించినవారు కూడా ఇప్పుడు ఎంతో ధైర్యంగా, ప్రశాంతంగా జీవిస్తున్నారు. జీవితంలో తీవ్రమైన దుఃఖాన్ని అనుభవించినవారు, భార్యను కోల్పోయినవారు, భర్తను కోల్పోయినవారు, తల్లిదండ్రులను కోల్పోయినవారు, పిల్లలను కోల్పోయినవారు,

ఆ దుఃఖాన్ని తట్టుకోలేక కుంగిపోయినప్పటికీ, పత్రి గారి మాటలను విని, ఆ జ్ఞానాన్ని అర్థం చేసుకుని, సాధనను ఆచరించడం ద్వారా మళ్ళీ ధైర్యాన్ని పొందారు. ఇప్పుడు తమ జీవితంలో చేయవలసిన పనులను మరింత ధైర్యంగా చేస్తున్నారు.

ఎందుకంటే శంకరాచార్యులు చెప్పినట్టుగా, పత్రి గారు బోధించినట్టుగా, మీరు కేవలం కుటుంబ సభ్యుల కోసం ఈ భూమి మీదకు రాలేదు. మీ అసలు స్వరూపం ఆత్మ. మీరు ఆత్మజ్ఞానాన్ని పొందడానికి, ఆత్మ ఉన్నతిని సాధించడానికి ఈ మానవ జన్మను తీసుకున్నారు. అందుచేత మీరు ఆత్మజ్ఞానం వైపు దృష్టి పెట్టాలి, సాధనపై ఆసక్తిని పెంచుకోవాలి, సత్యాన్ని తెలుసుకోవాలి.

మీ జ్ఞానం పెరిగే కొద్దీ మీ దుఃఖం క్రమంగా తగ్గిపోతూ ఉంటుంది. ఇది నేను స్పష్టంగా చెబుతున్నాను. జ్ఞానం పెరగకపోతే, మీరు అజ్ఞానంలోనే ఉంటే, చిన్న విషయం జరిగినా పెద్ద దుఃఖంగా అనిపిస్తుంది. ఏ విషయాన్ని మీరు ఎక్కువగా పట్టించుకుంటే, ఆ విషయమే మీకు బాధను కలిగిస్తుంది. అసలు దాన్ని పట్టించుకోకపోతే, దాని గురించి మీరు బాధపడాల్సిన అవసరం ఎక్కడ ఉంటుంది?

ఉదాహరణకు, మీ భర్త ఏదో అన్నారు అనుకోండి ఆయనకు నచ్చినట్టుగా ఆయన అనుకుంటాడు, ఆయనకు తోచినట్టుగా ఆయన మాట్లాడతాడు. కానీ ఆయన అలా అనుకున్నంత మాత్రాన మీకు నష్టం ఏమిటి? ఆ మాటను మీరు పట్టించుకోకుండా వదిలేస్తే, దానికి మీరు సమాధానం ఇవ్వకుండా ఉంటే, అక్కడితో ఆ విషయం ముగిసిపోతుంది. కానీ మీరు ఆ మాటకు ఒక మాట సమాధానం ఇస్తే చివరకు అది పెద్ద గొడవగా మారుతుంది. ఆ గొడవ వల్ల ఇద్దరి మనస్సుల్లోనూ అశాంతి, కోపం,

బాధ పెరుగుతాయి, చివరికి ప్రశాంతతను కోల్పోయేది మీరే.

అందుచేత జ్ఞాన మార్గంలోకి వచ్చిన తర్వాత ఎవరు ఏమనుకున్నా, ఎవరు ఏమన్నా ప్రతి విషయాన్నీ పట్టించుకోవాల్సిన అవసరం లేదని చాలామంది అర్థం చేసుకున్నారు. ఇప్పుడు ఈ మార్గంలోకి వచ్చిన వాళ్ళలో చాలా మందిని ఎవరేమన్నా వెంటనే స్పందించడం లేదు, మన వాళ్ళలో చాలామందికి సమయం సరిపోవడం లేదు. నేను ఇప్పుడు చాలా ప్రాంతాల్లో తిరుగుతున్నాను. ఎక్కడికి వెళ్ళినా ఇదే మాట చెబుతున్నారు. ఇంతకుముందు అయితే మాకు చాలా సమయం ఉండేది, ఏం చేయాలో తెలియక ఖాళీగా ఉండే వాళ్ళం. ఇప్పుడు మాత్రం సమయం సరిపోవడం లేదు అని అంటున్నారు.

ప్రొద్దున్నే మూడు, నాలుగు గంటల పాటు ధ్యానం చేస్తారు. అంత సమయం ధ్యానానికి కేటాయించిన తర్వాత కొంత సమయం ఇంటి పనులకు, ఆ తర్వాత పుస్తకాలు చదువుతారు, పత్రి గారు చెప్పిన విషయాలను మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటారు, వ్రాసుకుంటారు, విన్న విషయాలను మననం చేసుకుంటారు. ఇంకా కొంత సమయం ఖాళీగా ఉంటే మళ్ళీ ధ్యానం చేస్తారు. కొంతమంది మధ్యాహ్నం జరిగే జూమ్ కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారు. తాము తెలుసుకున్న విషయాలను ఇతరులకు చెప్పడానికి, జూమ్‌లో క్లాస్ తీసుకోవడానికి కూడా ప్రయత్నిస్తున్నారు. అలాగే సాయంకాలం కూడా జూమ్ కార్యక్రమాలు ఉంటాయి. వాటిలో పాల్గొనడం, వినడం, నేర్చుకోవడం, ఇతరులతో పంచుకోవడం జరుగుతుంది. వీటితో పాటు ఇంటి పనులు మరి ఖాళీ సమయం ఎక్కడ ఉంటుంది?

ఈ మార్గంలోకి రాకముందు పరిస్థితి ఎలా ఉండేది? కాలక్షేపం కోసం అందరికీ ఫోన్ చేసి మాట్లాడేవారు, అవసరం లేని మాటలతో గంటల కొద్దీ సమయం గడిచిపోయేది. మాట్లాడటానికి పెద్దగా విషయం లేకపోయినా,

ఏదో ఒకటి మాట్లాడుకుంటూ సమయాన్ని గడిపేవారు. కానీ ఇప్పుడు ఖాళీ సమయం దొరికితే ఆ సమయాన్ని కూడా జ్ఞానం సంపాదించుకోవడం కోసం ఉపయోగిస్తున్నారు. సమయం అందరికీ ఒకటే కానీ ఆ సమయాన్ని మీరు ఎలా ఉపయోగించుకుంటారో అనేదే మీ జీవితాన్ని మార్చుతుంది.

ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. జీవితంలో ఎన్ని విషయాలు ఉన్నా, వాటన్నింటినీ ప్రక్కన పెట్టి, మర్చిపోయి, ప్రశాంతంగా ఉండగలుగుతున్నారు. పత్రి గారు పరిచయమైనప్పటి నుంచి ప్రతి ఒక్కరిలోనూ వచ్చిన గొప్ప మార్పు ఇదే. అంత ఎందుకండి, నా జీవితంలోనే ఎంతటి మార్పు వచ్చిందో నేను స్వయంగా అనుభవించాను! ఒకప్పుడు ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయలుదేరితే, రాత్రి పది, పదకొండు గంటల వరకు కూడా ఇంటికి చేరుకునే వాడిని కాదు. ఎన్నో వ్యాపారాలు ఉండేవి. వాటన్నింటినీ చూసుకుని, చక్కబెట్టుకుని రావడానికి అంత సమయం పట్టేది. కానీ ఇప్పుడు అసలు వ్యాపారమే లేదు. వ్యాపారం చేసి సంపాదించే సంపాదనను పూర్తిగా ఆపేశాను. దాంతో నాకు ఎంత సమయం కలిసి వచ్చిందో చూడండి! ఇప్పుడు నా దృష్టి పూర్తిగా జ్ఞానం మీదే ఉంది. ఒకప్పుడు ధనాన్ని సంపాదించడానికి సమయాన్ని ఉపయోగించాను, ఇప్పుడు జ్ఞానాన్ని సంపాదించడానికి, జ్ఞానాన్ని పంచడానికి నా సమయాన్ని ఉపయోగిస్తున్నాను. పత్రి గారు చెప్పిన ఒక మాట అక్షరసత్యం "జ్ఞానాన్ని పంచితే అది తగ్గదు, మరింత పెరుగుతుంది" అన్నారు. మేమిద్దరం ఎంత ఎక్కువగా జ్ఞానాన్ని పంచుతున్నామో, అంత ఎక్కువగా మేమే ఆ జ్ఞానంలో ఎదుగుతున్నాం.

మీరు భూమ్మీద ఉన్నంతకాలం, మీకు అవకాశం ఉన్నంత వరకు, మీరు చేయవలసిన పని చేస్తూ ఉండాలి. ప్రకృతి నిర్ణయించిన సమయం పూర్తయినప్పుడు మీరు ఈ దేహాన్ని విడిచిపెట్టి నిష్క్రమిస్తారు. దాని గురించి

ప్రత్యేకంగా భయపడాల్సిన అవసరం లేదు, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పత్రి గారు మనకు చెప్పిన మాటను గుర్తు పెట్టుకోండి "నీకు చావు లేదు" అని. మీరు చేయవలసిన పని పూర్తయితే, మీ దేహంలో ఇంక ఉండరు. పత్రి గారు నిష్క్రమించడానికి కూడా అదే కారణం. ఆయన చేయవలసిన పని పూర్తయింది, నిజానికి ఆయన చేయవలసిన దాని కంటే ఎంతో ఎక్కువ చేశారు. ఆయన తరచూ "మనం ఇంకా బోనస్ సంపాదించుకుంటున్నాం" అని అనే వారు. చివరకు ప్రకృతి నిర్ణయించిన సమయం వచ్చినప్పుడు ఆయన నిష్క్రమించారు.

అందుచేత ఒక విషయాన్ని మీరు గుర్తుపెట్టుకోండి. భూమ్మీద మీరు చేయవలసిన పని ఏదైనా మిగిలి ఉంటే, మీరు వెళ్ళిపోవాలని అనుకున్నా వెళ్ళిపోలేరు. మీ పని పూర్తయితే, మీరు ఇక్కడే ఉండాలని అనుకున్నా ఉండలేరు ఇది ప్రకృతి నియమం.

నేను నీళ్ళు అనుకొని యాసిడ్ నోట్లో పోసుకున్న సందర్భంలో కూడా ఇదే ఆలోచించాను". ఈ భూమ్మీద నా పని ఏదైనా మిగిలి ఉంటే నేను ఉంటాను. నా పని పూర్తయితే ఇప్పుడే వెళ్ళిపోతాను" అని. అందుచేత "ఇంత వయస్సు వచ్చింది కాబట్టి ఇక వెళ్ళిపోతాను అని ఎప్పుడూ అనుకోవద్దు. ఉండటానికి, నిష్క్రమించడానికి వయస్సుతో సంబంధం లేదు. అందుకే జ్ఞాని వయస్సును లెక్కించడు, జ్ఞానికి తెలుసు వయస్సు అనేది దేహానికి సంబంధించింది మాత్రమే అని, ఆత్మకు వయస్సుతో ఎలాంటి సంబంధం లేదు.

అందుచేత మీరు సాధన బాగా చేసుకోండి. మీరు ఎంత ఎదిగినా, ఎన్నేళ్ళు ఈ దేహంలో ఉన్నా, మీలో ఉత్సాహం పెరుగుతూనే ఉంటాయి. మీ వయస్సు పది, పదిహేను సంవత్సరాలు తగ్గిపోయినట్టుగా ఉంటుంది. ఆ

వయస్సులో ఉన్న వాళ్ళతో పోల్చుకుంటే, పది, పదిహేను సంవత్సరాలు చిన్న వారి ప్రవర్తన ఎలా ఉంటుందో, మీ ప్రవర్తన కూడా అలా ఉంటుంది. ఇక్కడ వయస్సుతో సంబంధం లేదు. ఆ శక్తి వల్ల మీ ఇంద్రియాలన్నీ బాగా పనిచేస్తాయి. మీ కళ్ళతో బాగా చూస్తారు, చెవులతో బాగా వినగలుగుతారు, మాట్లాడుతూ ఉంటారు, చదువుతూ ఉంటారు, గ్రహిస్తూ ఉంటారు,అన్ని రకాల నైపుణ్యాలు ఉంటాయి.

పదిహేను, ఇరవై సంవత్సరాల క్రితం ఎలాంటి పనులు చేసే వారో, ఆ పనులు కూడా చేస్తారు, వయస్సు మీకు సంబంధం లేదు. ఇదే విషయాన్ని పత్రి గారు చెప్పారు ఆత్మ జ్ఞానికి వయస్సుతో సంబంధం లేదు. ఎందుకంటే వయస్సు లెక్క దేహానికే కానీ ఆత్మకు కాదు. ఆత్మ కాలానికి అతీతమైనది. దీనిని మీరు ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. మీరు దేహం కాదు, మీరు ఆత్మ. ఆత్మకు పుట్టుక లేదు, చావు లేదు. “నేను పుట్టాను” అని అనుకున్నా అది అజ్ఞానమే అలాగే “నేను చనిపోతాను” అని అనుకున్నా అది అజ్ఞానమే.

కొంతమంది ఎవరినైనా చూసి, “నీ వయస్సు ఎంత? మీ వయస్సు ఎంత?” అని అడుగుతూ ఉంటారు. కానీ ఒకసారి ఆలోచించండి మీరు ఎదుటి వారిని కేవలం దేహంగా కాకుండా ఆత్మగా చూస్తే, ఆత్మకు వయస్సు ఎంత అని ఎలా అడుగుతారు? అతను ఆత్మ. ఆత్మకు వయస్సు ఎలా ఉంటుంది? దేహానికి వయస్సు ఉంటుంది, ఆత్మకు కాదు. మీరు ఎన్ని జన్మలు తీసుకున్నారో, ఎన్ని యుగాల నుంచి ఉన్నారో మీకు పూర్తిగా తెలుసా? తెలియదు. మరి “నా వయస్సు ఇంత” అని మీరు ఎలా చెప్పగలరు? పుట్టుక ఉంటేనే వయస్సు అనే లెక్క మొదలవుతుంది. ఆత్మకు పుట్టుక లేదని మీరు తెలుసుకున్నప్పుడు, ఆత్మ వయస్సును ఎలా లెక్కిస్తారు? అందుచేత మీ అసలు స్వరూపాన్ని గుర్తించండి. మీరు ఆత్మ, మీ అసలు స్వరూపానికి వయస్సు

లేదు. కాబట్టి జ్ఞానాన్ని ఎంతగా పెంచుకోవాలి, సాధన ఎంతగా చేసుకోవాలి అనే దానిపై దృష్టి పెట్టండి.

అందుచేత ఎవరినీ వారి వయస్సును బట్టి అంచనా వేయకండి. ఎవరి వయస్సు ఎంత అనేది దాని కంటే, వారి జ్ఞానం ఎంత, వారి ఆచరణ ఎలా ఉంది అనేదే ముఖ్యమైనది. జ్ఞానం పొందినవారికి తన అసలు స్వరూపం ఆత్మ అని తెలుసు. ఆత్మకు పుట్టుక లేదు, ఆత్మకు మరణం లేదు, ఆత్మకు వయస్సు లేదు. దేహానికి మాత్రమే వయస్సు ఉంటుంది. కాబట్టి మీరు దేహాన్ని జాగ్రత్తగా చూసుకుంటూనే, దేహమే నేను అనే భావనను దాటి, మీ అసలు స్వరూపమైన ఆత్మను తెలుసుకోవాలి.

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| **Telugu Books** | **English Books** | **Hindi Books** | **Kannada Books** | **Tamil Books** |

# ఆత్మ జ్ఞానికి సాహసం అనేది దిన చర్య అవుతుంది, సహజం అయిపోతుంది

పత్రి గారు ఏం చెప్పారంటే, “ఆత్మ జ్ఞానికి సాహసం అన్నది దినచర్య అవుతుంది సహజం అయిపోతుంది” అంటే, మానవ జన్మ తీసుకున్న వారిలో గొప్ప వాళ్ళు ఎవరు అంటే, సాహసాలు చేసే వారే. ఆ సాహసాలు చేసే వారిని చూసి ఇహ లోకంలో ఉన్నవారికే కాదు, పర లోకంలో ఉన్న వారికి కూడా వారి మీద ఎంతో గొప్ప భావం కలుగుతుంది. అటువంటి వారికి భవిష్యత్తులో ఇంకా గొప్ప జన్మలు లభిస్తాయి. అంతేకాదు, సాహసాలు చేసే వారు తమ జీవిత లక్ష్యాన్ని కూడా తొందరగా సాధించగలుగుతారు.

సహజంగా చాలామంది జీవితాలు ఎలా ఉంటాయి అంటే సంపాదించుకోవడం, పెళ్ళి చేసుకోవడం, పిల్లలను కనడం, కుటుంబాన్ని చూసుకోవడం, రోజూ అదే జీవితాన్ని కొనసాగించడం, చివరకు ఒక రోజు చనిపోవడం. కానీ అది సాహసోపేతమైన జీవితం కాదు, కేవలం తిండి, నిద్ర, సంసార సుఖాలు ఇవన్నీ సాహసాలు కావు. ఇవి ప్రతి జీవి సహజంగా చేసే పనులే.

అయితే ఎవరైతే కొన్ని మహత్తరమైన కార్యక్రమాలను చేపట్టి, వాటి కోసం తమ జీవితాన్ని అంకితం చేస్తారో, అలాంటి వారి జీవితమే నిజమైన సాహసోపేతమైన జీవితం. ఒక గొప్ప లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ లక్ష్యాన్ని సాధించడానికి ఎన్ని కష్టాలు వచ్చినా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగడం, సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం, ఇతరుల జీవితాల్లో మార్పు తీసుకురావడం ఇవన్నీ సాహసోపేతమైన జీవితానికి ఉదాహరణలు.

మీరు ఏ సినిమా చూసినా అందులో సాహసం లేకపోతే ఎక్కువ సేపు ఆసక్తిగా చూడలేరు. కథలో సాహసం ఉన్నప్పుడు, హీరో ఏదైనా గొప్ప

కార్యం కోసం పోరాడుతున్నప్పుడు, ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నప్పుడు, ఆ సాహసాన్ని చూసి అందరూ ఎంతో ఆసక్తిగా, ఆనందంగా చూస్తారు. ఎందుకంటే సాహసం మనిషిలోని గొప్పతనాన్ని బయటకు తీసుకువస్తుంది. అందుకే పత్రి గారు చెప్పినట్లుగా, ఆత్మ జ్ఞానికి సాహసం అనేది ప్రత్యేకంగా చేయాల్సిన పని కాదు, అది అతని జీవితంలో సహజమైన దినచర్యగా మారిపోతుంది.

మీరు మహాత్మా గాంధీని కానీ, మదర్ థెరిసాను కానీ చూసినప్పుడు మీ వళ్ళు గగుర్పాటు కలుగుతుంది? కారణం వారి జీవితాలు సాహసోపేత మైనవి. వారు తమ జీవితాలను కేవలం తమ కోసం కాకుండా, సమాజం కోసం, మానవాళి కోసం అంకితం చేశారు. అలాగే ఎడ్మండ్ హిల్లరీ ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించారు. ఆయనతో పాటు ఎంతోమంది ఎవరెస్ట్‌ను అధిరోహించారు. ఇంకా ఎంతోమంది వివిధ రంగాల్లో ఎన్నో సాహసాలు చేసి రికార్డులు సృష్టించారు. గిన్నిస్ బుక్ వంటి రికార్డు పుస్తకాలలో పేరు సంపాదించిన వారిని గమనిస్తే, వారంతా ఏదో ఒక సాహసోపేతమైన కార్యక్రమాన్ని చేసి తమ ప్రత్యేకతను చాటుకున్న వారే.

కానీ లోకంలో చాలామంది పెద్దలు, ముఖ్యంగా తల్లిదండ్రులు, తమ పిల్లలను ప్రోత్సహించాల్సింది పోయి నిరుత్సాహ పరుస్తూ ఉంటారు. పిల్లలు ఏదైనా పెద్ద పని చేయాలని అనుకుంటే, "అవన్నీ పెద్ద పెద్ద విషయాలు. నీ వల్ల కావు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు నీ పరిస్థితి అవుతుంది. ఇలా చేస్తే నీ పెళ్లాం, పిల్లలు ఎలా బతుకుతారు? నువ్వేమైనా గొప్పవాడివి అనుకుంటున్నావా?" అంటూ భయపెడతారు. ఒక పిల్లవాడు కొంచెం సాహసంగా ఏదైనా చేయాలని ప్రయత్నించినప్పుడు కూడా, తల్లిదండ్రులు అలా నిరుత్సాహపరుస్తుంటారు.

అందుకే "యథా రాజా తథా ప్రజా" అన్నట్లుగా, తల్లిదండ్రులు ఎలా ఉంటారో పిల్లలు కూడా చాలావరకు అలాగే తయారవుతారు. తల్లిదండ్రులు భయపడుతూ జీవిస్తే, పిల్లలు కూడా భయపడటం నేర్చుకుంటారు. కానీ భూమి మీద ప్రతి ఒక్కరూ సాహసం చేయడం కోసమే పుట్టారు. భయపడుతూ జీవించడం కోసం ఏ మానవుడూ పుట్టలేదు.

ప్రతి మానవుడు భూమి మీదకు రాకముందే ఒక ప్రణాళికను ఎంచుకుంటాడు. ఏదో ఒక ఉన్నతమైన, ఉదాత్తమైన కార్యక్రమాన్ని చేయాలి, దాన్ని సాధించాలి అనే ఉద్దేశంతోనే మానవ జన్మ తీసుకుంటాడు. తిని, పడుకుని, తన కోసం మాత్రమే జీవించడం కోసం ఏ మానవుడూ పుట్టలేదు. సమాజానికి మేలు చేయడం కోసం, తాను పొందిన దాని కంటే కొంచెం ఎక్కువగా సమాజానికి ఇవ్వడం కోసం ప్రతి మానవుడు పుట్టాడు, అదే నిజమైన సాహసం.

పత్రి గారు ఒకసారి చెప్పిన ఒక మాట నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆయన ఎక్కడికి వెళ్ళినా స్వయంగా వంట చేసేవారు, అందరికీ వడ్డించి పెట్టేవారు. ఆయన ఏమన్నారంటే, "మీరందరూ ఎంతో కష్ట పడుతున్నారు, లోక కల్యాణం కోసం ఎన్నో పనుల్లో పాల్గొంటున్నారు. మరి నేను ఏం చేస్తున్నాను? అందుకే ఈ వంట చేసి మీ అందరికీ పెడుతున్నాను" అని చెప్పేవారు.

నిజానికి పత్రి గారు మనకు ఎంతో జ్ఞానాన్ని ఇస్తున్నారు. మనకు తెలియని ఎన్నో విషయాలను తెలియజేస్తున్నారు, ఆనందంగా జీవించడానికి కావలసిన ఎన్నో విషయాలను బోధిస్తున్నారు. మనకు తెలియని విషయాలను తెలియజేస్తూ, మన జీవితాలను మార్చే జ్ఞానాన్ని అందిస్తున్నారు. అయినప్పటికీ, "నేను కూడా ఏదో ఒకటి చేయాలి, అందరికీ ఉపయోగపడాలి" అనే భావంతో

వంట చేసి అందరికీ పెట్టేవారు. అది నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. "అరే! ఆయన మనకు ఇంత చేస్తున్నప్పటికీ, ఇంకా ఏదో చేయాలి అనే తపనతో ఉన్నారే! ఆయనలో ఎంత గొప్ప ఆశయం ఉందో!" అని అనిపించింది.

అందుచేత మీరు ఒక విషయం వ్రాసుకోండి, ఇవ్వ గలగడమే సాహసం. అంతేకానీ మీ తల్లిదండ్రులు మిమ్మల్ని పుట్టించడం, మీరు ఇంకొకరిని పుట్టించడం మాత్రమే సాహసం కాదు. అది జీవిత సహజ ప్రక్రియ. కానీ మీకు లభించిన జీవితాన్ని ఇతరులకు ఉపయోగపడే విధంగా మార్చడం, మీరు పొందిన దాని కంటే ఎక్కువగా సమాజానికి ఇవ్వడం, ఇతరుల జీవితాల్లో వెలుగును నింపడం అదే నిజమైన సాహసం.

ఆత్మ యొక్క కోరిక సదా సాహసం చేయడమే, సాహసంలో జీవించడమే నిజమైన జీవితం. సాహసం లేకుండా జీవించే జీవితం నిజమైన జీవితం కాదు. సహజంగా ఎవరైతే "నేను దేహాన్ని కాదు, ఆత్మను" అని తెలుసుకుంటారో, వారు సాహసం చేయడానికి ప్రయత్నిస్తారు, వారు సాహసోపేతులుగా మారుతారు. సాహసాలు చేసేవారు, అవసరమైతే తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా గొప్ప కార్యాల కోసం ముందుకు వెళ్ళేవారు నిజంగా గొప్ప వారు.

ఇటువంటి సాహసోపేతమైన పనులు చేసే ఆత్మలకు భవిష్యత్తులో మరింత అద్భుతమైన జన్మలు లభిస్తాయి, ఉన్నతమైన జన్మలు వస్తాయి. ఏమీ చేయకుండా, కేవలం తన కోసం మాత్రమే జీవించినవారికి సాధారణమైన జీవితాలే ఉంటాయి. ఇప్పుడు మనం చూస్తున్నాం కదా, గొప్ప గొప్ప వ్యక్తులు ఎంతోమంది ఉన్నారు. రాజకీయ రంగంలో రేవంత్ రెడ్డి లాంటి వారు, చంద్రబాబు లాంటి వారు, ఇంకా ఎంతోమంది ఉన్నారు. వారు ఆ స్థాయిని ఎందుకు సంపాదించుకున్నారు? వారి గత కర్మలతో పాటు, గత జన్మల్లో

వారు చేసిన సాహసోపేతమైన కార్యాల ఫలితంగానే వారికి అటువంటి గొప్ప స్థానాలు లభించాయని పత్రి గారి బోధనను బట్టి అర్థం చేసుకోవాలి. ఏ రంగంలో చూసినా గొప్ప స్థాయిలో ఉన్నవారిని గమనించండి. వారంతా ఏదో ఒక విధంగా సాహసాలు చేసిన వారే, అటువంటి ఆత్మలను వృద్ధాత్మలు అని అంటారు.

అందుచేత ఆత్మవంతమైన జీవితానికి సాహసం సాధారణమైపోతుంది. ఆత్మ జ్ఞానికి సాహసం ప్రత్యేకంగా చేయాల్సిన పని కాదు; అది అతని సహజ స్వభావంగా, దినచర్యగా మారిపోతుంది. అందుచేత చిన్న పిల్లలకు చిన్ననాటి నుంచే సాహసం నేర్పించాలి, వారిని ప్రోత్సహించాలి. మీరు అడగవచ్చు "ఏం చేయాలి?" అని. చిన్న పిల్లలు చీకట్లోకి వెళ్ళాల్సి వచ్చినప్పుడు, వారిని ధైర్యంగా వెళ్ళనివ్వాలి. కానీ "చీకట్లో దెయ్యాలు ఉంటాయి, వెళ్ళవద్దు" అని భయపెడితే, ఆ భయం వారి జీవితాంతం కొనసాగుతుంది.

నేను చాలామంది తల్లులను గమనిస్తున్నాను. పిల్లలు తమ మాట వినడం లేదని, వారిని కంట్రోల్ చేయడానికి ఇంకే దారి లేక, పిల్లలను భయపెడుతూ ఉంటారు. "అలా చేస్తే దెయ్యం వస్తుంది", "ఇలా చేస్తే భూతం పట్టుకుంటుంది" అని చెబుతారు. పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికి భయాన్ని ఉపయోగించడం సరైన పద్ధతి కాదు. అలా చేయడం వల్ల పిల్లల్లో ధైర్యం పెరగదు; భయం పెరుగుతుంది.

చాలామంది తల్లిదండ్రులు పిల్లలను ధైర్యంగా పెంచాల్సింది పోయి చిన్నప్పటి నుంచే భయపెడుతూ ఉంటారు. "ఇక్కడ కూర్చోకు, బూచోడు వస్తాడు", "అక్కడికి వెళ్ళకు, దెయ్యం ఉంది", "దొంగ వస్తాడు, చూడు" అంటూ పిల్లలను భయపెడతారు. ఇలా భయపెట్టడం వల్ల పిల్లలను ఎందుకు పనికిరాని వారిగా తయారు చేస్తారు? తల్లిదండ్రులే పిల్లలను

ప్రోత్సహించాల్సింది పోయి నిరుత్సాహ పరుస్తారు. పిల్లలకు సాహసం ఎలా అలవాటు చేయాలి అంటే, భయపడే విషయాలను ధైర్యంగా ఎదుర్కొనేలా చేయాలి. ఉదాహరణకు చీకటంటే భయపడితే, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ చీకట్లో కూడా ధైర్యంగా ఉండటం నేర్పించాలి. స్మశానం అంటే భయపడేవారిని కూడా ఒకసారి స్మశానానికి తీసుకెళ్ళి, అక్కడ అసలు భయపడాల్సిన అవసరం లేదని తెలియచేయాలి. "నీకు భయం ఎందుకు? ఆ భయం నీకు ఎవరు నేర్పారు?" అని ఆలోచింపజేయాలి. ఆ భయాన్ని నేర్పింది ఎవరు? చాలాసార్లు తల్లిదండ్రులే నేర్పుతారు.

అలా భయం కూడా ఒక రకమైన వారసత్వ సంపదగా తర తరాలకు వస్తూ ఉంటుంది. స్మశానంలో రాత్రంతా ఉండే కాటి కాపరి కూడా ఉంటాడు. అతను ఒక్కడే ఉంటాడు. మరి ప్రతిరోజూ దెయ్యాలు వచ్చి అతన్ని ఏమైనా చేస్తున్నాయా? లేవు. కాబట్టి పిల్లలకు అనవసరమైన భయాలను నేర్పకుండా, నిజాన్ని అర్థం చేసుకునేలా చేయాలి.

అయితే సాహసం నేర్పించేటప్పుడు జాగ్రత్తలు మాత్రం తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయడం సాహసం కాదు. జాగ్రత్తగా ఉండి భయాన్ని జయించడం సాహసం. స్మశానం అంటే మీకు ఎందుకు భయం వస్తుంది? మీరు ఎప్పుడైనా స్మశానానికి వెళ్ళారా? సాధారణంగా ఎవరో చనిపోయినప్పుడు మాత్రమే అక్కడికి వెళ్తారు. అందుకే ఆ ప్రదేశం గురించి మీలో భయం ఏర్పడి ఉంటుంది. ఆ భయాన్ని తొలగించుకోవాలి. అలాగే నీటికి భయపడేవారికి కూడా తగిన జాగ్రత్తలతో నీటిలోకి వెళ్ళడం, ఈత నేర్చుకోవడం వంటి వాటిని పరిచయం చేయాలి. జాగ్రత్తలు తీసుకుంటూనే సాహసం నేర్పించాలి.

సాహసంలో కూడా చాలా రకాలున్నాయి. చదువులో సాహసం

ఉండవచ్చు, ఆటల్లో సాహసం ఉండవచ్చు, పాటల్లో సాహసం ఉండవచ్చు. ఏదైనా రంగంలో కొత్తగా ఏదైనా కనిపెట్టడం కూడా సాహసమే. ఇంతకుముందు ఎవ్వరూ చేయని పనిని మీరు కొత్తగా చేయడం సాహసం, ప్రక్కవాడు చేయనిది మీరు చేయడం సాహసం. "ఇతరులు ఏమనుకుంటారు? ఏమంటారు?" అని ఆలోచిస్తూ వెనుకడుగు వేయకుండా, మీకు సరైనదిగా అనిపించిన పనిని ధైర్యంగా చేయడం కూడా సాహసమే.

ప్రాణాలకు తెగించి చేసే పనులు మాత్రమే సాహసం కాదు. మీ ఆత్మకు తోచింది, మీ హృదయం చెప్పింది, సమాజానికి మేలు చేసే పని అయితే దాన్ని నిర్భయంగా చేయడం కూడా సాహసమే. పత్రి గారు మనకు చాలా రకాల సాహసాలను చెప్పారు. చిన్న చిన్న విషయాలను కూడా సాహసంగా చెప్పారు. ఉదాహరణకు వంట నేర్చుకోవడం కూడా ఒక సాహసమే. "మగవాళ్ళు వంట చేయకూడదు" అనే పాత ఆలోచనను వదిలి, మగవాళ్ళు కూడా వంట నేర్చుకోవాలి. ఇంతకుముందు చేయలేనిది ఇప్పుడు చేయడం సాహసం. ఆడ వాళ్ళకు కూడా కొత్త పనులు నేర్చుకోవడం సాహసమే. ప్రక్క వారికి సహాయం చేయడం సాహసం, వృద్ధాప్యంలో కూడా తన పనులను తాను చేసుకోవడం సాహసం.

సహజంగా ఒకరి సాహసం చూసి మరొకరు కూడా సాహసం చేస్తారు. కానీ ఎవరో చూస్తారని, ఎవరో మెచ్చుకుంటారని సాహసం చేయడం కాదు. సాహసం అనేది వ్యక్తిగతమైనది. అది ఒక వ్యక్తిలో ఉన్న అంతర్గత కాంక్ష. జ్ఞానం ఎలా వస్తుంది? అజ్ఞానం తొలగిపోయినప్పుడు జ్ఞానం వెలుగులోకి వస్తుంది. అలాగే సాహసం ఎలా వస్తుంది? భయం తొలగిపోయినప్పుడు సాహసం బయటకు వస్తుంది.

మీరు ఎంత సాహసవంతులో ఒక చిన్న విషయం ద్వారా కూడా

తెలుసుకోవచ్చు. ఉదాహరణకు జూమ్ క్లాస్‌లో కూడా వీడియో ఆన్ చేయడానికి చాలామంది భయపడతారు. "నేను మాట్లాడితే ఎవరు ఏమనుకుంటారు?", "ఏదైనా తప్పు మాట్లాడితే సార్ తిడతారేమో" అని భయపడతారు. అలాంటి ఆలోచనతో మాట్లాడితే, వాళ్ళలో ఉన్న భయమే వాళ్ళ మాటల్లో కనిపిస్తుంది. మీరు ముందుగానే "నన్ను ఎవరైనా తప్పుపడతారు" అని అనుకుంటే, ఆ భయంతోనే మాట్లాడతారు. అందుకే "యద్భావం తద్భవతి" మీరు ఏ భావంతో ఉంటారో, అదే అనుభవంగా మారుతుంది.

అసలు సాహసం లేకుండా మనిషి ఎప్పుడు ఎదుగుతాడు? మీరు ఆలోచించాలి. సాహసం చేసినవారికి పై లోకాలలో కూడా గొప్ప విలువ ఉంటుంది. అక్కడ "ఈ ఆత్మ భూమి మీదకు వెళ్ళి ఏమి చేసింది?" అని చూస్తారు. ఏమీ చేయకుండా, కేవలం తన కోసమే జీవించినవాడిని చూసి ఏమంటారు? "వాళ్ళకు తల్లిదండ్రులు ఉన్నారు, వాళ్ళను చూసుకోవడమే సరిపోయింది" అని చెబితే అది ఎంతవరకు గొప్ప జీవితం?

మీకు సమాజం కోసం కూడా ఏదో ఒకటి చేయాలనే సాహసం ఉండాలి. కొంతమంది పిల్లలు మూడు రోజుల పాటు క్లాస్‌కు రావడానికి కూడా సాహసం చేయరు. వాళ్ళను చూసుకోవాలి, ఏదో ఒక కారణం, ఏదో ఒక వంక చెబుతారు. కొంత మందికి అన్ని సౌకర్యాలు ఉన్నా "సెలవు దొరకడం లేదు" అంటారు. ఇంకొంత మంది "సెలవులు అయిపోయాయి" అంటారు. నేను చెప్తాను మీరు ఇంత గొప్ప కార్యం చేస్తున్నప్పుడు అవసరమైతే లీవ్ పెట్టుకుని అయినా రావాలి. మీరు చేస్తున్న పని ఎంత గొప్పదో మీకు అర్థం కావాలి.

నేను ఎప్పటికప్పుడు చెబుతూ ఉంటాను ధ్యానంలోకి రాకుండా, ధ్యానం చేయకుండా మీరు నిజమైన సాహస వంతులు కాలేరు. పై లోకాలలో

ఉన్న మాస్టర్లు కూడా మనిషికి సాహసం చేయమనే చెబుతారు. ఏది ఏమైనా మనిషికి కావలసింది సాహసం. పత్రి గారు ఏం చెప్పారంటే, "ధ్యానం చేయడం అన్నింటికంటే గొప్ప సాహసం." మీరు ఏమనుకుంటారు? "మేము ధ్యానం చేస్తున్నాం కదండి" అని అనుకోవచ్చు. కానీ మీ మనసును శూన్యం చేసుకోవడం ఎంత గొప్ప సాహసమో ఆలోచించండి. ప్రపంచాన్ని జయించినవాడికంటే మనసును జయించినవాడు గొప్పవాడు. దాన్ని బట్టి ధ్యానం చేసి మనసును శూన్యం చేయడం ఎంత గొప్ప విషయమో అర్థం చేసుకోవాలి.

పత్రి గారు ధ్యానాన్ని ఎంతో గొప్పగా చెప్పారు. మనసును అదుపు చేయడం, మనసును శాంతింపజేయడం, చివరకు మనసును శూన్యం చేయడం చాలా గొప్ప సాహసం. గంటల తరబడి ధ్యానంలో కూర్చోగలగడం, మనసు ఎటు వెళ్ళినా మళ్లీ శ్వాస మీదకు తీసుకురాగలగడం ఇదే నిజమైన సాహసం.

ఒక మనిషిని కత్తితో పొడవడం సాహసం కాదు. ఎవరి మీదైనా కోపంతో దాడి చేయడం సాహసం కాదు. గంటల తరబడి ధ్యానంలో కూర్చుని, తన మనసును అదుపులో పెట్టుకోవడం గొప్ప సాహసం. ఎందుకంటే బయట ఉన్న ప్రపంచాన్ని జయించడం కంటే, మీలో ఉన్న మనసును జయించడం చాలా కష్టం. సాహసానికి జయాపజయాలతో సంబంధం లేదు. మీరు ప్రయత్నించారా? లేదా? అన్నదే ముఖ్యం. మీరు "నేను ఆత్మను" అని తెలుసుకున్నప్పుడు సాహసం సహజమవుతుంది. నాకు చావు లేదు, శరీరం మాత్రమే తాత్కాలికం, ఆత్మ శాశ్వతం అని తెలుసుకున్నప్పుడు భయం తగ్గిపోతుంది. భయం తగ్గినప్పుడు సాహసం సహజంగా మారిపోతుంది.

శరీరం తాత్కాలికం, ఆత్మ శాశ్వతం అని నిజంగా తెలుసుకున్నప్పుడు సాహసం ఒక మామూలు కార్యక్రమంగా మారిపోతుంది. అందుచేత ఆత్మ జ్ఞాని యొక్క ముఖ్యమైన లక్షణాలలో సాహసం ఒకటి. ఇన్ని రకాలుగా మీ

ప్రవర్తనను ఒకసారి ఆలోచించండి. ఇవన్నీ మీ ఆచరణలోకి వచ్చినప్పుడే మీరు నిజంగా ఆత్మజ్ఞాన మార్గంలో ముందుకు వెళ్తారు. ఏదో ఒక క్లాస్ విన్నంత మాత్రాన జ్ఞానులు అయిపోయినట్టు కాదు. ఒకసారి క్లాస్‌కు వచ్చినంత మాత్రాన జ్ఞానం వచ్చినట్టు కాదు. జ్ఞానం మీ ప్రవర్తనలో కనిపించాలి, సాహసం మీ జీవితంలో కనిపించాలి, భయం తగ్గాలి, ధైర్యం పెరగాలి, ఇతరులకు ఉపయోగపడే జీవితం మీరు జీవించాలి.

పత్రి గారు మీకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీ జీవితాలను సాహసోపేతమైన జీవితాలుగా మార్చుకోవాలి. మీరు పొందిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలి. మీ జీవితాన్ని మీకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడేలా జీవించాలి. అదే నిజమైన ఆత్మజ్ఞానం, అదే నిజమైన సాహసం.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : **సింధూర, సెల్: 8555995217**

# ఆత్మ జ్ఞాని ప్రతీ సంఘటన వెనకాల కారణం ఉంటుందని తెలుసుకుంటాడు

ఆత్మ జ్ఞాని ప్రతి సంఘటన వెనకాల కారణం ఉంటుందని తెలుసుకుంటాడు అంటే, కార్య కారణ సంబంధం గురించి అవగాహన కలిగి ఉంటాడు అని అర్థం. ఈ కార్య కారణ సిద్ధాంతాన్నే కాజ్ అండ్ ఎఫెక్ట్ అంటారు. అంటే జరిగే ప్రతి దానికి ఒక కారణం ఉంటుంది. మీ జీవితంలో జరిగినవన్నీ, మీ వాళ్ళ జీవితాల్లో జరిగినవన్నీ, ప్రకృతిలో జరిగే ప్రతి సంఘటనను గమనించండి. ఎక్కడ ఏది జరిగినా, ప్రతి దానికి ఒక కారణం ఉంటుంది, అంటే ప్రతి కార్యానికి ఒక కారణం ఉంటుంది.

ఈ కార్యాకారణ సంబంధాన్ని ఎందుకు తెలుసుకోవాలి అంటే, మీ జీవితంలో ఒక సమస్య వచ్చినా, ఒక కష్టం వచ్చినా, ఒక నష్టం వచ్చినా, ఏది జరిగినా దానికి ఒక కారణం ఉంటుంది. కారణం లేకుండా ఏ కార్యం జరగదు. ఏదైనా ఒక రోగం రావచ్చు, ఒక యాక్సిడెంట్ కావచ్చు, ఆర్థికంగా మీరు నష్టపోవచ్చు, అనుకోకుండా లాభాలు కూడా రావచ్చు, ప్రతి దానికి ఒక కారణం ఉంటుంది. ఏది జరిగినా బాధపడే ముందు దాని ప్రారంభ కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. కారణం తెలుసుకుంటే ఆ కష్టం అంత పెద్దదిగా అనిపించదు. ఇప్పుడు రోగం వచ్చి చాలా బాధ కలిగింది అనుకోండి. ఆ బాధను భరించ లేకపోతే, "ఏమిటి ఇలా అయిపోయింది?" అని అనుకుంటారు. కానీ మీరు దానికి కారణం తెలుసుకోవాలి. అంటే గతంలో కానీ, గత జన్మలో కానీ మీరు జీవహింస చేసి ఉండవచ్చు, జీవహింసకు కారణమైన మాంస భక్షణ చేసి ఉండవచ్చు, ఆ ప్రాణికి ఎంతో బాధ కలిగించి ఉండవచ్చు. ఆ కారణంగా ఇప్పుడు ఆ రోగంతో బాధపడవలసి వస్తుందని అర్థం చేసుకోవాలి.

ఇది తెలుసుకోకపోతే, "ఎందుకు జరిగింది? ఎందుకు జరిగింది?" అని కంగారుపడతారు. కానీ ఇది తెలుసుకున్నప్పుడు, ఓహో! నేను ఇంతకుముందు వాటిని బాధపెట్టాను, ఆ ఫలితంగా ఇప్పుడు అనుభవిస్తున్నాను అని తెలుసుకున్నప్పుడు అంతగా బాధపడరు. అప్పుడు ఏం చేస్తారంటే, ఆ కర్మ తీరే దాకా ఎదురు చూస్తారు. చేసిన కర్మను అనుభవించాలి కదా అని అర్థం చేసుకుంటారు. దానితో పాటు ఆ బాధను భరించాలి కాబట్టి ధ్యాన సాధన చేసి శక్తిని సంపాదించుకుంటారు. మీలో శక్తి పెరిగినప్పుడు ఆ బాధను భరిస్తారు, తేలికగా అనుభవిస్తారు.

అంతే కాదు, మీలో పశ్చాత్తాపం కలుగుతుంది, పరివర్తన వస్తుంది, అప్పుడు ఒక నిర్ణయం తీసుకుంటారు. "ఇంత బాధ కలిగించే ఈ కర్మను అనుభవించే బదులు, ఆ కర్మ చేయకుండా ఉంటే గొడవ లేదు కదా?" అని ఆలోచిస్తారు. "అటువంటి హింసను నేను చేయను" అని నిర్ణయించుకుంటారు. ఎప్పుడైతే గట్టిగా నిర్ణయించుకుంటారో, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా మాంసం తీసుకోరు, జీవహింస చేయరు. ఎందుచేతనంటే, చేసిన తప్పును అర్థం చేసుకున్నారు.

ఎప్పుడైతే ఇది అర్థమైందో, ఎలాంటి ప్రలోభాలు ఉన్నా హింస చేయరు, మాంసం తినరు. భర్త ప్రలోభపెట్టినా, బలవంతం చేసినా, బెదిరించినా కూడా తినరు. నేను చాలా చోట్ల చూశాను, కొంతమంది "కొడతారు", కొంతమంది "నిన్ను వదిలేస్తాను" అని అంటారు. చాలా బెదిరింపులు కూడా ఉంటాయి. కానీ అటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఉండాలి, ఫంక్షన్లకు, పార్టీలకు వెళ్లినప్పుడు మాంసాహారం కనిపించగానే కొంత మందికి తినాలనే కోరిక కలుగుతుంది. వాళ్ళు కూడా, "ఈ ఒక్కసారికి తింటే ఏమైపోతుంది? ఒక్క సారే కదా?" అని చెబుతూ ఉంటారు. భార్యలు కూడా బలవంతం చేసే సందర్భాలు ఉంటాయి. ఆడ వాళ్ళకు ఉన్న ఇబ్బందులు మగవాళ్ళకు కూడా

ఉంటాయి. కొంచెం మగవాళ్ళకు తక్కువగా ఉండవచ్చు. భార్య లేకుండా కూడా మీరు అన్నట్టు అలాంటి వాళ్ళు కూడా ఉన్నారు.

అసలు గమనించండి, ఈ ధ్యాన క్లాసులకు వచ్చే పురుషులు తక్కువగా ఉంటారు, స్త్రీలు ఎక్కువగా ఉంటారు. అందుచేత వాళ్ళు వస్తారు కాబట్టి వాళ్ళకు ఎక్కువ అవగాహన ఉంటుంది. ఇవన్నీ వింటారు కదా, దాని మీద అవగాహన ఉంటుంది, వాళ్ళలో మార్పు వస్తుంది. కానీ భర్తలలో రాదు, చెప్పింది వినరు కాబట్టి వాళ్ళలో మార్పు రాదు. అలాగే భర్తలు వచ్చి, భార్య రాని సంసారాలు కూడా ఉన్నాయి. ఇక్కడ భర్త అర్థం చేసుకుని, "చెప్పిన ఆవిడ మాట విందాం" అని అనుకునే సందర్భాలు కూడా ఉంటాయి. ఇలాంటి సమస్యలు ఉంటాయి.

ఏది ఏమైనా నేను చెప్పేది ఏమిటంటే, ఎన్ని ప్రలోభాలు ఉన్నా, ఎన్ని ఒత్తిళ్ళు ఉన్నా, ఎటువంటి పరిస్థితి వచ్చినా "నేను అటువంటి పనికి పాల్పడను" అని నిర్ణయించుకున్నప్పుడు, ఆ విధంగా జీవించినప్పుడు, అలాంటి కర్మలు ఎన్ని ఉన్నా అవన్నీ రద్దయిపోతాయి.

అందుకే పత్రి గారు మనకు ఏమని చెప్తారంటే, **"గతం అవగతం అయితే విగతం అవుతుంది"** అంటారు. అంటే గతంలో చేసిన తప్పులను అర్థం చేసుకున్నప్పుడు, వాటిని మళ్ళీ చేయకుండా జీవించినప్పుడు, ఆ తప్పుల ప్రభావం నుంచి బయటపడే మార్గం ఏర్పడుతుంది. గతంలో జంతువులను, జీవులను బాధించడం తప్పు అని అర్థం చేసుకుని, ఇక ఆరు నూరైనా, నూరు ఆరు అయినా అటువంటి హింసను ఆచరించకుండా జీవించిన వారికి అలాంటి కర్మలు తొలగిపోతాయి.

ఇప్పుడు శ్రీకృష్ణుడు చెప్పిన "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అన్న దాని అర్థం కూడా ఇదే. అటువంటి జ్ఞానం పొందినవాడు ఎన్ని ఒత్తిళ్ళు వచ్చినా ధర్మాన్ని ఆచరిస్తాడు. ఆ జ్ఞానం అతనికి అంత బలంగా వస్తుంది కాబట్టి గత

కర్మలన్నీ క్రమంగా క్షీణిస్తాయి. ఇప్పుడు మిమ్మల్ని ఎవరినైనా హత్య చేయమంటే చేస్తారా? కోటి రూపాయలు ఇచ్చినా, యాభై కోట్లు ఇచ్చినా, వంద కోట్లు ఇచ్చినా ఆ పని చేయరు. ఎందుచేత? మీరు, "మేము అలాంటి పని చేయము" అని గట్టిగా నిర్ణయించుకుని వున్నారు. గత జన్మల్లో ఎప్పుడో ఎవరినైనా చంపి ఉండవచ్చు. దాని ఫలితాన్ని అనుభవించి, ఇక ఎప్పుడూ అలా చేయకూడదని నిర్ణయించుకుని వున్నారు, అందుకే ఇప్పుడు ఆ పనులు చేయను అంటారు.

అలాగే ఈ జన్మలో కూడా మరికొన్ని తప్పులు చేయనని నిర్ణయించుకుంటారు. అలా ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క తప్పును సరిచేసుకుంటూ చివరకు ఏ తప్పూ చేయని స్థితికి చేరుకుంటారు. దాన్ని మోక్షం అని కూడా అంటారు.

మీరు చేసే చిన్న, పెద్ద తప్పులన్నింటినీ సరి చేసుకునేసరికి ఇన్ని జన్మలు పడుతుంది. ఈ జ్ఞాన మార్గంలోకి రావడం వల్ల, సద్గురువు లభించడం వల్ల ఎన్నో తప్పులు తెలుస్తాయి, ఎన్నో తప్పులను సరిచేసుకుంటారు. అంటే సద్గురువు లభించిన వారికి మోక్షం అన్నది అతి దగ్గరలో ఉన్నట్టే. ఎందుచేతనంటే, సహజంగా ఎవరైనా అనుభవం ద్వారా తప్పు తెలుసుకుని సరిచేసుకుంటారు. కానీ సద్గురువు ద్వారా విని కూడా కొన్ని తప్పులను ముందుగానే సరిచేసుకోగలరు.

ఎందుచేతనంటే, సద్గురువును ఆశ్రయించినప్పుడు వారు మీ తప్పులను సరిచేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి కొంచెం కఠినంగా కూడా వ్యవహరిస్తారు. అందుకే నేను చెప్తూ ఉంటాను, మీరంతా కూడా చివరి జన్మలోకి వచ్చిన వారు అని.

ప్రకృతిలో తుఫాన్లు, సునామీలు, భూకంపాలు, యుద్ధాలు ఇలా ఎన్నో వస్తుంటాయి. "ఇవన్నీ ప్రకృతిలో జరుగుతున్నాయి" అనుకుంటూ ఉంటారు. కానీ ప్రకృతిలో ఏది జరిగినా దానికి కూడా ఒక కారణం వుంటుంది.

ఆ కారణాన్ని తెలుసుకుంటే ప్రకృతి నిర్ణయం సరైనదే అని మీకు అర్థమవుతుంది. ఇంకా మీ నోట మాటలు రావు.

ఎక్కడ జీవహింస ఎక్కువగా జరుగుతూ ఉంటుందో, స్త్రీల మీద, బలహీనుల మీద, అల్పులుల మీద అత్యాచారాలు, అకృత్యాలు, హింస జరుగుతూ ఉంటాయో, అక్కడే ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఎందుచేతనంటే ప్రతి జీవి, ప్రతి ప్రాణి ప్రకృతిలో భాగమే. గుర్తుపెట్టుకోండి. వేరుగా అనిపించవచ్చు. జంతువులు వేరు, పక్షులు వేరు అని అనిపించవచ్చు. కానీ అన్నీ ప్రకృతిలో భాగమే. వీటన్నిటికీ ప్రకృతి తల్లి లాంటిది.

మీ బిడ్డల మీద ఎవరైనా అకృత్యాలు చేస్తే మీరు ఊరుకుంటారా? వారిని శిక్షిస్తారు. మీ బిడ్డలు బతికి రావడానికి కూడా మీరు పోరాడతారు. ఆఖరికి మీకు మగపిల్లలు, ఆడపిల్లలు ఉన్నప్పుడు సాధారణంగా మగపిల్లలు శారీరకంగా దృఢంగా ఉంటారు. ఆడపిల్లలను ఏడిపిస్తూ ఉంటే, అటువంటప్పుడు ఆ తల్లి దండిస్తుంది. అలాగే ప్రకృతి కూడా దండిస్తుంది. ఈ వైబ్రేషన్‌ను అర్థం చేసుకోవాలి. అందుకే పత్రి గారు ఏమంటారంటే, "జీవహింస చేయొద్దు, మాంస భక్షణ మానండి" అంటారు. ప్రపంచమంతా ఈ విధంగా జీవించడం ప్రారంభించిన రోజున ప్రకృతి ఎంతో శాంతంగా ఉంటుంది. సకాలంలో వర్షాలు ఉంటాయి, అనుకూలమైన వాతావరణం ఉంటుంది, పంటలు పుష్కలంగా పండుతాయి, ఎవరికీ లోటు ఉండదు.

అందుచేత కారణం లేకుండా ఏదీ జరగదు. ఏది జరిగినా దానికి ఒక కారణం ఉంటుంది. కారణం తెలుసుకుంటే ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్నో మార్పులు వస్తాయి. ఇది అద్భుతమైన సందేశం. ప్రతిదీ అవగాహన చేసుకోవాలి. పత్రి గారు మనకు ఇచ్చిన జ్ఞానం సామాన్యమైనది కాదు; ఎంతో అర్థంతో కూడుకున్నది. ఏం జరిగినా ఏడుస్తూ కూర్చోవడం కాదు, కారణం తెలుసుకోవాలి, అర్థం చేసుకోవాలి, మీ జీవితాన్ని సరిదిద్దుకోవాలి.

# ఆత్మ జ్ఞాని చనిపోయిన వారి గురించి ఆలోచించడు, చింతించడు

"ఆత్మజ్ఞాని చనిపోయిన వారి గురించి ఆలోచించడు, చింతించడు".

కొంతమంది పరిస్థితి ఎలా ఉంటుందంటే, తమకు ఎంతో దగ్గరైన వ్యక్తి చనిపోయిన తర్వాత కూడా, వారితో ఉన్న మమకారాన్ని వదులుకోలేక, ఆ వ్యక్తితో ఉన్న అనుబంధాన్ని మర్చిపోలేక, సంవత్సరాల తరబడి వారి గురించే ఆలోచిస్తూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ ఉంటారు. గతంలో జరిగిన సంఘటనల దగ్గరే ఆగిపోయి, వర్తమానంలో తాము చేయవలసిన పనులను కూడా మర్చిపోతారు.

కానీ ఇక్కడ ఒక విషయం మీరు ఆలోచించాలి మీరు ఎంతగా వారి గురించి ఆలోచిస్తున్నారో, వారు కూడా మీ గురించి ఆలోచిస్తున్నారా? అని. అలా చనిపోయిన వారిలో కొంతమంది మరొక జన్మలోకి ప్రవేశించి ఉండవచ్చు. కొత్త శరీరాన్ని తీసుకుని, కొత్త జీవితాన్ని ప్రారంభించి ఉండవచ్చు. గత జన్మలోని సంబంధాలను పూర్తిగా మర్చిపోయి, కొత్త జీవితంలో కొత్త అనుభవాలను పొందుతూ ఉండవచ్చు. కానీ ఇక్కడ ఉన్న మీరు మాత్రం గత జీవితంలోని సంబంధాన్ని పట్టుకుని, రోజూ బాధపడుతూ, ఏడుస్తూ, ఆలోచిస్తూ, మీ ప్రస్తుత జీవితాన్ని నాశనం చేసుకుంటూ ఉంటారు. ఇది ఎంత విచిత్రమైన పరిస్థితి!

అందుకే పత్రి గారు ఏమన్నారంటే, ఆత్మజ్ఞాని చనిపోయిన వారి గురించి ఆలోచించడు, చింతించడు అన్నారు. మీరు అభిమన్యుని వృత్తాంతం తెలుసుకుంటే ఈ విషయం అర్థమవుతుంది. అర్జునుడికి తన కుమారుడైన అభిమన్యుడిపై ఎంతో ప్రేమ. అభిమన్యుడు మరణించిన తర్వాత అర్జునుడు తీవ్రంగా బాధపడ్డాడు. తన కుమారుడిని తలచుకుంటూ చింతించాడు.

శ్రీకృష్ణుడు అర్జునుడికి కేవలం మాటలతో "చనిపోయిన వారి

గురించి ఆలోచించకు, నీ కర్తవ్యాన్ని నీవు చేసుకో" అని చెప్పి ఉంటే, అర్జునుడికి ఆ విషయం పూర్తిగా అర్థం కాకపోవచ్చు. అందుకే శ్రీకృష్ణుడు అర్జునుడికి ఒక అనుభవాన్ని కలిగించాడు. అర్జునుడిని అభిమన్యుడు ఉన్న లోకానికి పంపించాడు. అక్కడ అర్జునుడు అభిమన్యుడిని చూసి, "అభిమన్యా! నేను నీ తండ్రిని" అన్నాడు. అప్పుడు అభిమన్యుడు అర్జునుడిని చూసి, "ఎవరు నువ్వు?" అని అడిగాడు. అర్జునుడు ఆశ్చర్యపోయాడు. "ఏమిటి? నేను నీ తండ్రిని కదా!" అన్నాడు. అభిమన్యుడు మళ్ళీ, "ఏ తండ్రి?" అని అడిగాడు. అప్పుడు అర్జునుడికి అసలు విషయం అర్థమైంది. "ఇప్పటికే అభిమన్యుడు నన్ను మర్చిపోయాడు. కానీ నేను మాత్రం అభిమన్యుడిని తలచుకుంటూ, బాధపడుతున్నాను. ఎంతటి అజ్ఞానం!" అని అర్థం చేసుకున్నాడు. అర్జునుడికి జ్ఞానం కలిగింది, తిరిగి శ్రీకృష్ణుడి దగ్గరకు వచ్చి తన కర్తవ్యాన్ని కొనసాగించాడు.

ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం ఏమిటంటే సంబంధాలు శరీరానికి సంబంధించినవి, ఆత్మకు శాశ్వతమైన సంబంధాలు లేవు. శరీరం మారుతుంది. సంబంధాలు మారుతాయి. జన్మలు మారుతాయి. కానీ ఆత్మ మాత్రం నిత్యమైనది. మరి జ్ఞాని ఎలా జీవిస్తాడు?

మీరు నిజంగా జ్ఞానాన్ని పొందిన వారైతే, మీకు ఎంతో దగ్గరైన వ్యక్తి అయినా సరే  భార్య అయినా, భర్త అయినా, కొడుకు అయినా, కూతురు అయినా, తల్లి అయినా, తండ్రి అయినా  వారు శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత, వారి గురించి జీవితాంతం చింతిస్తూ కూర్చోరు. బాధ అనిపించడం సహజం, ఒక రోజు బాధపడవచ్చు, రెండు రోజులు బాధపడవచ్చు, మూడు రోజులు బాధపడవచ్చు. ఎందుకంటే మనసుకు అలవాటైన సంబంధం ఒక్కసారిగా దూరమైంది.

కానీ ఆ బాధను జీవితాంతం మోసుకెళ్ళడం జ్ఞానం కాదు. వారి

ప్రయాణాన్ని వారికి వదిలేసి, "ఇప్పుడు నేను చేయవలసిన కర్తవ్యం ఏమిటి?" అనే ప్రశ్న మీద మీరు దృష్టి పెట్టాలి, అదే జ్ఞాని లక్షణం. గతాన్ని మార్చలేరు. చనిపోయిన వ్యక్తిని తిరిగి తీసుకురాలేరు, కానీ మీ చేతిలో ఉన్న వర్తమానాన్ని మాత్రం సద్వినియోగం చేసుకోవచ్చు.

మీరు ఎన్నో సంవత్సరాలుగా ధ్యానం చేస్తున్నారు, స్వాధ్యాయం చేస్తున్నారు, సత్సంగాలు వింటున్నారు, జ్ఞాన సందేశాలు వింటున్నారు, జూమ్ క్లాసులకు హాజరవుతున్నారు. ఇవన్నీ చేస్తున్నప్పటికీ ఒక సంఘటన జరిగినప్పుడు మీరు పూర్తిగా కుంగిపోయి, రోజులు, నెలలు, సంవత్సరాలు అదే విషయాన్ని తలచుకుంటూ ఉంటే, ఒకసారి మీరు మీలోకి చూసుకోవాలి.

"నేను విన్న జ్ఞానం నా జీవితంలో ఎంతవరకు ఆచరణలోకి వచ్చింది?" అని మీరే మిమ్మల్ని ప్రశ్నించుకోవాలి. జ్ఞానం అంటే పుస్తకంలో ఉండే విషయం కాదు. జ్ఞానం అంటే క్లాస్‌లో విని మర్చిపోయే విషయం కాదు. జ్ఞానం అంటే నోటితో చెప్పే మాట కాదు, జ్ఞానం అంటే పరిస్థితి వచ్చినప్పుడు మీ ప్రవర్తనలో కనిపించేది. అందుకే మీరు నిజంగా జ్ఞానవంతులా? కాదా? అనేది మీకు కష్టమైన పరిస్థితి వచ్చినప్పుడు తెలుస్తుంది.

ఈ మధ్య గుంటూరుకు చెందిన ప్రసన్న కొడుకు వాళ్ళ నాన్న మీద కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆమె చాలా బాధపడి ఏడుస్తూ నాకు ఫోన్ చేసి, "ఏం చేయమంటారు?" అని అడిగింది. నేను ఆమెతో, "ఏడవడం వల్ల సమస్య పరిష్కారం అవుతుందా? బాధపడుతూ కూర్చోవడం వల్ల మీ అబ్బాయి తిరిగి వస్తాడా? ఇప్పుడు మీరు ఏం చేయాలో ఆలోచించండి" అని చెప్పాను.

ఆమె ఏడుస్తూ ఉండటం వల్ల సమస్య పరిష్కారం కాదు. ప్రశాంతంగా ఆలోచించి, ఏం చేయాలి? ఎక్కడ వెతకాలి? ఎవరిని సంప్రదించాలి? అనే

విషయాలు ఆలోచించాలి. తర్వాత అతను వైజాగ్ వైపు వెళ్ళాడని తెలిసింది. అక్కడ ఉన్న వాళ్ళ ద్వారా సమాచారం తెలుసుకుని, చివరకు అతన్ని తిరిగి గుంటూరు తీసుకురావడం జరిగింది. ఇక్కడ నేను ప్రసన్నను తప్పుపట్టడం లేదు. ఆమెను ఉదాహరణగా తీసుకుని మనల్ని మనం పరిశీలించుకోవాలి.

ఎన్నో సంవత్సరాలుగా మీరు ధ్యానం చేస్తున్నారు. స్వాధ్యాయం చేస్తున్నారు. సత్సంగం వింటున్నారు. జ్ఞానం తెలుసుకుంటున్నారు. అయినా ఒక సంఘటన జరిగిన వెంటనే మీరు పూర్తిగా కుంగిపోతే, మీరు విన్న జ్ఞానం ఇంకా ఆచరణలోకి రాలేదని అర్థం.

ఒక వ్యక్తి ఇంటి నుంచి వెళ్ళిపోతేనే మీరు అంతగా కుంగిపోతే, అదే వ్యక్తి శరీరాన్ని విడిచిపెడితే మీ మనసు పరిస్థితి ఎలా ఉంటుంది? అందుకే జ్ఞానం ఇప్పుడు నుంచే ఆచరణలోకి రావాలి. మీ శరీరం మీరు కాదు. మీకు ఒక వ్యాధి వచ్చినప్పుడు కూడా ఇదే జ్ఞానం గుర్తుండాలి. క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధి వచ్చినా, ప్రమాదం జరిగినా, జీవితంలో పెద్ద కష్టం ఎదురైనా, జ్ఞాని చలించిపోడు. ఎందుకంటే అతనికి ఒక విషయం స్పష్టంగా తెలుసు “ఈ దేహం నేను కాదు నేను ఆత్మను” అని. దేహానికి పుట్టుక ఉంది, దేహానికి మార్పు ఉంది, దేహానికి వృద్ధాప్యం ఉంది, దేహానికి మరణం ఉంది, కానీ ఆత్మకు మరణం లేదు.

ఈ శరీరంతో మీరు చేయవలసిన కర్మ పూర్తయ్యే వరకు ఈ శరీరంలో ఉంటారు. కర్మ పూర్తయిన తర్వాత ఈ శరీరాన్ని విడిచిపెడతారు. మరొక శరీరాన్ని స్వీకరించి, మరొక జీవితంలో కొత్త అనుభవాలను పొందుతారు. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవాడు ప్రతి పరిస్థితిలోనూ స్థిరంగా ఉండగలడు.

అందుకే పత్రి గారు చెప్పారు ఆత్మ జ్ఞాని చనిపోయిన వారి గురించి ఆలోచించడు, చింతించడు. బాధపడటం అనవసరం, ఆలోచిస్తూ తన విలువైన

సమయాన్ని వృథా చేసుకోవడం అనవసరం అని తెలుసుకుంటాడు. మీ సమయాన్ని మీరు ఎంత వృథా చేస్తే, అంతగా జన్మలు పెరుగుతాయి. మీ సమయాన్ని మీరు ఎంత సద్వినియోగం చేసుకుంటే, మీకు అంతగా జన్మలు తగ్గుతాయి. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోండి.

నేను చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ వ్రాసుకుని, పదే పదే ఆలోచించాలి. వ్రాసుకోకుండా కాలక్షేపంగా వింటే ఏం ఉపయోగం లేదు. మీరు జ్ఞానం పొందాలంటే వినడం మాత్రమే సరిపోదు, మీరు విన్న ప్రతి మాట మీ ఆచరణలోకి రావాలి. నా నోటి నుంచి వచ్చిన ప్రతి మాట మీలోకి వెళ్ళాలి, నా ముఖం చూస్తే ఏం ఉపయోగం లేదు, నేను చెప్పే విషయాన్ని శ్రద్ధగా విని, వ్రాసుకుని, చదివి, ఆలోచించి, ఆచరించాలి. అలా ఉండే వారిలో మధు ఒకడు. నేను గమనించాను ఏ క్లాస్‌కి వచ్చినా, చెప్పిన సబ్జెక్టే చెప్పినా, మధు ప్రతి మాట వ్రాసుకుంటాడు. నిజంగా దాని ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది, ఇప్పుడు మంచి మాస్టర్ అయ్యాడు.

మీలో చాలా మంది, "నేను మాస్టర్ అవ్వలేకపోతున్నాను, నేనేం చెప్పలేకపోతున్నాను, నేను సార్ దృష్టిలో పడలేకపోతున్నాను" అంటూ బాధపడుతుంటారు. అది మీ లోపమే తప్ప ఇంకెవరి లోపం కాదు. మీరు బాధపడితే ఎదగలేరు, కృషి చేస్తే ఎదుగుతారు, శ్రద్ధ పెడితే ఎదుగుతారు. ఏడుస్తూ నా దగ్గరికి వచ్చి, నాకు ఫోన్లు చేసి బాధపడితే ఉపయోగం ఏమిటి? నేను ఏం చేస్తాను? నాలో ఉన్న శ్రద్ధ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. మీకు శ్రద్ధ లేకుండా, కృషి చేయకుండా, బాధపడితే మీరు ఎదిగిపోతారా? చెప్పిన ప్రతి మాట వ్రాసుకోవాలి, నా నోటి నుంచి వచ్చిన ప్రతి మాటను శ్రద్ధగా స్వీకరించాలి.

మీ మూర్ఖత్వమే మిమ్మల్ని ఎదగకుండా చేస్తుంది. మీ అశ్రద్ధే మిమ్మల్ని

ఎదగకుండా చేస్తుంది. మీ కృషిలో లోపమే మిమ్మల్ని ఎదగకుండా చేస్తుంది. మీరు ప్రక్క వాళ్ళతో మిమ్మల్ని మీరు పోల్చుకుంటూ వెళ్తారు. కానీ వాళ్ళు ఎదగడానికి చేసిన కృషి ఏమిటో? మీకు తెలియదు. అందువల్ల ముందుగా మీలో ఉన్న లోపాన్ని మీరు గుర్తించాలి. ఏడిస్తే ఎదగరు, బాధపడితే ఎదగరు, సమయాన్ని వృథా చేసుకుంటే ఎదగరు, కృషి చేస్తేనే ఎదుగుతారు. ఇదే విషయాన్ని పత్రి గారు కూడా చెప్పారు. "ఆత్మజ్ఞాని చనిపోయిన వారి గురించి ఆలోచించడు, చింతించడు అని".

ఎవరైనా నా దగ్గరకు వచ్చి వారి సమస్యలు చెప్తారు. "ఏం చేయాలి?" అని అడుగుతారు. వారి సమస్యలను వారే పరిష్కరించుకోవాలి, వారి కృషిని వారే చేయాలి. అవన్నీ మానేసి నా దగ్గరకు వచ్చి బాధపడితే నేను ఏం చేస్తాను? ఎవరి కర్మను వారు అనుభవించాలి. ఎవరి కృషిని వారు చేయాలి. ఎన్నో సార్లు చెప్పాను సాధన, స్వాధ్యాయం, సత్సంగం, వినడం, చదవడంతో పాటు కొంత సేవ కూడా మీరు చేయాలి. ఎన్ని సార్లు చెప్పినా కొంతమంది ఆ విషయం అర్థం కాదు. ఎవరు కృషి చేస్తే వారు ఎదుగుతారు, ఎవరు సేవ చేస్తే వారు ఎదుగుతారు, ఎవరు శ్రద్ధ పెడితే వారు ఎదుగుతారు. మీ అజ్ఞానమే మిమ్మల్ని ఎదగకుండా చేస్తుంది. మీ అశ్రద్ధే మిమ్మల్ని ఎదగకుండా చేస్తుంది, మీ నిర్లక్ష్యమే మిమ్మల్ని ఎదగకుండా చేస్తుంది, మీ కృషిలో లోపమే మిమ్మల్ని ఎదగకుండా చేస్తుంది.

అందుచేత ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోండి. ఈ పాయింట్ చెప్పినప్పుడు నాకు ఒక విషయం అనిపించింది. ఎంతోమంది అశ్రద్ధతో, నిర్లక్ష్యంతో నా దగ్గరకు వచ్చి బాధపడుతూ ఉంటారు. అలాంటి అజ్ఞానుల కోసం, మూర్ఖుల కోసం, నేను మళ్ళీ మళ్ళీ ఈ విషయాలను చెప్పాల్సి వస్తుంది. నేను రోజూ చెప్తూ ఉంటే, కొంతమంది "ఇదేదో కాలక్షేపం" అనుకుంటారు.

ఇష్టం ఉంటే వ్రాసుకుంటారు, లేకపోతే వ్రాసుకోరు. బద్ధకం ఉంటే ఏం చేయగలం? ఎవరినైనా తిట్టడం వల్ల పరివర్తన వస్తుందని అనుకోవద్దు. కొంత మందిని ఎంత తిట్టినా మార్పు రాదు, పైగా అహంకారం పెరుగుతుంది. అందుకే వారి కర్మను వారికి వదిలేయాలి. మీరు మాత్రం జ్ఞానాన్ని పొందిన వారిగా, ఆత్మజ్ఞాని లక్షణాలను ఆచరించే వారిగా ఉండాలి.

ఆత్మజ్ఞాని చనిపోయిన వారి గురించి ఆలోచించడు, చింతించడు. తన సమయాన్ని వృథా చేయడు. తాను చేయవలసిన పనులను ఆపడు. తన భవిష్యత్తును నాశనం చేసుకోడు. గతంలో జరిగిన సంఘటనల దగ్గరే ఆగిపోకుండా, వర్తమానంలో తాను చేయవలసిన కర్తవ్యంపై దృష్టి పెడతాడు. అందువల్ల మీరు కూడా ఈ విషయాన్ని కేవలం చదివి వదిలేయకుండా, మీ జీవితంలో ఆచరణలో పెట్టండి. అప్పుడు మాత్రమే పత్రి గారు అందించిన జ్ఞానానికి నిజమైన ఫలితం లభిస్తుంది.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు :

**సింధూర, 8555995217**

# ఆత్మజ్ఞాని గతాన్ని వదిలి వర్తమానంలో జీవిస్తాడు

ఆత్మజ్ఞాని "గతం గత:" అన్నట్లుగా ఉంటాడు. అంటే జరిగినది జరిగిపోయింది అని తెలుసుకుని, గతాన్ని పట్టుకుని కూర్చోడు. పాత విషయాలను వదిలేస్తాడు. ఎప్పుడూ వర్తమానంలో జీవిస్తాడు. గతాన్ని బట్టి కాకుండా వర్తమానంలో ప్రస్తుతం తాను ఏమి చేయాలో అదే చేస్తాడు. గతంలో జరిగిన సంఘటనలను పదే పదే గుర్తు చేసుకుంటూ బాధపడడు.

అజ్ఞాని మాత్రం గతాన్ని మనో ఫలకంపై అలాగే ఉంచుకుని, జరిగిన విషయాలను పదే పదే గుర్తు చేసుకుంటూ నిరంతరం కుమిలిపోతూ ఉంటాడు. కానీ ఆత్మజ్ఞాని తన మనోఫలకంపై వ్రాయబడిన వాటిని ఎప్పటికప్పుడు తుడిచేస్తూ ఉంటాడు. ఇది ఎందుకు అవసరం అంటే, మనో ఫలకంపై గతంలో జరిగిన సంఘటనలు అలాగే పేరుకుపోతే, కొత్త విషయాలకు స్థలం ఉండదు. అందుకే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారా మనసులో పేరుకుపోయిన పాత జ్ఞాపకాలను, ఆలోచనలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

క్లాస్‌రూమ్‌లో బ్లాక్‌బోర్డ్‌పై టీచర్ వ్రాసిన విషయాలను ఎప్పటికప్పుడు తుడి చేస్తారు కదా? అలా తుడవకుండా అదే బోర్డుపై మళ్ళీ మళ్ళీ క్రొత్త విషయాలు వ్రాస్తూ పోతే ఏమవుతుంది? పాతవి, కొత్తవి అన్నీ కలిసిపోయి ఏది ఏమిటో తెలియదు. ఏం అర్థం కాదు, మొత్తం గందరగోళంగా ఉంటుంది.

మీ జీవితం కూడా అలాగే ఉంటుంది. మనోఫలకంపై గతంలో జరిగిన విషయాలను అలాగే ఉంచుకుని, వాటిని తుడవకుండా మళ్ళీ మళ్ళీ కొత్త విషయాలను వ్రాస్తూ ఉంటే జీవితం మొత్తం గందరగోళంగా మారుతుంది.

అందుకే ఆత్మ జ్ఞాని గతాన్ని పట్టుకుని కూర్చోడు. గతాన్ని వదిలి, వర్తమానంలో జీవిస్తూ, ప్రస్తుతం చేయవలసిన కర్తవ్యాన్ని సక్రమంగా చేస్తాడు.

కాబట్టి మీరు కూడా మీ మనో ఫలకాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. గతంలో జరిగిన సంఘటనలను పట్టుకుని బాధపడకుండా, "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారా మనసును ప్రశాంతంగా చేసుకుని, వర్తమానంలో జీవించాలి. అదే ఆత్మజ్ఞాని జీవించే విధానం. అందుచేత ఇది ఎప్పుడూ గుర్తుంచుకోండి. మనోఫలకం మీద నిన్నటిది ఉండకూడదు, ఈరోజుదే ఉండాలి.

అందుకే మీరు ఏం చేస్తున్నారు? ప్రతిరోజూ రెండున్నర గంటలు మార్నింగ్ జూమ్‌లో "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తున్నారు. ముందు రోజు జరిగిపోయినవన్నీ తుడిచేస్తున్నారు. మళ్ళీ ఆ రోజును ఫ్రెష్‌గా ప్రారంభిస్తున్నారు. అలా చేసినవారు జీవితంపై మంచి పట్టు సాధిస్తారు. అందుకే భీమవరం ఎందుకు రమ్మంటాను అంటే, మార్నింగ్ జూమ్‌లో ఎంత తుడిచినా ఇంకా కొన్ని ఉంటాయి, ఈ నెలలో అవి పేరుకుపోతాయి. అవన్నీ భీమవరం మూడు రోజుల క్లాస్‌లో పూర్తిగా తుడిచేసి, మనోఫలకాన్ని ఖాళీ చేసుకుంటారు.

అది నేను ఇంకా ఏం చెప్తున్నాను అంటే, మళ్ళీ 15 రోజులకు కొంత మనోఫలకం ఖరాబ్ అవుతుంది. అవకాశం ఉంటే కడ్తాల్‌కు కూడా వెళ్ళమంటాను. కానీ భీమవరం మాత్రం మానొద్దు అంటాను. అందుచేత అను నిత్య ధ్యానం చేయాలి. అలా చేసినప్పుడే ఎవరైనా వర్తమానంలో జీవించగలుగుతారు, అవసరమైనవి స్వీకరించగలుగుతారు. అందుకే పత్రి గారు ఏమన్నారంటే, **"గతాన్ని విగతం చేసుకున్నప్పుడు వర్తమానం ఒక బహుమానం అవుతుంది."**

అలాగే మీరు ఏదైనా వింటున్నప్పుడు కూడా గతాన్ని తుడిచేసుకుని వినాలి. అప్పుడే అది బాగా అర్థమవుతుంది. లేకపోతే ఏమీ అర్థం కాదు. మీరు చూడండి, ప్రకృతి ఏం చేస్తుందంటే, మానవులందరికీ గత జన్మలో

జరిగినవన్నీ కూడా తుడిచేసి ఫ్రెష్‌గా భూమి మీదకు పంపిస్తుంది. ఇంక వీళ్ళకు అవి అవసరం లేదు. వీళ్లు ఇంకా కొత్త పాఠాలు నేర్చుకోవాలి, నేర్చుకున్నవి, విన్నవి ఇంకేం చేసుకుంటారు అని చెప్పి ప్రకృతే తుడిచేసి పంపిస్తుంది.

అందుకే మీరు గత జన్మల్లో ఏం చేసినా, ఎన్ని చేసినా ఒక్కటి కూడా గుర్తుండవు. ప్రకృతి మనందరికీ చేసే ఒక గొప్ప బహుమానం ఏమిటంటే, వర్తమానంలో జీవించగలిగే అవకాశం కల్పించడం. ఎందుచేతనంటే, "పాత విషయాలు పాత చింతకాయ పచ్చడి, కొత్త విషయాలు కొత్త ఆవకాయ".

అందుచేత గతంలో జీవిస్తే అజ్ఞాని, వర్తమానంలో జీవిస్తే జ్ఞాని. అందుచేత 'గతం ధ్యానం ద్వారానే విగతం అవుతుందని తెలుసుకోండి". "వర్తమానంలో గతం లేకపోతే అది బహుమానం అవుతుంది". గతం ఉంటే వర్తమానం అవమానం అవుతుంది. అలాగే మీరు ఏ పుస్తకం చదివినా మీ మనసు వర్తమానంలోనే ఉండాలి, మనసు ఖాళీగా ఉంటే గతంలోకి వెళ్ళదు. మీరు విన్నవి, చదివినవి బాగా గుర్తుంటాయి. లేకపోతే మీరు విన్న వెంటనే అవి గుర్తుండవు. చెప్పమంటే, "అయ్యో!" అంటారు. ఎవరైతే మనోఫలకాన్ని శుద్ధిగా ఉంచుకుంటారో, వారు చెప్పమంటే అద్భుతంగా చెప్తారు. దాన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. నేను మాట్లాడిస్తున్నాను కదా? నేను చెప్పిన విషయాలు చెప్పాలంటే మళ్ళీ పుస్తకాలు చూస్తున్నారు. ఎంత మూర్ఖులో చూడండి!

పుస్తకం చూసి చదువుతారా? ఏం విన్నారో జ్ఞాపకం ఉంచుకుని చెప్పొచ్చుగా! అవి ఎదురుగా పెట్టుకుంటే గానీ మాట్లాడలేరు. మాట్లాడాలని ఉంటుంది. ఎదుటివాళ్ళకి బిల్డప్ ఇవ్వడానికి మీ దగ్గర ఏదో ఉందని చూపించాలనుకుంటారు. కానీ అసలు మీ లోపలికి ఎంత వెళ్లిందో కదా!

మీరు చూడండి, ఒక కాఫీ కప్పు నిండుగా ఉంది. దాంట్లో ఎంత కాఫీ పోసినా అది బయటికి పోతుంది కానీ కప్పులో ఉండదు. మీరు పోసిన కాఫీ కప్పులో ఉండాలి అంటే ముందు కప్పును ఖాళీ చేయాలి.

అందుకే మీరు ఏం చేస్తారంటే, మీరు క్లాస్ చెప్పేటప్పుడు ఒక గంటో, రెండు గంటలో ధ్యానం చేయిస్తారు. అంటే ఆ మనోఫలకాన్ని ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తారు. అప్పుడు మీరు విన్న క్లాస్ బాగా అర్థమవుతుంది. విన్న వాళ్ళంతా మంచి రెస్పాన్స్ ఇస్తారు. అందుచేత గుర్తుపెట్టుకోండి, మనసు ఖాళీగా ఉంటే గతంలోకి వెళ్ళరు, దాన్నే బుద్ధత్వం అంటారు.

మీరు కనుక గతంలో ఉంటే బుద్ధి లేనట్టే. **"బ్లాక్‌బోర్డ్ మీద వ్రాసినవి ఎలా తుడిచేస్తారో, మనోఫలకం మీద వ్రాసినవి కూడా అలాగే ధ్యానంలో తుడిచేయాలి".** ఇప్పుడు పత్రి గారు చెప్పిన ఎన్నో విషయాలు నేను చెప్తున్నాను. అవి ఒక్కొక్కటి ఎంత గొప్పవో, ఎంత ముఖ్యమైనవో మీరు అర్థం చేసుకోవాలి


**తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?**

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
12) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
13) భగవంతుడంటే - రూ.100/-
14) తెలుసుకోండి - రూ.100/-
15) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
16) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
17) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
18) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
19) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
20) కఠోపనిషత్తు - రూ.90/-
21) ఉపమాన జ్ఞాన సందేశాలు - రూ.90/-
22) గీతాసందేశం - రూ.80/-
23) ముఖ్యమైన సందేశాలు-1 - రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 - రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) పత్రీజీ జ్ఞాన సందేశాలు-1 - రూ.80/-
30) పత్రీజీ జ్ఞాన సందేశాలు-2 - రూ.80/-
31) పత్రీజీ జ్ఞాన సందేశాలు-3 - రూ.90/-
32) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
33) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
34) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
35) జ్ఞాన జ్యోతి - రూ.70/-
36) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
37) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
38) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
39) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
40) బుద్ధుని సందేశాలు - రూ.70/-
41) భూతదయే దైవత్వం - రూ.70/-
42) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
43) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
44) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
45) ఆశ్చర్యకరమైన విషయాలు - రూ.70/-
46) మానవునిలోని చెడు - రూ.70/-
47) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు - రూ.70/-
48) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
49) మోక్షం అంటే? - రూ.70/-
50) కబీరు సందేశాలు-1 - రూ.70/-
51) మనసు-1 - రూ.70/-
52) మనసు-2 - రూ.70/-
53) " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? " రూ.70/-
54) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే - రూ.70/-
55) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
56) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
57) ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు- రూ.70/-
58) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
59) కబీరు సందేశాలు-2 - రూ.60/-
60) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
61) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
62) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
63) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
64) అతీంద్రియ శక్తులు - రూ.60/-
65) ఆలోచించండి - రూ.60/-
66) నిర్వాణ మార్గం - రూ.60/-
67) ధ్యానులకు సూచనలు - రూ.60/-
68) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
69) మమకారం - రూ.60/-
70) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
71) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
72) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
73) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
74) సంకల్పమంటే? - రూ.50/-
75) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
76) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
77) అరిహంత్ - రూ.50/-
78) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
79) ఈ జీవితం ఎందుకు? - రూ.40/-
80) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
81) విదురుని సందేశాలు - రూ.40/-
82) మూడురకాల జీవితాలు - రూ.40/-
83) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
84) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
85) బ్రహ్మం అంటే? - రూ.40/-
86) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
87) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
88) మహాత్ముల సందేశాలు - రూ.40/-
89) సత్యం - రూ.40/-
90) చక్రాలు - రూ.40/-
91) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
92) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
93) మౌన ధ్యానం - రూ.40/-
94 )మనంఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
95) శాకాహారమే మానవాహారం - రూ.15/-
96) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



ప్రతి ఒక్కరూ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతోనే జన్మ తీసుకుంటారు. ఏ ప్రణాళిక లేకుండా, కాకతాళీయంగా ఎవరూ భూమ్మీదకు రాలేదు. జన్మ దేనికి తీసుకున్నారో, అంటే ఏ ప్రణాళికతో భూమ్మీదకు వచ్చారో ఆ ప్రణాళిక ప్రకారం జీవించి, దాన్ని పూర్తి చేసి తీరాలి. మీరు మీ ప్రణాళిక ప్రకారం జీవిస్తేనే నిజంగా జీవించినట్టవుతుంది, అలా జీవించకపోతే మీ జీవితం వృథా అయినట్టే.

కొంతమంది పిల్లల గురించి, కొంతమంది భర్త గురించి, కొంత మంది భార్య గురించి, కొంతమంది సంపాదన గురించి, మరి కొంతమంది సంపాదించిన దాన్ని కాపాడుకోవడం గురించి ఆలోచిస్తూ జీవితమంతా గడిపేస్తారు. ఏదో ఒక విషయంలో ఇరుక్కుపోయి, "నా జీవితం ఇదే" అని భావిస్తారు. అందుకే పత్రి గారు చెప్పారు "జన్మ దేనికి తీసుకున్నారో అది చేసి తీరాలి. ఏ ప్రణాళికతో భూమ్మీదకు వచ్చారో! ఆ ప్రణాళిక ప్రకారం జీవించి తీరాలి" అని, "అలా జీవిస్తే జీవించినట్టు, జీవించకపోతే మరణించినట్టు" అని ఎంతో కఠినంగా చెప్పారు.

**- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు**

రూ.**90**/-


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|